


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




గురువారం | 20-2-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 306 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి సా. 4.00 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 7.29 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: సా. 4.04-5.47; దుర్ముహూర్తం: ఉ. 10.34-11.20, మ. 3.11-3.57; అమృతఘడియలు: రా. 2.22-4.05; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 6.15 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore



నాబార్డు చైర్మన్‌గా

## చింతల

బ్యాంక్స్ బోర్డు బ్యూరో సిఫారసు

24 ఏళ్ల తరువాత తెలుగు వ్యక్తికి అవకాశం

8

## కలపతోనే స'కళ'ం

**మోదీ మనసు దోచిన నెల్లూరు హస్త కళాకారుడు**

స్పూన్లు, డైనింగ్ టేబుల్ మ్యాట్‌లు, గరిటెలు, హస్తాలు, జడపిన్నులు, కీచైన్‌లు, ఫొటోఫ్రేమ్‌లు, బొమ్మలు, ట్రేలు, పేపర్‌కట్ నైఫ్‌లు, ఫోర్క్‌లు... ఇలా 150 రకాల చెక్క ఉపకరణాలు. నెల్లూరు జిల్లాకు చెందిన తమ పూర్వీకులు అందించిన కళను... కొనసాగిస్తున్న షేక్ జాకీర్‌ను ప్రధాని మోదీ అభినందించారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన హునార్ హాట్ హస్తకళా వేదికను సందర్శించిన మోదీ.. అక్కడే నులక మంచంపై కూర్చుని భోజనం చేశారు.

2



## కం'భళా'.. తీరులు

సింథటిక్ ట్రాక్ కాదు. ఫ్యూమా బూట్లు లేవు. బురద మట్టిలో... పొగరెక్కిన ఆబోతులతో కలిసి పరుగు! అక్కడే రికార్డులు బద్దలవుతున్నాయి. పరుగులు ఉరకలెత్తుతున్నాయి. కర్ణాటక సంప్రదాయ క్రీడ కంబళ పేరు 'అంతర్జాతీయ' స్థాయిలో మార్మోగుతోంది.

ఏమిటీ కంబళ... ఎవరిదీ ఘనత? 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

10



# సెంటు మంట!

## పేదల కోసం పేదల స్థలాలే బలి



### ఇళ్ల స్థలాల కోసం అసైన్డ్‌పై అస్త్రం

**పేదలు, దళితుల భూముల సేకరణ**

**పీఓటీ పేరిట రైతులకు నోటీసులు జారీ**

**కిమ్మనకుండా అంగీకరించాలని ఒత్తిళ్లు**

**ఇచ్చేది లేదంటున్న పేద, దళిత రైతులు**

**రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు**



బుధవారం రాజధాని ప్రాంతంలో సర్వేకి వచ్చిన పెదకాకాని మండల తహసీల్దారు మల్లేశ్వరి కారును అడ్డుకున్న రైతులు.. కారులోనే తహసీల్దారు

'పెద్దలను కొట్టు... పేదలకు పెట్టు'... ఇది రాబిన్ హుడ్ పాలసీ!

'పేదలకు ఇంటి స్థలాల కోసం... పేదల స్థలాలనే పట్టు' ఇది మన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం!

**అసైన్డ్ వేటలో నిరసన మంట**

(భూ సేకరణలో ఎక్కడేం జరుగుతోందో రేపటి సంచికలో)

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ఉగాది నాటికి పాతిక లక్షల మందికి సెంటు చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామన్నది ప్రభుత్వ ప్రకటన! దీనికి సరిపడా ప్రభుత్వ స్థలాలు లేవు. ప్రైవేటు భూములు కొనుగోలు చేసేందుకు ఆర్థిక పరిస్థితీ సహకరించడంలేదు. అందుకే... గతంలో పేదలకు, ఇతర వర్గాల వారికి ఇచ్చిన అసైన్డ్ భూములపైన ప్రభుత్వ కన్ను పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అసైన్డ్ భూములపై సేకరణ అస్త్రం ప్రయోగిస్తున్నారు. నిరుపేద, దళిత, బలహీనవర్గాల దగ్గర ఉన్న సాగు భూములు వెనక్కు లాక్కొంటున్నారు. అదేమంటే పేదలకు ఇవ్వడానికే కదా అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. లాక్కున్నా ఏమీ చేయలేరన్న ధీమాతో పేదలు, దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములపై కన్నేశారు. కానీ నమ్ముకున్న

**మిగతా 12వ పేజీలో...**

### తహసీల్దార్ల దిగ్బంధం

9

**భూముల సర్వేకు రావడంపై అమరావతి రైతుల ఆగ్రహం**

**రాజధానిని అభివృద్ధి చేయకుండా మా భూములు నివేశన స్థలాలకా?**

**మాకే ఇవ్వలేదు.. పేదలకిస్తామంటారా?**

**అధికారులపై రైతుల ఆగ్రహం**



## మళ్లీ పరువు పాయె..!

ఏపీ వైఖరిపై వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో కథనం

పీపీఏల రద్దుతో పెట్టుబడిదారుల ఆందోళన

తగ్గిన పునరుత్పాదక విద్యుదుత్పత్తి, వినియోగం

చెల్లింపులకు 'నో'తో పెట్టుబడిదారుల ఆందోళన

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం పేరు మరోసారి 'అంతర్జాతీయ' స్థాయికెక్కింది! సౌర విద్యుదుత్పత్తికి, పెట్టుబడులకు విఘాతం కలిగిస్తున్న తీరు మళ్లీ వార్తాంశంగా మారింది. ఇలా విమర్శలు గుప్పించింది ప్రభుత్వ పెద్దలు తరచూ విరుచుకుపడే 'ఎల్లో మీడియా' కాదు! తెలుగురాష్ట్రాలకు చెందిన మీడియా కూడా కాదు. ఉత్తమ ప్రమాణాలు పాటిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో పేరున్న అమెరికాకు చెందిన 'వాల్‌స్ట్రీట్ జర్నల్' పత్రిక జగన్ ప్రభుత్వ

**మిగతా 2వ పేజీలో...**

### పీపీఏలను ఉల్లంఘిస్తే.. రాష్ట్రాల నుంచే రికవరీ!

**ప్రభుత్వ ఆస్తుల జప్తు కూడా.. చట్ట సవరణకు కేంద్రం రెడీ**

12

### కోర్టుకు హామీ ఇచ్చి చెల్లించరా?

ముమ్మాటికీ ధిక్కరణే.. ఇలాగైతే జైలుకు పంపుతాం

పీపీఏల వ్యవహారంలో హైకోర్టు హెచ్చరిక

ఆర్థికస్థితి లేకే చెల్లించలేదు: డిస్కంల వివరణ

### మోదీ గుడ్.. భారత్ బ్యాడ్




12

ట్రంప్‌గారి మాటలకు అర్థాలు వేరులే అని కొత్త పాట పాడుకోవాలేమో! ఆయనకు ప్రధాని మోదీ తెగ నచ్చేశారు. కానీ... భారత విధానాలు మాత్రం బ్యాడ్ అని పెదవి విరిచేశారు.



8

### బంగారం @ 42,000

ధగధగలో జిగేల్... ధర చూస్తే గుండె గుభేల్! పసిడి ధర పరుగులు పెడుతోంది. తులం 30 వేలు దాటినప్పుడే అమ్మో అనుకుంటే... ఇప్పుడు ఏకంగా 42 వేలకు చేరుకుంది.

10

### ఒక జీవో.. 11 తప్పులు

పుట్టా బదులు పుత్తా.. మల్లికార్జున బదులు మల్లిఖార్జున... ఇలా ఒక్క జీవోలో 11 తప్పులు! హవ్వ... గవర్నర్ పేరిట జారీ చేసే ఉత్తర్వుల్లోనే ముద్రా రాక్షసాలు!

### ఫసల్ బీమా ఐచ్ఛికం

12

రెండో దశ స్వచ్ఛ భారత్‌కు పచ్చజెండా

22వ లా కమిషన్‌కు ఓకే

పాడి పరిశ్రమకు వడ్డీ రాయితీ పెంపు

కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు

### ఇంజనీరింగ్‌లో 2 ఫీజులు

కన్వీనర్ కోటాకు రెట్టింపుగా మేనేజ్‌మెంట్ ఫీజు

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ద్వంద్వ ఫీజుల విధానం

10

90% కాలేజీలకు కనీస ఫీజు రూ.35-40 వేలు

### సీవీసీగా కొఠారి

బిమల్ జుల్కాకు సీఐసీ బాధ్యత

12






### కాలువ గట్లు ఖాళీ!

**వాటి వెంబడి ఇళ్ల తొలగింపు**

వాకింగ్ ట్రాక్‌లుగా మార్చాలి

సమీప ప్రాంతాల్లో పార్కులు

నిర్వాసితులకు వేరే స్థలాలు

సాగు-తాగుకు స్వచ్ఛ నీరే!

కాలువల శుద్ధికి ప్రత్యేక 'మిషన్'

అధికారులకు సీఎం ఆదేశం



12



12

### చైనా ల్యాబ్ నుంచే కొవిడ్-19

సౌత్ చైనా వర్సిటీ శాస్త్రజ్ఞుల వ్యాసం

వూహాన్ నుంచి క్షేమంగా స్వస్థలానికి ఇద్దరు గుంటూరు వాసులు

3

## వాళ్లకు పించన్ ఇచ్చారు




**'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం**

**అర్హులకు అందని పింఛన్లపై విచారణ**

**సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు**

**బాధితుల ఇళ్లకెళ్లి పింఛను మంజూరు**

బుధవారం పింఛన్ మంజూరైన కడప జిల్లా నాయునివారిపల్లెకి చెందిన రంగాని లక్ష్మీదేవి

2

# ఉన్మాద పాలన

## పేదల కడుపు కొడుతున్నారు

**ప్రత్యర్థులపై తప్పుడు కేసులు**

**ఆర్థిక మూలాలపై దాడులు**

**స్థానిక ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించండి**

**'వేదిక' కూల్చిననాడే తిరగబడితే ఇంత బరితెగించేవారు కాదు**

**జే-ట్యాక్స్ కడితేనే మంచి మద్యం**

**ఇక జుట్టుకు, చొక్కాకూ పన్ను**

**చైతన్య యాత్రలో బాబు ధ్వజం**



మార్టూరు బహిరంగసభకు హాజరైన జనం. (ఇన్‌సెట్)బొప్పూడి గుడి ముందు బాబు శంఖారావం

ఒంగోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యర్థుల ఆర్థిక మూలాలను దెబ్బతీయడం, తప్పుడు కేసులు బనాయించడం, పేదల కడుపు కొట్టడం వంటి చర్యలతో ముఖ్యమంత్రి జగన్ ఉన్మాద పాలన సాగిస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. ఆయన దూకుడు తగ్గాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపిచ్చారు. రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ టీడీపీ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలను ప్రారంభించింది. చంద్రబాబు దీనికి ప్రకాశం జిల్లాలో శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం 12 గంటలకు బొప్పూడి నుంచి పర్యటన ప్రారంభించిన ఆయన మార్టూరు, మేదరమెట్ల, ఒంగోలులో

**మిగతా 2వ పేజీలో...**

### హరిత గోవిందం

తిరుమల అంటే... సకలం, సర్వం వేంకటేశ్వరుడే! ఇప్పుడు... సరికొత్తగా భక్తులకు దారిపొడవునా హరిత గోవిందుడు దర్శనమిస్తున్నాడు! ఆకర్షణీయమైన రంగులతో శంఖు, చక్రాలు, గోవింద నామాలు చిత్రించిన తొట్టెలలో పూల చెట్లు, సువాసనలు వెదజల్లే మొక్కలను నాటుతున్నారు.





పరంజ్యోతి

## ఈశ్వరస్సర్వభూతానాం..



*శివేతి చ శివం నామ యస్య వాచి ప్రవర్తతే*
*కోటి జన్మార్జితం పాపం తస్యనశ్యతి నిశ్చితమ్*

'శివ' అను మంగళకరమైన నామం ఎవరి నోట వస్తుందో అలాంటివారికి కోటి జన్మల పాపాలు నశించడం నిశ్చయమని బ్రహ్మవైవర్తపురాణం చెబుతోంది. శివుని స్వరూపం నుంచే సృష్టి రహస్యం స్పష్టమవుతోంది. లింగం సృష్టికి సంకేతం. ఆద్యంతాలు లేని భగవత్స్వరూపానికి చిహ్నం.. లింగం. శివరాత్రి అనగా మంగళకరమైన రాత్రి. మన మనస్సును మంగళకరమైన శివనామంతో సద్వినియోగం చేసుకోవడమే జాగరణ. శివలింగంలోని పానవట్టంలో మూడు స్థాయుల పీఠం ఉంటుంది. ఆ మూడు స్థాయులనూ మూడు గుణాలుగా గుర్తించాలి. పైనున్న లింగం జీవిత లక్ష్యాన్ని సూచిస్తుంది. ఈశ్వరుని మూడో కన్ను.. మూడు లోకాల ప్రతిరూపం. శివుడి చేతిలో త్రిశూలం.. మూడు కాలాలకు ప్రతి రూపం. త్రిగుణాలు త్రిమూర్తిత్వానికి ప్రతి రూపం. కనుక త్రిలోక, త్రికాల, త్రిమూర్తి స్వరూపమే ఈశ్వరత్వం. ప్రతి మనిషియందూ ఈశ్వరత్వం ఉంటుంది. మన బుద్ధి, జ్ఞానం, ఆరోగ్యం, సంపద, విద్య... అన్నీ ఈశ్వరత్వానికి సంబంధించినవే. పరమశివుడు ధరించినవన్నీ జ్ఞాన, వైరాగ్య చిహ్నాలే. శివుని చేతిలోని త్రిశూలం కాలానికి సూచిక. అట్టి కాలమును చేతిలో పట్టుకొన్నవాడు కాబట్టి శివుడు కాలాతీతుడు. ఎడమచేతిలో డమరుకం శబ్దబ్రహ్మాన్ని తెలుపుతుంది. దానిలో నుండి నృత్యానికి పనికొచ్చే శబ్దాలు వస్తాయి. అందుచేత శివుడు నటరాజైనాడు. ఆ స్వామి కట్టుకున్నది పులిచర్మం. పశుత్వాన్ని అణచివేసే పశుపతి తత్వానికది ప్రతీక. ఆ వ్యాఘ్రాంబరధరుడు పూసుకున్నది భస్మం. శివుడు కామదహనం చేసి.. ఆ భస్మమును తన దేహము నిండా ధరించి కామ విజయాన్ని ప్రకటించాడు. ఆ చంద్రశేఖరుడి తలపై ఉండే నెలవంక జీవిత చైతన్యానికి, తలపైనున్న గంగ ప్రాణాధారానికి, శివుని దేహమందున్న పాములు ప్రాణికోటికి సంకేతాలు. అయిదు అక్షరాలతో కూడిన 'నమశ్శివాయ' అనే పంచాక్షరీ మహామంత్ర మననంతో అనేక జన్మల పాపం పటాపంచలవుతుంది. 'శంకర' అనేది ఈశ్వరుని మరోపేరు. 'శం' అనగా చిదానందం, ఆత్మానందం. 'కర' అనగా అందించేవాడు. ఆకాశమే అతని యొక్క నీలాలుగా, దిక్కులే అంబరములుగా కలిగినవాడు కనుక 'దిగంబరుడని' మరొక పేరు. పంచభూతములను పంచముఖములుగా ధరించినవాడు కనుక పంచాననుడు. సృష్టింపబడిన ప్రతిప్రాణికి అధిపతి కనుక భూతనాథుడు.

'ఈశ్వరస్సర్వ భూతానాం'.. అన్ని భూతములయందున్న చైతన్యశక్తియే ఈశ్వరతత్వము. 'యోగినాం పతయే నమః' అని కీర్తింపబడే యోగులకు యోగి, యోగీశ్వరేశ్వరుడు.. మహాశివుడు. వేదంలో శివుని.. 'ప్రథమో దైవ్యోభిషక్' అని స్తుతిస్తారు. అనగా శివుడు స్వయంగా వైద్యనాథుడు, ఆరోగ్యస్వామి, వైద్య నిపుణుడు కూడా. 'చంద్రశేఖరమాశ్రయే, మమ కింకరిష్యతి వై యమః' అని 'చంద్రశేఖరాష్టకం'లోని శ్లోకం. అనగా త్రిపురములను దగ్ధమొనర్చి, దేవతలచే కీర్తించబడిన చంద్రశేఖరుని ఆశ్రయిస్తే.. ఇక యముని వలన భయమేల కలుగుతుందని అర్థం.

- మేఘశ్యామ (ఈమని), 8332931376

## కదిలిన యంత్రాంగం

- అర్హులకు అందని పింఛన్లపై విచారణ
- సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు
- బాధితుల ఇళ్లకెళ్లి పింఛను మంజూరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడప, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'నచ్చినోళ్లకే పింఛన్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో బుధవారం ప్రచురితమైన కథనం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులు స్పందించడంతో జిల్లా అధికారులు బాధితుల ఇళ్లకు పరుగులు పెట్టారు. 'ఆంధ్రజ్యోతి' కథనంలోని బాధితుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టాలని కడప జిల్లా అధికారులకు సీఎంవో నుంచి ఆదేశాలు అందాయి. దీంతో కడప జిల్లా డీఆర్‌డీఏ పీడీ మురళి ఆయా మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో విచారణ చేయించారు. అర్హులైన వారికి పింఛన్ మంజూరు చేశారు. గాలివీడు మండలం నాయనోరిపల్లెకు చెందిన రంగాని లక్ష్మీదేవి పుట్టకతోనే దివ్యాంగురాలు. మనిషి సాయంలేనిదే కదలలేని పరిస్థితి. ఈమెకు 2005 నుంచి వికలాంగుల పింఛన్ వస్తోంది. రేషన్‌కార్డు సక్రమంగా లేదని ప్రస్తుతం పింఛన్ రద్దు చేశారు. 'ఆంధ్రజ్యోతి' ఆమె ఆవేదనను ప్రచురించింది. గాలివీడు ఎంపీడీవో అయాబ్ గ్రామానికి వెళ్లి ఆమె తల్లి శివలక్ష్మితో మాట్లాడారు. పింఛన్ మంజూరు చేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా.. కదల్లేని స్థితిలో ఉన్నట్లు డాక్టరు సర్టిఫికెట్ తీసుకొస్తే రూ.5 వేలు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. చెన్నూరు మండలం కొండపేటకు చెందిన తాడిగొట్ల చెన్నయ్య (68) ఎన్నో ఏళ్లుగా పింఛన్ అందుకుంటున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడి పింఛన్ వస్తోందంటూ వృద్ధాప్య పింఛన్ రద్దు చేశారు. ఎంపీడీవో మహబూబీ విచారించి పింఛన్ మంజూరు చేశారు. ఆ మెసేజ్ చూసుకున్న చెన్నయ్య ఆనందంలో మునిగిపోయారు. 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు. ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడుకు చెందిన వేమన సీతమ్మకు రద్దు చేసిన పింఛన్ తిరిగి ఇస్తామని అధికారులు తెలిపారు. లింగాలకు చెందిన కె.నాగేశ్వరరెడ్డితో పాటు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన బాధితులందరినీ విచారించి అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ అందేలా చూస్తామని డీఆర్‌డీఏ పీడీ మురళి వివరించారు.

### పింఛను రాక.. ఆగిన గుండె

తాడిపత్రి, ఫిబ్రవరి 19: పింఛను రావడం లేదన్న ఆవేదనతో వృద్ధుడి గుండె ఆగింది. అనంతపురం జిల్లా తాడిపత్రి సీపీఐ కాలనీకి చెందిన షేక్ హుస్సేన్‌పీరా (65) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. హుస్సేన్‌కు 2 నెలల ముందు వరకూ వృద్ధాప్య పింఛను వచ్చేది. వయసులో తేడా ఉందంటూ మున్సిపల్ సిబ్బంది ఆయన పింఛన్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. పింఛను రావడంలేదన్న బాధ, ఆందోళనతో ఆయన గుండెపోటుకు గురై చనిపోయాడని భార్య బాదాబీ, కుమారుడు షామీర్ వాపోయారు.

# చూడ 'చెక్క' నగిషీలు..!

### హస్తకళానైపుణ్యానికి కేరాఫ్ ఉదయగిరి

#### ఇక్కడి వస్తువులకు దేశవ్యాప్త గుర్తింపు



ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 19: హస్త కళారూపాలు చూడముచ్చటగా ఉంటాయి. చూడగానే మనసు దోచేస్తాయి. అందుకేనేమో నెల్లూరుజిల్లా ఉదయగిరి చెక్క నగిషీలు ప్రధాని మోదీని మెప్పించాయి. ఇక్కడి నగిషీ కేంద్రాల్లో మహిళల చేతి నుంచి జాలువారిన కళారూపాలు ఆయన్ను ఆకర్షించాయి. ఈ పనితనానికి శభాష్ అనేలా చేశాయి. ఉదయగిరి చెక్క నగిషీలకు 50 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడి నగిషీ కేంద్రంలో హస్తకళ ప్రాణం పోసుకుంటూ.. దేశవ్యాప్తంగా కళాభిమానులను ఆకట్టుకుంటోంది. నేడు ప్రధాని ప్రశంసలు అందుకున్న ఈ సంస్థకు ఆద్యుడు ఉదయగిరికి చెందిన షేక్ బషీర్. ఆయన కళకు వారసురాలిగా ఆయన కుమార్తె గౌసియా కొనసాగుతుండగా, సంస్థ నిర్వాహకుడిగా ఆమె కుమారుడు జాకీర్ హుస్సేన్ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఉదయగిరిలోని దిలావర్‌భాయ్ వీధికి చెందిన బషీర్ చెక్కనగిషీ వస్తువుల తయారీలో నేర్పరి. 1973లో 12 మంది మహిళలతో కలిసి చెక్కవస్తువుల తయారీని ప్రారంభించారు. అప్పట్లో ఈ వస్తువులకు మంచి డిమాండ్ ఉన్నా అనంతరం మార్కెట్‌లోకి వచ్చిన రకరకాల వస్తువుల వల్ల ఆదరణ తగ్గింది. అయినా వెనకడుగు వేయకుండా బషీర్ ఈ వస్తువులు తయారు చేసి ప్రదర్శనలు నిర్వహించేవారు. ఆయన ప్రతిభకు లేపాక్షి ద్వారా రాష్ట్రస్థాయిలో అవార్డు దక్కింది. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలు అందించాయి. దీంతో పలువురు మహిళలకు ఆ వృత్తిలో నైపుణ్యం సాధించేలా చర్యలు తీసుకొన్నారు. గతంలో ప్రస్తుత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సహకారంతో రూ.10 లక్షలు మంజూరు చేయించి కామన్ ఫెసిలిటీ కేంద్రాన్ని (ఉడ్ అండ్ కట్లర్) ఏర్పాటు చేశారు. అలాగే చైతన్యజ్యోతి వెల్ఫేర్ వారి సహకారంతో కర్రలు కత్తిరించే యంత్రాలను ఏర్పాటు చేయించి దీని బాధ్యతలను తన కుమార్తె గౌసియాకు అప్పగించారు. ఆమె సైతం అంకితభావంతో పని చేసి స్థానిక మహిళలకు చెక్కనగిషీ కళను నేర్పించారు. ఇప్పుడీ కేంద్రం మహిళలకు ఉపాధి చూపడంతోపాటు ఆర్థికంగా ముందుకు సాగేందుకు తోడ్పాటునందిస్తోంది.

### కలపతోనే సకలం

రాష్ట్రంలో చెక్క వస్తువుల తయారీ కేంద్రాలు నాలుగు ఉన్నాయి. అందులో నర్సీపట్నం, రాజంపేట, కొండపల్లిలో చెక్క బొమ్మలు తయారు చేస్తారు. ఉదయగిరిలో మాత్రం చెక్క నగిషీ వస్తువులు తయారు చేస్తారు. దీంతో ఉదయగిరికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఇక్కడ స్పూన్లు, డైనింగ్ టేబుల్ మ్యాట్‌లు, గరిటెలు, హస్తాలు, జడపిన్నులు, కీచైన్‌లు, ఫోటోఫ్రేమ్‌లు, బొమ్మలు, ట్రేలు, పేపర్ కట్ నైఫ్‌లు, ఫోర్కులు తదితర 150 రకాల వస్తువులు తయారు చేస్తారు.

### శభాష్ హుస్సేన్..!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హస్తకళా నైపుణ్యంతో తెలుగోడు తయారు చేసిన వస్తువులు భారత ప్రధాని నరేంద్ర మోదీ మనసు దోచుకున్నాయి. నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన ప్రముఖ హస్తకళాకారుడు షేక్ జకీర్ హుస్సేన్ పనితనాన్ని ప్రధాని మోదీ అభినందించారు. హుస్సేన్ కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి పని విధానం, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీలోని రాజ్‌పథ్ వద్ద ఏర్పాటు చేసిన 'హునార్ హాట్' హస్తకళా ప్రదర్శన దీనికి వేదికైంది. ఈ ప్రదర్శనను బుధవారం అకస్మాత్తుగా సందర్శించిన మోదీ అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశారు. ఈ సందర్భంగా సాక్షాత్తు ప్రధానమంత్రి తమ వస్తువులను చూసి, నైపుణ్యాన్ని అభినందించడంతో హుస్సేన్ కుటుంబం ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇది తమ అదృష్టంగా భావిస్తున్నామని హుస్సేన్ అన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కాగా ఈ స్టాల్‌ను మోదీ సందర్శించడం పట్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హనుమ నాయక్, ప్రభుత్వ కార్యదర్శి డా. అర్జా శ్రీకాంత్ ఆనందం వ్యక్తం చేశారు.

# ఉన్మాద పాలన

(మొదటి పేజీ తరువాయి)



ఒంగోలులో బుధవారం రాత్రి జరిగిన సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. స్థానిక ఎన్నికల్లో టీడీపీ వారు పోటీచేసేందుకు భయపడే విధంగా పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు చేశారని విమర్శించారు. 'పేదల కడుపు కొట్టే విధంగా పింఛన్ల రద్దు, చంద్రన్న బీమాలాంటి ప్రజోపయోగ పథకాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. అమరావతిని చంపేశారు. పోలవరాన్ని ముందుకు సాగనివ్వడం లేదు. ప్రజలు చైతన్యవంతులై పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించకపోతే జగన్ ఉన్మాద చర్యలకు అడ్డూఅదుపూ లేకుండాపోతుంది' అని సూచించారు. 'అమరావతిలో ప్రజావేదిక కూల్చినప్పుడే జనం తిరగబడి రోడ్డుపైకి వచ్చి తీవ్ర నిరసన తెలిపి ఉంటే రాష్ట్రంలో ఇంత విధ్వంసం జరిగేది కాదు. వైసీపీకి ఓట్లు వేసిన ప్రజలు ఈ 9నెలల పాలనపై మనస్సాక్షిగా ఆలోచించుకోవాలి. వైసీపీకి చెందిన దొంగలు ఇసుక అమ్మకాల నుంచి అన్నింటిలోనూ దోపిడీకి పాల్పడుతున్నారు. సాక్షాత్తూ స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా ఇసుక అమ్ముకుంటున్నారు. పంచాయతీరాజ్ మంత్రి పెద్దిరెడ్డి ఒక కాంట్రాక్టర్. ఆయన వ్యవహారశైలి చూస్తే దొంగ చేతికి తాళం ఇచ్చినట్లు ఉంది. జె(జగన్)ట్యాక్స్ కడితేనే మంచి మద్యం మార్కెట్‌లోకి వస్తోంది. లేకపోతే నాసిరకం మద్యం ఇస్తున్నారు. ప్రకాశం జిల్లా గ్రానైట్ వ్యాపారులపై రూ.1900 కోట్ల జరిమానా విధించారు. రాజకీయ కక్ష, జిల్లాపై కోపంతోనే టీడీపీకి చెం దిన శిద్దా రాఘవరావు, గొట్టిపాటి రవికుమార్‌లకు భారీ గా ఫైన్ వేశారు' అని మండిపడ్డారు. ఇంకా ఏమన్నారంటే..

### నా జీవితం తెరిచిన పుస్తకం

'నన్ను ఇబ్బందిపెట్టేందుకు లేనిపోని ఆరోపణలతో అవినీతి మకిలీ అంటించేందుకు యత్నిస్తున్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టాలని చూసినా ఎలుక తోక బొచ్చు కూడా దొరకలేదు. నా జీవితం తెరిచిన పుస్తకం. నా భద్రతను తొలగిస్తారట. తొలగిస్తే చూస్తా. ప్రజలే కాపాడుకుంటారు. అమరావతి కోసం వీరోచితంగా పోరాడిన శాసనమండలి చైర్మన్ షరీఫ్‌ను, టీడీపీ ఎమ్మెల్సీలను లోబరచుకునేందుకు వైసీపీ పెద్దలు ప్రయత్నించి అభాసుపాలయ్యారు. మీరిచ్చే శక్తితో రౌడీరాజ్యాన్ని అంతమొందించేందుకు ఈ ప్రజా చైతన్య యాత్రను రాష్ట్రమంతా కొనసాగిస్తా.'

### అడుగడుగునా ఘనస్వాగతం

చంద్రబాబు జిల్లాలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర తొలి రోజు ప్రకాశం జిల్లాలో విజయవంతంగా 60 కిలోమీటర్ల మేర సాగింది. మార్టూరు నుంచి ఒంగోలు వరకు దారిపొడవునా ప్రజలు ఘనస్వాగతం పలికారు.

### బొప్పూడిలో శంఖారావం

చిలకలూరిపేట: ప్రకాశం జిల్లా బయల్దేరిన చంద్రబాబుకు.. మార్గమధ్యంలో గుంటూరు జిల్లా చిలకలూరిపేట వద్ద టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యులు ఏఎంజీ చెక్‌పోస్టు వద్దకు చేరుకుని సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లను రద్దు చేయాలని నిరసన ప్రదర్శన చేసి.. చంద్రబాబుకు వినతిపత్రం అందించారు. అమరావతి పరిరక్షణ సమితి నాయకులు కూడా విజ్ఞాపన అందజేశారు. తర్వాత బొప్పూడి పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో బాబు పూజలు నిర్వహించారు. గుడి వద్ద ప్రత్యేక వాహనంపై శంఖం పూరించి ఆయన మార్టూరు బయల్దేరారు.

### 'పాల'వృద్ధి మా ప్రభుత్వ ఘనతే

నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు గణాంకాల ప్రకారం 55% పాల దిగుబడితో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినందుకు గర్వంగా ఉందని ప్రతిపక్ష నేత చంద్రబాబు పేర్కొన్నారు. అలాగే పాల ఉత్పత్తిలో 4వ స్థానాన్ని పొందడం సంతోషాన్నిచ్చిందని ఆయన బుధవారం ట్వీట్ చేశారు. '2014జూన్‌కు ముందు పాల ఉత్పత్తిలో 24% వృద్ధి ఉంటే, టీడీపీ ఐదేళ్ల పాలనలో దాన్ని 2019నాటికి రెట్టింపు చేశాం. దేశంలో సగటున ఏడాదికి 6% వృద్ధి ఉంటే, ఏపీలో 11.72%గా ఉందంటే ఐదేళ్లలో మేం చేసిన కృషికి నిదర్శన'మని వివరించారు. కానీ గత 9నెలల్లో అవన్నీ ఆపేశారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కనురెప్పల్ని సైతం మాయ చేయగల వైసీపీ నేతలు, కంటి వెలుగు పథకం అంటే ఏదో కొత్త పథకం అన్నట్లు బిల్డప్ ఇస్తున్నారని చంద్రబాబు ఎద్దేవా చేశారు.



## కక్ష సాధింపు ఫుల్.. అభివృద్ధి, సంక్షేమం నిల్

#### తుగ్లక్ పాలనకు పతనం ఆరంభం: లోకేశ్

మంగళగిరి టౌన్, ఫిబ్రవరి 19: వైసీపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే రాష్ట్రం సర్వనాశనమైందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు. 'ప్రతిపక్ష పార్టీపై కక్ష సాధింపు ఫుల్... అభివృద్ధి, సంక్షేమం నిల్. ఈ తొమ్మిది మాసాల్లో ప్రజల్ని ముంచే కార్యక్రమాలు తప్ప... తుగ్లక్ సీఎం చేసిన ఒక్క మంచి పనీ లేదు. దుర్మార్గ విధానాలను అవలంబిస్తున్న వైసీపీ ప్రభుత్వం పతనం ఆరంభమైంది' అని అన్నారు. బుధవారం మంగళగిరిలో ప్రారంభమైన ప్రజాచైతన్య యాత్రలో లోకేశ్ పాల్గొన్నారు. కియ, లులు, అదానీ వంటి సంస్థలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారని, నిరుద్యోగ భృతినీ రద్దు చేయడంతో యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. 3ముక్కల రాజధాని పేరుతో ప్రాంతాల మధ్య చీలికలు తెచ్చి, ప్రజల్లో చిచ్చు పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

# మళ్లీ పరువు పాయె..!

(మొదటి పేజీ తరువాయి)

వైఖరిని ప్రస్తావిస్తూ మంగళవారం ప్రత్యేక కథనం ప్రచురించింది. "విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై (పీపీఏ) ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పారిశ్రామికవేత్తల్లో గగ్గోలు పుట్టించింది. దీనివల్ల పునరుత్పాదక విద్యుత్ వినియోగం కూడా తగ్గింది. భారత్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగం ఇటీవలి వరకు బాగుండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. సౌర విద్యుత్ వినియోగం తగ్గడానికి ఆంధ్రప్రదేశ్‌లో అనుసరిస్తున్న విధానాలు కూడా కారణం. దక్షిణాది రాష్ట్రాల్లో మొన్నటివరకు అత్యధిక సౌర విద్యుత్ వినియోగించే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉండేది. ఇప్పుడు అత్యధిక బకాయిలున్న రాష్ట్రంగా నిలిచింది. పీపీఏలను సమీక్షిస్తాం, చెల్లింపులు చేయం అంటూ ఆ ప్రభుత్వం బెదిరించడం, కొనుగోలు ధర తగ్గిస్తామనడం పారిశ్రామికవేత్తల్లో కలవరం పుట్టించింది" అని 'వాల్‌స్ట్రీట్ జర్నల్' పేర్కొంది. ప్రభుత్వం అంటే నిరంతరం కొనసాగేది. ఒక ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను ఆ తర్వాత వచ్చే ప్రభుత్వం కొనసాగించాలి. అలాకాదని... ప్రభుత్వం మారగానే పాత విధానాలను తిరగదోడతామని, వాటితో సంబంధంలేదని అనడంతో రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితి నెలకొంది.

### అంతర్జాతీయంగా చెడ్డపేరు!

ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు రావాలంటే జాతీయంగా, అంతర్జాతీయంగా మంచి పేరు ఉండాలి. స్థిరమైన విధానాలు కొనసాగాలి. కానీ పీపీఏల రద్దు, రివర్స్ టెండరింగ్, కంపెనీల తరలింపు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దెబ్బతింది. పీపీఏల విషయంలో ఇప్పటికే జపాన్, ఫ్రాన్స్‌లాంటి దేశాలు కేంద్రానికి ఫిర్యాదు చేశాయి. ఇటీవల జరిగిన దావోస్ పెట్టుబడుల సదస్సులో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వద్ద కూడా ఈ అంశంపై చర్చ జరిగింది. ఇప్పుడు అమెరికాలో ప్రముఖ వార్తా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ కూడా ఇదే విషయాన్ని రాసింది. కియ మోటార్స్ తరలిపోతుందంటూ రాయిటర్స్ కూడా కథనాన్ని ప్రచురించింది. ఇది నిజం కాదని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ... ఆ కంపెనీ యాజమాన్యం అసంతృప్తితో ఉండడం వల్లే ఆ వార్త వచ్చిందనేది బహిరంగ రహస్యం అంటున్నారు. ఇలాంటి పరిణామాలు ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



జస్టిస్ శేషాద్రినాయుడును సత్కరిస్తున్న న్యాయవాదులు

## ఆదర్శనీయులు జస్టిస్ కోకా సుబ్బారావు

- బాంబే హైకోర్టు జస్టిస్ శేషాద్రినాయుడు ప్రశంస

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దివంగత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు ఆదర్శనీయమైన న్యాయమూర్తి అని, న్యాయవ్యవస్థకు ఆయన చేసిన సేవలు నిరుపమానమని బాంబే హైకోర్టు గోవా బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ దామా శేషాద్రినాయుడు శ్లాఘించారు. బుధవారం హైకోర్టు ప్రాంగణంలో అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జస్టిస్ శేషాద్రినాయుడు 'ప్రెసిడెంట్స్: కాన్సెప్ట్ అండ్ కన్ఫ్యూజన్స్' అనే అంశంపై ఉపన్యసించారు. ఏపీ హైకోర్టు నూతన భవనానికి రావడం, పాతమిత్రులను, సహచరులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్వాహకులు జస్టిస్ శేషాద్రినాయుడును సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వైవీ రవిప్రసాద్, అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ కృష్ణమోహన్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు హాజరయ్యారు.

## ఓటరు కార్డులో కుక్క ఫొటోనా?

- ఒకే వ్యక్తికి 12 ఓట్లా?.. హైకోర్టు ఆగ్రహం
- వివరణకు ఆదేశం.. విచారణ నేటికి వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుక్క ఫొటోతో ఓటరు గుర్తింపు కార్డు ముద్రించడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అసలు ఓటర్ల జాబితాలోకి కుక్క ఫొటో ఎలా వచ్చింది? కనీసం పరిశీలించకుండానే ఓటరు కార్డు ముద్రించేస్తారా? ఇదేం పని తీరు? ఇందుకు బాధ్యులెవరు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. అలాగే, ఒకే వ్యక్తికి 12 ఓట్లు కట్టబెడుతూ గుర్తింపుకార్డులు ఇవ్వడం పట్లా విస్మయం వ్యక్తం చేసింది. ఒకే వ్యక్తికి వేర్వేరు ఇంటి నంబర్లతో ఎలా గుర్తింపు కార్డు ఇచ్చారని నిలదీసింది. దీనిపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఎలాంటి సవరణలు చేపట్టకుండా, ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించకుండానే తుది జాబితాను సిద్ధం చేస్తున్నారని ఏలూరుకు చెందిన ఎస్‌వీ చిరంజీవి, ఎం.రాము, వి.శ్రీనివాసరావు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ముందు విచారణ జరిగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జాబితాలో జరిగిన పొరపాట్లను సవరిస్తున్నామని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, పూర్తి వివరాలందించేందుకు గడువు కావాలని అభ్యర్థించారు. న్యాయమూర్తి తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

## నగదు లేకున్నా 'చలో'!

- చలో కార్డుతో ఆర్టీసీలో నగదు రహిత ప్రయాణం: ఎండీ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకునే క్రమంలో ఏపీఎస్ఆర్టీసీ 'చలో కార్డు' ప్రవేశ పెట్టింది. ప్రయాణికులు ఈ కార్డు కొనుగోలు చేసి రీచార్జ్ చేసుకుంటే బస్సు ప్రయాణంలో 'ఈ-టికెట్' తీసుకోవచ్చు. విజయవాడ పరిధిలో తిరుగుతున్న 436 బస్సుల్లో ఈ విధానాన్ని బుధవారం నుంచి ప్రవేశ పెట్టారు. నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో 'చలో కార్డు'ను ప్రవేశ పెట్టిన ఎండీ మాదిరెడ్డి ప్రతాప్ మాట్లాడుతూ, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు టెక్నాలజీ వైపు అడుగులేస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నం పాలనాపరమైన రాజధాని కాబోతున్న తరుణంలో కొత్తగా 100 మల్టీ యాక్సిల్ బస్సులు కొనుగోలు చేసి అన్ని జిల్లాల కేంద్రాల నుంచి విశాఖకు నడిపే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అమరావతి బస్సులున్నట్లు కొత్త బస్సులకు 'డాల్ఫిన్ క్రూయిజ్' అని పేరు పెట్టినట్లు తెలిపారు.

## లోకం తీరు




## ఉష్ణోగ్రతలు

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 16.4 | 32.6 |
| అనంతపురం | 18.6 | 33.6 |
| గుంటూరు | 19.5 | 32.1 |
| విశాఖపట్నం | 21.4 | 30.6 |
| విజయవాడ | 22.0 | 32.0 |
| నెల్లూరు | 23.0 | 31.2 |

### శ్రీవారి దర్శనానికి 9గంటలు

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 65వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి దాదాపు 9గంటలు పడుతోంది. శుక్రవారం ఆర్జితసేవలకు సంబంధించి విజయాబ్యాంకులో గురువారం లక్కీడిప్‌లో జారీచేసే టిక్కెట్లు సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, వస్త్రాలంకరణ:1, అభిషేకం:10అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.



### మందగమనాన్ని గుర్తించరేం..?

*ఆర్థిక మందగమనాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించడం లేదు. ఇది దేశానికి మంచిది కాదు. మనం ఎదుర్కొంటున్న సమస్యలేవో అర్థం చేసుకోలేకపోతే సరైన నిర్ణయాలు, దిద్దుబాటు చర్యలు తీసుకోలేరు. ఇది అన్నింటికన్నా ప్రమాదకరం. 2024 నాటికి ఐదులక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు అనేది ఒట్టి ఆకాంక్ష, అభిలాష అని మాంటెక్‌సింగ్ అంటున్నారు. వృద్ధి రేటు పెంచడానికి గట్టి కృషి చేయాలన్నారు. ఇందుకు పన్ను సంస్కరణలు తేవాలంటున్నారు. ఇవన్నీ మంచి సూచనలు...*

- మన్మోహన్‌సింగ్, మాజీ ప్రధాని



### అయోధ్య మసీదుకూ నిధులివ్వాలి

*"అయోధ్యలో మసీదు నిర్మాణానికి కూడా ప్రభుత్వం నిధులివ్వాలి. రామ మందిర నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేసినపుడు మసీదుకు మాత్రం విడిగా ట్రస్ట్ ఎందుకు ఏర్పాటు చేయరు? ఎందుకు నిధులివ్వరు? బీజేపీ ప్రభుత్వం ప్రజలను మతపరంగా చీలుస్తోంది. ఈ వివక్ష తగదు..."*

- శరద్ పవార్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత

## కడుపునొప్పికి విరుగుడీ పెరుగు!

- కర్ణాటక శాస్త్రవేత్త గాయత్రి పరిశోధన
- 'ఆంధ్రజ్యోతి'తో ఇంటర్వ్యూ

మల్నాడు గిద్ద అనే ఆవుకు చాలా ప్రత్యేకతలున్నాయని.. ఈ ఆవు పాలతో తోడుపెట్టిన పెరుగుకు కడుపు నొప్పిని తగ్గించే లక్షణాలున్నాయంటున్నారు దేవనగరై విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ గాయత్రి దేవరాజ్. బయోఆసియా సదస్సు సందర్భంగా ఆమె తమ పరిశోధన విశేషాలను 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

### ఎఫ్లాటాక్సిన్‌తో ఆరోగ్య సమస్యలు

"ఎఫ్లాటాక్సిన్ చాలా ప్రమాదకరమైన పదార్థం. ఎస్పర్‌గిలిస్ అనే ఫంగస్ ద్వారా ఇది తయారవుతుంది. వేరుసెనగపప్పు, గోధుమలు మొదలైన వాటికి చెమ్మ తాకినప్పుడు ఈ ఫంగస్ వ్యాప్తి చెందుతుంది. ఎఫ్లాటాక్సిన్ బీ1 అనే దాని వల్ల కడుపునొప్పులు ఎక్కువగా వస్తాయి. దీనిని నిర్మూలించటానికి డాక్టర్లు యాంటీబయాటిక్స్ ఇస్తారు. దీంతో కడుపులో ఉండే మంచి బ్యాక్టీరియా కూడా చచ్చిపోతుంది. మంచి బ్యాక్టీరియాకి ఎటువంటి హాని చేయకుండా చెడు బ్యాక్టీరియాతో పోరాడే సహజమైన మందుల రూపకల్పనకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆవు పాలలో ఉండే మంచి బ్యాక్టీరియాపై మేము పరిశోధనలు మొదలుపెట్టాం. కర్ణాటకలో పెంచే మల్నాడ్ గిద్ద అనే రకం ఆవు పాలతో చేసిన పెరుగును 34 ప్రాంతాల నుంచి సేకరించి- వాటిలో ల్యాక్టోబాసిలస్ అనే మంచి బ్యాక్టీరియాను సేకరించాం. దీనిపై మరిన్ని పరిశోధనలు చేసినప్పుడు స్టెఫిలోకోకస్ ఎరిస్, సిహిరిచా కోలి వంటి ప్రమాదకరమైన బ్యాక్టీరియాను ఇవి నిర్మూలించగలవని తేలింది.

- స్పెషల్ డెస్క్

## 'దిశ' దీపికకు పదోన్నతి

▸ తెలంగాణకు గజరావు భూపాల్



అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): యువ ఐపీఎస్ అధికారిణి దీపికా పాటిల్‌కు పదోన్నతి లభించింది. 2014 బ్యాచ్‌కు చెందిన దీపిక విజయనగరం, రాజమండ్రి, తిరుపతిలో పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'దిశ' స్పెషల్ అధికారిగా ఉన్న ఆమెకు ఇప్పుడు ఎస్పీ ర్యాంకు అధికారిగా పదోన్నతి లభించింది. ఈ హోదాలో ఆమె అక్కడే కొనసాగుతారు. ఏపీ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి గజరావు భూపాల్ డిప్యుటేషన్‌పై తెలంగాణ కేడర్‌కు వెళ్లారు. 2008 బ్యాచ్‌కు చెందిన భూపాల్ నెల్లూరు, తిరుపతి అర్బన్ జిల్లాల ఎస్పీగా పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం ఆయనను ఆకస్మికంగా తిరుపతి నుంచి బదిలీ చేయడంతో, తెలంగాణ కేడర్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లేందుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. మూడేళ్లపాటు పొరుగు రాష్ట్రంలో పనిచేసేందుకు ఏపీ ప్రభుత్వం ఆయనకు అనుమతిచ్చింది.

## గస్తీలోనే ప్రాణం తీసుకున్నాడు!

▸ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

▸ సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకొని బలవన్మరణం



సతీష్ (ఫైల్)

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 19: విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో విధి నిర్వహణలో ఉన్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ బుధవారం తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్టీల్ ప్లాంట్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల సమీప రొంపపేటకు చెందిన సాధూ సతీష్ (30) సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్‌లో భార్య, రెండేళ్ల కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 15న తన తమ్ముడి వివాహం ఉందంటూ సతీష్ పది రోజులు సెలవు పెట్టాడు. తిరిగి మంగళవారమే విధుల్లో చేరాడు. రాత్రి షిఫ్ట్‌కు హాజరైన సతీష్ అప్పికొండ సమీపంలోని 11వ క్లాక్‌టవర్ పోస్టులో విధి నిర్వహణకు వెళ్లాడు. రాత్రి 12 గంటలకు గస్తీ సిబ్బంది సతీష్‌తో మాట్లాడారు. మళ్లీ రాత్రి ఒంటి గంట సమయంలో మాట్లాడేందుకు యత్నించగా సతీష్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో టవర్‌పైకి ఎక్కి పరిశీలించారు. గస్తీ సిబ్బంది సమాచారంతో స్టీల్‌ప్లాంట్ సీఐ సత్యనారాయణరెడ్డి, క్లూస్ టీమ్ సంఘటన స్థలికి వెళ్లి పరిశీలించారు. సతీష్ తన సర్వీసు రివాల్వర్‌తో గెడ్డం కింది భాగం నుంచి కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అందరితో కలిసిమెలిసి ఉండే సతీష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడనే విషయాన్ని సహోద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## జల వనరుల శాఖకు సీబీఐపీ అవార్డు

న్యూఢిల్లీ, అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సమీకృత జలవనరుల నిర్వహణలో రాష్ట్ర జల వనరుల శాఖకు కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) అవార్డు దక్కింది. రాష్ట్రంలో జల వనరుల శాఖ అనుసరిస్తున్న యాజమాన్య విధానాలు .. ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికలకుగాను 2020కి ఈ అవార్డు ప్రకటించారు. సీబీఐపీ 93వ వార్షికోత్సవం సందర్భంగా ఢిల్లీలో బుధవారం ఈ అవార్డును రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.నారాయణరెడ్డి అందుకున్నారు.

# టౌన్‌ప్లానింగ్‌లో అవకతవకలు



గుంటూరులో అక్రమ కట్టడాల కొలతలను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

▸ గుంటూరులో 8.20కోట్ల అవినీతి

▸ ప్రొద్దుటూరులో 132 ఫైళ్లు సీజ్

▸ అస్తవ్యస్తంగా రికార్డుల నిర్వహణ

▸ రెండోరోజు కొనసాగిన ఏసీబీ తనిఖీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌లైన్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ కార్యాలయాల్లోని పట్టణ ప్రణాళికా విభాగాల్లో ఏసీబీ తనిఖీలు బుధవారం కొనసాగాయి. గుంటూరు కార్పొరేషన్‌లో అధికారుల పరిశీలనలో భారీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ విభాగంలో 2013- 16వరకు రూ.8.20కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. కటాఫ్ డేట్ ముగిసిన తర్వాత ప్లాన్లు తీసుకున్న అనేక భవనాలకు కూడా బీపీఎస్ వర్తింపజేసి ప్లాన్లు మంజూరు చేశారని, పదేళ్లుగా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు అడ్డగోలుగా వ్యవహరించారని తేలింది. అనధికారికంగా నిర్మాణాలు, బీపీఎస్ అప్రూవల్స్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల మంజూరు వంటివి అడ్డగోలుగా చేసినట్లు చెబుతున్నారు. 2018 అక్టోబరులో ప్లాన్ తీసుకున్న ఒక భవన యజమానికి బీపీఎస్ కింద అక్రమ కట్టడాన్ని క్రమబద్ధీకరించారు. ఈ వ్యవహారంలో రూ.లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు గుర్తించారు. అనంతపురం జిల్లా కదిరి మున్సిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో అన్నీ అవకతవకలే ఉన్నాయని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. పదేళ్ల నుంచి రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. బిల్డింగ్ ప్లాన్లు లేకుండానే అనేక చోట్ల భవనాలు నిర్మించారని, తీసుకున్న ప్లాన్‌కు, నిర్మాణానికి సంబంధం లేకుండా వ్యవహరించారని తెలిపారు. అనేకచోట్ల ప్రతి నిర్మాణంలోనూ అవకతవకలకు పాల్పడినట్లు స్పష్టమవుతోందన్నారు. కీలక రికార్డులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ఏసీబీ అధికారులు మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. మైదుకూరు రోడ్డులోని రెండు ప్రాంతాల్లో, శ్రీరాములపేట, గాంధీరోడ్డులోని ఒక్కో ప్రాంతంలో నిర్మించిన కట్టడాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని గుర్తించారు. నిర్మాణాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న 132 ఫైళ్లల్లో అక్రమాలు గుర్తించి సీజ్ చేశారు. తాడేపల్లిగూడెంలోని ఎఫ్‌సీఐ కాలనీలోని ఓ భవనానికి సంబంధించి అనుమతుల్లో ఉన్నదానికంటే ఎత్తుగా, అదనంగా మరో అంతస్తు నిర్మించినట్టు తేలింది. ఏలూరు రోడ్డులోని 21వ వార్డులో ఒక భవనానికి వాణిజ్య నిర్మాణాలకు అనుమతి తీసకొని నివాస యోగ్యమైన భవనాన్ని నిర్మించారు. సంబంధిత యజమానికి నోటీసులు ఇవ్వలేదు. శ్రీకాకుళం నగరంలోని కత్తెరవీధిలో గుడ్ల కేశవరావు, రామకృష్ణానగర్‌లో డబ్బీరు వెంకట సంతోష్‌కుమార్, మంగువారితోటలో చెన్నా శ్రీనివాసరావు, నాగుల చంద్రరావు, మహలక్ష్మీ నగర్ కాలనీలో సూరపు చలపతిరావు అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలు చేపట్టినట్లు ధ్రువీకరించారు. చెన్నా శ్రీనివాసరావు ఏకంగా ప్రభుత్వ స్థలాన్ని సైతం ఆక్రమించినట్లు నివేదికలో పేర్కొన్నారు. విజయనగరం రింగురోడ్డు ప్రాంతంలో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లియోపారడైజ్ ఫంక్షన్ హాల్‌కు కనీస అనుమతులు లేవని తేల్చారు. 2016లో నిర్మాణం జరిగితే ఇప్పటివరకూ ఒక్క నోటీసు కూడా ఎందుకు ఇవ్వలేదో ఆరాతీశారు. శంకరమఠం రోడ్డులో ఒక భవనానికి జీప్లస్ 2 అనుమతులు తీసుకుని జీప్లస్3తో పాటు కింద సెల్లార్‌లో కూడా గదులు నిర్మించినట్లు గుర్తించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో అనుమతులు లేని భవన నిర్మాణాలు, రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు, జీ+1 అనుమతులు తీసుకుని జీ+2, జీ+3 నిర్మాణాలు, వంకలను ఆక్రమించిన కట్టడాలతో పాటు పట్టణ శివార్లలో 8 నాన్‌లే అవుట్ వెంచర్లు గుర్తించారు. వీటిపై ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక పంపుతున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



## మల్లన్నకు పుష్పపల్లకి సేవ

శ్రీశైలం, ఫిబ్రవరి 19: శ్రీశైలం మల్లన్నకు బుధవారం పుష్పపల్లకిసేవోత్సవం నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆరో రోజున భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు పుష్పపల్లకిపై భక్తులకు దర్శనమిచ్చాడు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పల్లకిసేవలో తరించారు. కాగా, గురువారం సాయంత్రం మల్లికార్జున స్వామికి గజవాహనసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు.

## శ్రీవారిసేవలో ప్రముఖులు





ఎన్‌హెచ్‌ఆర్సీ సెక్యూరిటీ జనరల్ జైదీప్ గోవింద్, జ్యుడిషియల్ రిజిస్ట్రార్ వేణుగోపాల్

తిరుమల, ఫిబ్రవరి 19: తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు జ్యుడిషియల్ రిజిస్ట్రార్ వేణుగోపాల్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సెక్యూరిటీ జనరల్ జైదీప్ గోవింద్, విజయబ్యాంక్ ఈడీ మురళి రామస్వామి తదితరులు ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

## తిరుమలలో గాజు వాటర్ బాటిళ్ల విక్రయానికి బ్రేక్

తిరుమల, ఫిబ్రవరి 19: తిరుమలలో గాజు వాటర్‌బాటిళ్ల విక్రయానికి తాత్కాలికంగా బ్రేక్ పడినట్టు తెలుస్తోంది. కొద్దినెలల క్రితం తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల విక్రయాలను రద్దు చేసిన విషయం తెలిసిందే. భక్తులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా జలప్రసాదాల కేంద్రాలు, కాటేజీల వద్ద వాటర్ డిస్పెన్సర్లు ఏర్పాటు చేసినప్పటికీ నీటిని తీసుకెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటోందని పలువురు ఫిర్యాదు చేయడంతో టీటీడీ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఈ తరుణంలో తిరుమలకు గతంలో వాటర్ బాటిళ్లు సరఫరా చేస్తూవచ్చిన వ్యాపారుల నుంచి గాజుసీసాల సరఫరా ప్రతిపాదన వచ్చింది. ఈ క్రమంలో రూ.20 ధర కలిగిన బిస్లెర్స్ కంపెనీ గాజు వాటర్‌బాటిళ్లను తిరుమలలో ప్రయోగాత్మకంగా విక్రయించేందుకు టీటీడీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బుధవారం నుంచి వీటి విక్రయాలు ప్రారంభించాలనుకున్న తరుణంలో హఠాత్తుగా పాలకులు 'నో' చెప్పినట్టు సమాచారం. గాజు సీసాల వాడకంలో కొన్ని సమస్యలు వస్తాయని భావించిన ప్రభుత్వం కొద్దిరోజుల పాటు వాటి విక్రయాలను ఆపాలని ఆదేశించినట్టు చెబుతున్నారు.

## త్వరలో సామాన్యులకూ 'వడ' ప్రసాదం?

తిరుమల, ఫిబ్రవరి 19: ఆర్జితసేవల్లో పాల్గొనే భక్తులకు, సిఫారసు లేఖలు పొందగలిగిన వారికి మాత్రమే లభించే తిరుమల శ్రీవారి వడ ప్రసాదం త్వరలో సామాన్య భక్తులకూ అందుబాటులోకి రానున్నట్టు సమాచారం. ఒక్కో వడను రూ.100 చొప్పున స్టాక్ ఆధారంగా ఎలాంటి సిఫార్సులతో పనిలేకుండా ఎవ్వరికైనా విక్రయించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

## ఏసీబీ వలలో సర్వేయర్

▸ రూ.7 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత



ఏసీబీకి పట్టుబడిన సర్వేయర్ కోటేశ్వరరావు

అనంతపురం కార్పొరేషన్, ఫిబ్రవరి19: ఏసీబీ అధికారుల వలలో ఓ అవినీతి సర్వేయర్ చిక్కాడు. రూ.7 లక్షలు లంచం తీసుకుంటూ అనంతపురం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సర్వేయర్ కోటేశ్వరరావు అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయాడు. అనంతపురం నగరానికి చెందిన సోము ప్రసాద్ నగర శివారులోని రుద్రంపేట బైపాస్ సమీపంలోని గౌరవ్‌హోమ్స్ సమీపంలోని సర్వే నెంబర్ 1.117/1ఏలో 38 సెంట్ల భూమి సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ స్థలంలో సర్వే చేసిన కోటేశ్వరరావు సర్వే రిపోర్ట్ ఇవ్వలేదు. ఇందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేశాడు. చివరికి రూ.7 లక్షలకు బేరం కుదిరింది. అయితే డబ్బు ఇవ్వడం ఇష్టంలేని ప్రసాద్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారి సూచన మేరకు కోటేశ్వరరావుకు డబ్బు ఇస్తానని టవర్‌క్లాక్ సమీపంలోని డీవీఎన్ బిల్డర్స్ కార్యాలయంలో కలుద్దామని చెప్పాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ప్రసాద్ రూ.7 లక్షలు కోటేశ్వరరావుకు అందజేశాడు. వెంటనే ఏసీబీ డీఎస్పీ అల్లాబకాష్, సీఐ ప్రభాకర్ సిబ్బందితో కలిసి కోటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు.

### కోట్లకు పడగెత్తిన కోటేశ్వరరావు?

సర్వేయర్ కోటేశ్వరరావుది మొదటి నుంచి పైసలు లేనిదే సర్వే చేయని వైనం. చిన్న స్థలానికి కూడా సర్వే కోసం రూ.20 వేల పైనే డిమాండ్ చేస్తాడని ఆరోపణలున్నాయి. 2001 నుంచి అనంతపురం కార్పొరేషన్‌లోనే విధులు నిర్వర్తిస్తున్నాడు. 1996లో డిప్యూటీ సర్వేయర్‌గా విధుల్లో చేరి.. అక్రమార్జనే ధ్యేయంగా అంచెలంచెలుగా ఎదిగాడు. ప్రతి మూడు, నాలుగేళ్లకు బదిలీ అయ్యే సందర్భంలో డిప్యుటేషన్‌పై మరొకరిని ఆ స్థానంలో నియమించడం.. మూడు నెలల్లో మళ్లీ ఇక్కడకు రావడం అతనికి పరిపాటిగా మారింది. ఇలా దాదాపు 20 సంవత్సరాలుగా అనంతపురం కార్పొరేషన్‌లోనే కోటేశ్వరరావు తిష్ఠ వేశాడు. తన అసిస్టెంట్ శివను చిన్న విషయాల్లో సర్వే కోసం పంపేవాడు. ఈ నేపథ్యంలో కోట్లకు పడగలెత్తినట్టు అతనిపై ఆరోపణలున్నాయి.



## కష్టార్జితం ఎలుకల పాలు!

▸ రూ.లక్ష కరెన్సీని కొరికేసిన మూషికాలు

వెంకటాచలం, ఫిబ్రవరి 19: కష్టపడి సంపాదించుకున్న లక్ష రూపాయల సొమ్ము ఎలుకల పాలైంది. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఎరికలపాళెంలో బదనాపూరి వెంకటయ్య బుట్టలు, ఇతర సామగ్రి విక్రయిస్తుంటాడు. కష్టపడి సంపాదించిన రూ.లక్షను గుడిసెలో దాచుకున్నాడు. బుధవారం డబ్బు అవసరమై గోతం విప్పి చూడగా అందులోని రూ.500, 200, 100 నోట్లను ఎలుకలు కొరికేయడంతో ముక్కముక్కలయ్యాయి. దీంతో వెంకటయ్య స్థానిక బ్యాంకుకు వెళ్లి సంప్రదించాడు.

## నెల్లూరు వార్డుల పునర్విభజనపై హైకోర్టు స్టే

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల పునర్విభజనకు సంబంధించిన తుది నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ స్టే అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై సంబంధిత పత్రాలను తమ ముందుంచాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల పునర్విభజన చట్టం-1996 నిబంధనలకు విరుద్ధంగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల పునర్విభజన జరిగిందని, అందువల్ల దానికి సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను నిలుపుదల చేయాలని కోరుతూ నెల్లూరుకు చెందిన వి.భువనేశ్వరి ప్రసాద్ హైకోర్టును ఆశ్రయించారు. పునర్విభజనపై అభ్యంతరాలకు తగిన గడువు ఇవ్వలేదని తెలిపారు. వార్డుల పునర్విభజన అంశానికి సంబంధించిన పత్రాల సమర్పణకు మరికొంత గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థించగా న్యాయమూర్తి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఏపీడీఆర్పీ పనులు వేగవంతం: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టు కింద ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పుగోదావరి జిల్లాలో 6 కాంపొనెంట్ల కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ ఆదేశించారు. బుధవారం ఆమె సచివాలయంలో దీనిపై అధికారులతో సమీక్షించారు. ఈ ప్రాజెక్టు కింద ప్రపంచ బ్యాంకు 68 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 32 శాతం నిధులు మొత్తం రూ. 2 వేల71 కోట్ల వ్యయంతో ఆయా జిల్లాల్లో చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీఈపీడీసీఎల్, పీఆర్అండ్ఈడీ, ఆర్అండ్‌బి, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, ఏపీ ఫారెస్ట్, ఫైర్ సర్వీసెస్ విభాగాల్లో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

## 'ఉపాధి' పనులు వేగవంతం చేయండి: పెద్దిరెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'గత రెండు నెలల్లో ఉపాధి హామీ పనులకు రూ.1400 కోట్లు చెల్లించాం. పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతున్నా.. పనులు వేగంగా ఎందుకు పూర్తికావడం లేదు' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి సచివాలయంలో బుధవారం మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని, జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు. మూడు జిల్లాల్లో పనుల పురోగతిలో అలసత్వం కనిపిస్తోందని, దీనికి ఇంజనీరింగ్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. పనులను సీఈలు స్వయంగా పర్యవేక్షించాలని చెప్పారు.

## పక్షుల సంరక్షణకు రింగింగ్ స్టేషన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి వచ్చే వలస పక్షుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్, బిహార్ ముందుకొచ్చాయి. పక్షుల పరిరక్షణలో భాగంగా రెండు రింగింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఈ రెండు రాష్ట్రాలు నిర్ణయించాయి. ఈ మేరకు బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీతో కలిసి ఇరు రాష్ట్రాలు ఒక అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఒడిసాలోని చిలకా, రాజస్థాన్‌లోని భారత్‌పుర, తమిళనాడులోని పాయింట్ క్లైమేట్, హిమాచల్ ప్రదేశ్‌లోని సాయి రోపాలోనూ ఈ తరహా రింగింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు బిహార్, ఆంధ్ర కూడా పక్షుల సంరక్షణ కోసం రింగింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నాయి. పక్షులకు రింగ్‌లు ఏర్పాటు చేయడం వలన వాటి కదలికలను గుర్తించవచ్చు. వాటి జీవిత చరిత్రను ట్రాక్ చేసేందుకు ఇవి దోహదపడతాయి.

## అధికారుల జోలికొస్తే చూస్తూ ఊరుకోం

▸ బాలకృష్ణమాచార్యులు నిబంధనల మేరకే పనిచేస్తున్నారు

▸ ఆయనపై పార్టీలు, మీడియా ఒత్తిడి

▸ సచివాలయ ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామిరెడ్డి ధ్వజం

▸ సీఎస్ నీలం సాహ్నికి ఫిర్యాదు

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ కార్యదర్శి బాలకృష్ణమాచార్యులు నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నారని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆయన్ను భయపెట్టేలా, మానసిక ఒత్తిడికి గురి చేసేలా కొన్ని పత్రికలు, పార్టీలు కథనాలు, కామెంట్లు చేస్తున్నాయని ఆరోపించారు. దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నిని కలిశారు. బాలకృష్ణమాచార్యులుపై ఒత్తిడి తెస్తున్నారని ఆమెకు ఫిర్యాదు చేశారు. అనంతరం వెంకట్రామిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. బాలకృష్ణమాచార్యులు రూల్స్ ప్రకారమే నడుచుకుంటున్నారని సీఎస్‌కు తెలిపామన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ బిల్లు విషయంలో.. మండలి చైర్మన్ చెప్పినంత మాత్రాన కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా వెళ్లరని చెప్పారు. ఆయనకు మానసిక స్థైర్యం కలిగించడానికి.. తప్పుడు కథనాలు, కామెంట్లను నియంత్రించాలని భయపెట్టే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను కోరామన్నారు. బిల్లు సెలెక్ట్ కమిటీకి పంపడం రూల్స్‌కు విరుద్ధమని చైర్మనే చెబుతున్నారని తెలిపారు. ఏ మంత్రి చెప్పినా.. అధికారులు నిబంధనల ప్రకారమే చేస్తారని.. అలా కాదని మంత్రి ఏది చెబితే అది చేయమంటారా.. దీన్ని సమర్థిస్తారా అని ప్రశ్నించారు. 'రూల్స్ లేదు.. ఏం తొక్కాలేదు.. ఏదో కేసు పెట్టి యనమల రామకృష్ణుడు, బొండా ఉమాలను జైల్లో వేసేయండి.. లోపలేయండని హోం మంత్రి అంటే డీజీపీ, ఎస్పీ చేయాలా? దాన్ని ప్రతిపక్షం సమర్థిస్తుందా? పై వాళ్లు చెప్పినా కింది స్థాయిలో అధికారులు నిబంధనల ప్రకారమే పని చేస్తారు. నిబంధనల ప్రకారం నడుచుకుంటున్న అసెంబ్లీ ఉద్యోగులు, అధికారులు, సచివాలయ ఉద్యోగుల జోలికి రావద్దు. వస్తే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వెళ్లండని గవర్నర్ కూడా చెప్పరని, తాము కూడా గవర్నర్‌ను కలిసి.. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించే అధికారులకు భద్రత కల్పించాలని కోరతామని చెప్పారు.

## 'చింతలపూడి'కి 1931 కోట్ల నాబార్డు రుణం

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గోదావరి, కృష్ణా జిల్లాలకు సాగు, తాగు నీటిని అందించేందుకు చింతలపూడి వద్ద నిర్మిస్తోన్న ఎత్తిపోతల పథకానికి రూ.1931 కోట్ల రుణాన్ని అందించాలని నాబార్డు(వ్యవసాయ-గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంకు) నిర్ణయించింది. ఆ మేరకు నాబార్డు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 2022 నాటికి పూర్తి చేసే ఈ పథకం వల్ల పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 మండలాలకు చెందిన 410 గ్రామాలు, కృష్ణా జిల్లాలోని 18 మండలాలకు సాగు, తాగు నీటి అవసరాలు తీరుతాయని పేర్కొంది.

## ఎస్సీ గురుకులాల్లో ముగిసిన నియామకాలు

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో తలపెట్టిన నియామకాల ప్రక్రియ ముగిసింది. గతేడాది ఫిబ్రవరిలో సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలో ఖాళీగా ఉన్న 750 (4 జిల్లా కోఆర్డినేటర్లు, 27 ప్రిన్సిపాల్ గ్రేడ్-2, 167 కేర్‌టేకర్ (వార్డెన్), 552 ట్రైనీ గ్రాడ్యుయేట్ టీచర్లు) పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఏడాది పాటు సాగిన నియామక ప్రక్రియలో 2 జిల్లా కోఆర్డినేటర్లు, 11 మంది ప్రిన్సిపాళ్లు, 161 కేర్‌టేకర్లు (వార్డెన్లు), 421 టీజీటీతో కలిపి మొత్తం 595 పోస్టులను భర్తీ చేశారు.

## అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

ఉరవకొండ, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతాండాకు చెందిన ఆంజనేయులు నాయక్(25) అనే రైతు మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న మూడెకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని ఆంజనేయులు వ్యవసాయం చేశాడు. పంటలు పండకపోవడంతో సాగు కోసం రూ.8 లక్షల దాకా అప్పు చేశాడు. ఈ నేపథ్యంలో అప్పులు తీర్చే మార్గం లేక బలవన్మరణానికి పాల్పడ్డాడు.

## జనగణనతోపాటు ఎన్పీఆర్

▸ రెండు దశల్లో సేకరణ

▸ మూడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు

▸ వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభం

▸ రాష్ట్రస్థాయి సమీక్షలో డైరెక్టర్ సత్యనారాయణ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జనగణన-2021తోపాటు జాతీయ జనాభా పుస్తక (ఎన్పీఆర్) నవీకరణ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 తేదీ నుంచి ప్రారంభిస్తామని జనగణన రిజిస్ట్రేషన్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఈ ప్రక్రియ రెండు దశల్లో సాగుతుందని చెప్పారు. జనగణన కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించామన్నారు. ప్రయోగాత్మకంగా విజయనగరం (భోగాపురం మండలం), అనంతపురం (ఆత్మకూరు మండలం), గుంటూరు (నరసరావుపేట మండలం) జిల్లాల నుంచి ఒక్కొక్క ప్రాంతాన్ని ఎంచుకుని విజయవంతంగా వివరాలు నమోదు చేశామని చెప్పారు. అమరావతి సచివాలయంలో బుధవారం జనాభా గణన-2021పై నోడల్ అధికారులు, కార్యదర్శులు, ముఖ్య గణాంక అధికారులతో రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జనగణన కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జనగణన 2021తోపాటు జాతీయ జనాభా రిజిస్టర్‌ను నవీనకరిస్తారని తెలిపారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్య కాలంలో 45 రోజులపాటు మొదటి దశలో ఇంటి గణన, గృహాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తామన్నారు. రెండో దశలో ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు 2021 జనాభా వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ ఉంటుందన్నారు. జనగణన విధుల్లో పాల్గొనే సిబ్బంది బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా గౌరవ వేతనం వేస్తామని చెప్పారు. జనగణన సమాచారం అందరికీ అందుబాటులో ఉంటుందని రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి ఉషారాణి చెప్పారు. జనగణనకు అవసరమైతే గ్రామ, వార్డు వాలంటీర్ల సాయం కూడా తీసుకోవచ్చన్నారు. జనగణనలో వ్యక్తులతోపాటు సాంఘిక, సాంస్కృతిక, భౌగోళిక, ఆర్థికపరమైన వివరాలను సేకరిస్తారని అడిషనల్ రిజిస్ట్రార్ జనరల్ సంజయ్ చెప్పారు. ఎన్యుమేటర్లు మొబైల్ యాప్‌తోపాటు వివరాలు నమోదు కాగితపు దరఖాస్తులను నింపడం ద్వారా వివరాలను సేకరిస్తారన్నారు. వివరాల నమోదుకు 34 ప్రశ్నలతో కూడిన పత్రాన్ని రూపొందించామని జాయింట్ డైరెక్టర్ షిసుకుమార్ తెలిపారు. ఎన్పీఆర్ కన్నా ఎక్కువ వివరాలు జనగణనలో సేకరిస్తామన్నారు. ప్రతి 120-150 ఇళ్లను ఒక బ్లాక్‌గా నిర్ణయించి ఎన్యుమరేటర్‌ను నియమించనున్నట్టు చెప్పారు.

## వైసీపీలో భగ్గుమన్న వర్గపోరు

▸ వైవీ సుబ్బారెడ్డి కాన్వాయ్ అడ్డగింత, ఫ్లెక్సీలు చించివేత

▸ లావు కాన్వాయ్‌ను అడ్డగించిన రజనీ వర్గీయులు



బోసు బొమ్మ సెంటర్లో చించేసిన ఫ్లెక్సీలు

ద్రాక్షారామ/చిలకలూరిపేట, ఫిబ్రవరి 19: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం నియోజకవర్గ పర్యటనలో వైసీపీలో వర్గపోరు బయటపడింది. ద్రాక్షారామ భీమేశ్వరుడిని దర్శించుకుని వెంకటాయపాలెం బయలుదేరిన సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణ కాన్వాయ్‌ను బోసు బొమ్మసెంటర్‌లో ఎమ్మెల్యే వేణు వర్గానికి చెందిన కార్యకర్తలు అడ్డగించారు. వైవీ ప్రయాణిస్తున్న వాహనాన్ని నిలిపివేసి నినాదాలు చేశారు. పోలీసులు చెదరగొట్టి కాన్వాయ్‌ను ముందుకు నడిపించారు. ఈ సందర్భంగా బోసు బొమ్మసెంటర్‌లో రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి మాగాపు అమ్మిరాజు ఫ్లెక్సీని చించివేశారు. అదే విధంగా తోట త్రిమూర్తుల అభిమానులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని చించివేసి తగులబెట్టారు. త్రిమూర్తులుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా.. తోట త్రిమూర్తులు వైసీపీలోకి రావడాన్ని వ్యతిరేకిస్తూ టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే వేణు వర్గం అడ్డుకున్నట్టు చెబుతున్నారు. గుంటూరు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కాన్వాయ్‌ని చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజనీ వర్గీయులు బుధవారం రాత్రి అడ్డగించారు. సుమారు అరగంటకు పైగా రోడ్డుపై బైఠాయించడంతో ఎంపీ కారులోనే ఉండిపోయారు. వివరాలలోకి వెళితే.. కోటప్పకొండ తిరునాళ్లను పురస్కరించుకుని చిలకలూరిపేటలోని పురుషోత్తమపట్నంలో ఏర్పాటు చేసిన భైరా వారి విద్యుత్ ప్రభ పండుగకు బుధవారం రాత్రి శ్రీకృష్ణదేవరాయలు హాజరయ్యారు. ఎంపీ ముందుగా స్థానిక లక్ష్మీపురంలో ఉన్న వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రి రాజశేఖర్ నివాసగృహానికి వెళ్లారు. అక్కడ స్థానిక నాయకులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. అనంతరం రాజశేఖర్ తనయుడు శ్రీనాథ్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలతో పురుషోత్తమపట్నం భైరావారి ప్రభ వద్దకు వెళ్లి అందరికీ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత భైరా కృష్ణ నివాసగృహంలో కొద్దిసేపు ఆగి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సమయంలో ఎమ్మెల్యే రజనీ వర్గీయులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని ఎంపీ కాన్వాయ్‌ని అడ్డగించారు. ఎంపీని తమ ప్రభల వద్దకు రావాలని ఎమ్మెల్యే ఆహ్వానించినా రాలేదని, పార్టీకి చెందనివారి ప్రభ వద్దకు ఎందుకు వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కారుపై చేతులతో కొట్టారు. పోలీసులు సర్దిచెప్పినా వినకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తున్నవారిని పక్కకు నెట్టివేసి ఎంపీ కాన్వాయ్‌ను పంపించివేశారు. ఇరువర్గాలకు చెందిన వారు కూడా అక్కడ భారీగా మోహరించడంతో పరిస్థితి ఎంతవరకు దారితీస్తుందోనని స్థానికులు ఆందోళన చెందారు.



ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకోవడంతో కారులోనే ఉండిపోయిన ఎంపీ లావు

### తోటపై దాడికి యత్నం

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం నియోజకవర్గ పర్యటనలో బుధవారం భీమేశ్వరాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే, అమలాపురం వైసీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు తోట త్రిమూర్తులుపై వైసీపీ కార్యకర్త, ఎమ్మెల్యే వేణుగోపాలకృష్ణ అనుచరుడైన మేడిశెట్టి ఇజ్రాయెల్ చెప్పుతో దాడికి యత్నించాడు. వైవీ సుబ్బారెడ్డి కారులో మంత్రి మోపిదేవి, విశ్వరూప్‌తో కలసి తోట త్రిమూర్తులు వచ్చారు. ఆలయం వద్ద త్రిమూర్తులు కారు నుంచి దిగుతుండగా కె.గంగవరం మండలం మసకపల్లికి చెందిన ఇజ్రాయెల్ చెప్పుతో దాడికి ప్రయత్నించాడు. గమనించిన మంత్రి మోపిదేవి.. ఇజ్రాయెల్‌ను గెంటివేశారు.

OFFICE OF THE COMMISSIONER OF CENTRAL TAX (AUDIT)
Central GST Guntur Audit Commissionerate, GST Bhavan, Port Area, Visakhapatnam-530035
eProcurement Tender reference C. No.I/22/06/2019-Admn.
Date of publishing in eProcurement portal is 19.02.2020
HIRING OF VEHICLES FOR THE YEAR 2020-21
Bids are invited from the Service Providers through eProcurement portal for Hiring of Vehicles. For further details log on to www.eprocure.gov.in/eprocure/app. Tender ID 2020_DREV_545798_1, schedule download ending and bid submission closing date 11.03.2020 17:00 Hrs.
(G.V.S.R.Sarma), Assistant Commissioner

# హక్కులు–లెక్కలు

సుప్రీంకోర్టుదేముంది, హక్కులకు ఏలోటూ లేదనే అంటుంది. నిరసన తెలపడం, నచ్చింది చెప్పడం మీ ప్రాథమిక హక్కు అంటూ ఉరిమే ఉత్సాహాన్ని అందిస్తుంది. కానీ, ధైర్యం చేసి ఎవరైనా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడితే ఏకంగా దేశద్రోహులన్న ముద్ర వేయించుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వాలకు ఎవరిమీదైనా పాతకక్షలుంటే ఇక మరీనూ. యోగి ప్రభుత్వం రెండేళ్ళుగా డాక్టర్ కఫీల్ ఖాన్ వెంట పడుతున్నది. గోరఖ్‌పూర్ బిఆర్‌డి ఆసుపత్రిలో 2017లో ఆక్సిజన్ కొరతకారణంగా 70మంది పసికందులు కన్నుమూసిన ఘటనలో ఆయన కొన్ని వాస్తవాలు బయటపెట్టి అడ్డంగా ఇరుక్కొని, ఉద్యోగమూ పోగొట్టుకున్నాడు. అప్పటినుంచీ ఆయన వెంటపడిన యోగి ప్రభుత్వానికి ఇటీవల ఆయన కొత్త పౌర చట్టంమీద అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో చేసిన ప్రసంగం కొత్త ఆయుధంగా అందివచ్చింది. రెండునెలలకు పైగా నిరసనలు జరుగుతున్న షాహీన్‌బాగ్‌ను ఖాళీచేయించే అంశంలో సుప్రీంకోర్టు భావవ్యక్తీకరణ, నిరసనకు సంబంధించి చేసిన వ్యాఖ్యలు మన ప్రభుత్వాలకు ఎప్పటికైనా చెవికెక్కుతాయా?

సుప్రీంకోర్టు నియమించిన మధ్యవర్తులు ఇద్దరు బుధవారం షాహీన్‌బాగ్ నిరసనకారుల దగ్గరకు పోయి వారితో చర్చలు జరిపారు. కన్నీళ్ళు, భయాల మధ్య నిరసనకారులు కూడా ఏవో చెప్పుకున్నారు. ఆ ప్రాంతం నుంచి వారిని ఖాళీచేయించే విషయంలో మధ్యవర్తులు విజయం సాధిస్తారా లేదా అన్నది వేరే విషయం. కానీ, శాసనాలకు వ్యతిరేకంగా మాట్లాడటం, నిరసన తెలపడం వంటివి ప్రభుత్వాలు సహించలేకపోతున్న స్థితిలో, సుప్రీంకోర్టు చొరవను అభినందించవలసిందే. పౌరులకు ఉన్న నిరసనహక్కును ఎత్తిపడుతూ అమలులో కాస్తంత విచక్షణ పాటించమని కోర్టు చెబుతున్నది. షహీన్‌బాగ్ నిరసనకారులు అంబులెన్సులను కూడా అనుమతించడం లేదన్న సొలిసిటర్ జనరల్ వాదన అతిగా ఉన్నది కానీ, నెలల తరబడి నిరసన శిబిరం కొనసాగడం వల్ల సమీప ప్రాంతాలవారికి ఇబ్బందులు కలగడం సహజం. పూర్తిగా మహిళలతో, ప్రముఖులెవరూ లేని ఈ శిబిరం వొణికించే చలిలో కూడా అంతే బలంగా కొనసాగుతూ వచ్చి మిగతా దేశానికి ఎంతో స్ఫూర్తినందించింది. షహీన్‌బాగ్ ఆశయం అందిపుచ్చుకొని దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ధర్నా శిబిరాలు వెలిసాయి. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఆర్‌సి, సీఏఏలకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాల వెనుక దీని ప్రభావం లేకపోలేదు. ఇంతటి బలమైన ఉద్యమం కనుకనే ఢిల్లీ ఎన్నికలు ప్రధానంగా దానిచుట్టూనే తిరిగాయి. అక్కడున్నవారంతా దేశద్రోహులనీ, ఎన్నికల్లో నెగ్గగానే దానిని ఖాళీ చేయిస్తామని కొందరు కేంద్ర మంత్రులు ప్రకటించడం తెలిసిందే.

శాసనాలకు వ్యతిరేకంగా మాట్లాడటం, నిరసన తెలియచేయడం అభిప్రాయాల రూపకల్పనకు అవసరం. న్యాయమూర్తి చంద్రచూడ్ ఇటీవల ఓ ప్రసంగంలో వీటిని ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉపకరించే సేఫ్టీవాల్వ్‌తో పోల్చారు. బలప్రయోగంతో అసమ్మతిని అణచివేస్తే సామాజికాభివృద్ధికి దోహదం చేసే ప్రాతిపదికలన్నీ ధ్వంసమవుతాయని కూడా హెచ్చరించారు. కానీ, ఈ నిరసనలు, అసమ్మతి దేశానికి కీడుచేస్తాయన్న వాదనతో పాలకులు తమ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడేవారిని వేటాడుతూనే ఉన్నారు. గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరతతో పిల్లలు వరుసగా కన్నుమూస్తున్నప్పుడు వారిని రక్షించేందుకు తనవంతు ప్రయత్నం చేసినవాడు కఫీల్‌ఖాన్. కానీ, యోగి ప్రభుత్వం ప్రభుత్వం తన నిర్లక్ష్యాన్నీ, నిర్వహణ లోపాలను కప్పిపుచ్చుకొనేందుకు ఈ డాక్టర్‌ను ఇరికించి, అంతిమంగా జైలుకు పంపింది. అంతర్గత విచారణలో ఆయన సచ్ఛీలుడని తేలగానే, మరో విచారణ కమిటీ ప్రకటించింది. మొన్న డిసెంబరులో పౌరసత్వచట్టంమీద చేసిన ప్రసంగం విద్వేషాలు రెచ్చగొట్టేట్టు ఉన్నదని ఇప్పుడు వెంటబడుతున్నది. ఇటీవల యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఆయనను అరెస్టు చేయగానే, కొంతకాలం తరువాత కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది. ఇలా బెయిల్‌మీద బయటకు రాగానే జాతీయ భద్రతా చట్టాన్ని ప్రయోగించి ముంబై ఎయిర్‌పోర్టులో ప్రభుత్వం ఆయనను అరెస్టుచేయించింది. యూపీ ప్రభుత్వానికి ఈ డాక్టర్ దేశభద్రత రీత్యా ఓ తీవ్ర చట్టాన్ని ప్రయోగించాల్సిన ఉగ్రవాదిలాగా కనిపిస్తున్నాడు. ఆయన ప్రసంగం నిజంగానే విద్వేషాలను రెచ్చగొట్టే స్థాయిలో ఉన్నదనుకుంటే చార్జిషీటులో నిరూపిస్తే న్యాయస్థానాలే ఆ విషయాన్ని నిర్ధారిస్తాయి. కానీ, యోగి ప్రభుత్వం కఫీల్‌ఖాన్ వదలదల్చుకోలేదు కనుక ఇలా బెయిల్ రాగానే అలా తిరిగి జైల్లోకి నెట్టేసింది. న్యాయస్థానాలు హక్కుల లెక్కలు ఎన్ని చెప్పినా, శాసనాలకు వ్యతిరేకంగా మాట్లాడవచ్చునని ఎంత రెచ్చగొట్టినా పాలకులు ప్రీతిపాత్రంగా తెస్తున్న చట్టాలమీద నోరువిప్పడం ఆరోగ్యానికి హానికరం.

సందర్భం



■ కె. శ్రీనివాస్

# పిల్లిమొగ్గల పార్టీలతో ఫెడరల్ ఫ్రంటా?

> ప్రాంతీయపార్టీల చక్రానికి ఏదో ఒక జాతీయపక్షం ఇరుసుగా ఉండాలి. ఇప్పటికే, ఓటర్లు జాతీయ ఎన్నికలకు, రాష్ట్ర ఎన్నికలకు భిన్నంగా స్పందించడం అలవరుచుకున్నారేమోనన్న అనుమానం కలుగుతోంది. ప్రాంతీయపార్టీల కూటమికి జాతీయపక్షం నేతృత్వం వహించకపోతే, ఇప్పుడున్న కేంద్రనాయకత్వానికి ఎదురే ఉండదు. ప్రాంతీయ స్థాయి నాయకులకు మోదీ ఎట్లా ప్రత్యామ్నాయం కారో, జాతీయస్థాయిలో మోదీకి ప్రాంతీయ నాయకులు ప్రత్యామ్నాయం కాలేరు.

పుల్వామా దాడి జరిగి ఏడాది గడచిన సందర్భంగా, మృతవీరులకు నివాళి అర్పించే బదులు, పోనీ, మరణించిన సైనికుల కుటుంబాలకు వాగ్దానం చేసిన సహాయాలు అందాయో లేదో తెలుసుకునే బదులు, రాహుల్ గాంధీ ఒక పెడసరపు వ్యాఖ్య చేశారు. పుల్వామా దాడి లబ్ధిదారులెవరు? అని ఆ వ్యాఖ్యలో ప్రశ్నించారు. పుల్వామా దాడి లాగానే ఆ ప్రశ్న కూడా రాహుల్‌కు చాలా నష్టం చేసింది. సమయం సందర్భం చూసుకుని మాట్లాడాలని, ఔచిత్యం లేని మాటలు అధికప్రసంగాలు అవుతాయని పెద్దలు అందుకే అంటారు. రాహుల్‌గాంధీ తన వ్యాఖ్య ద్వారా ఏమి స్ఫురింపజేయదలచుకున్నారో అందరికీ అర్థమవుతూనే ఉన్నది. మనకు స్ఫురించే ఆరోపణ, నిజమా కాదా ఇక్కడ అనవసరం. నిజమే అయినప్పటికీ, ఆ నిజాన్ని స్వీకరించి స్పందించే స్థితిలో భారతీయ ఓటర్లు లేరు అన్నది రాహుల్‌గాంధీకి తెలిసి ఉండాలి. ఎవరో ఒకాయన అడిగాడు కూడా, 2008లో బొంబాయి దాడులు జరిగాయి, 2009లో యుపిఎ గెలిచింది, రెంటికీ ముడిపెట్టి చూడాలా? అని. బిజెపివారిని నిలదీస్తే, కాంగ్రెస్ మీద ఎదురు ప్రశ్న సంధించడం సమాధానం కాదు. రాజకీయ ప్రయోజనాల కోసం, దేశభద్రతను తాకట్టు పెట్టడం, లేదా, ఉగ్రవాదుల సాయం తీసుకోవడం, లేదా స్వయంగా నకిలీ దాడులు జరపడం ప్రపంచంలో లేనిదేమీ కాదు. భారతదేశంలో కూడా అటువంటి దోరణి ఉన్నదా, మన రాజకీయపార్టీలు ఆ స్థితికి దిగజారాయా, దిగజారినా ఆ విషయం విశ్వసించడానికి సమాజం సిద్ధంగా ఉన్నదా అన్నవి ప్రశ్నలు.

ఇంటిలోని సమస్యలకు పొరుగును నిందించడం ఎప్పటి నుంచో ఉన్నది. అదే సమయంలో ఇరుగు దేశాలలో చిచ్చుపెట్టడం పొరుగుకు కూడా పాత విషయమే. దేశంలో తనపై అసంతృప్తి పెరగడాన్ని జీర్ణించుకోలేని ఇందిరాగాంధీ తరచు విదేశీహస్తాన్ని ప్రస్తావించేవారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో జరిగిన ప్రజాందోళనను కూడా ఆమె విదేశీకుట్రగా వ్యాఖ్యానించారు. జెపిని సిఐఎ ఏజెంటు అని నిందించడం కూడా ఆ రోజుల్లో జరిగింది. నక్సలైట్లను కూడా నిక్సనైట్లు అని ఆరోపించినవారున్నారు. బంగ్లాదేశ్ యుద్ధం, పోఖ్రాన్ అణుపరీక్ష వంటివి దేశానికి ఎంతో కీలకమైనవి, ఆవశ్యకమైనవి అయినప్పటికీ, వాటి నిర్ణయం వెనుక ఇందిరకు తన ప్రతిష్ఠను, జనాదరణను పెంచుకునే రాజకీయ ఉద్దేశ్యం కూడా ఉన్నదని పరిశీలకులు భావించేవారు. ఎమర్జెన్సీ అనంతరం ఇందిరా గాంధీలో అనేక మార్పులు వచ్చాయి. ప్రతిదానికీ అమెరికాను నిందించే ఆనవాయితీ మానేసి, పొరుగుదేశంపైనే ఆరోపణలు సంధించడం మొదలుపెట్టారు. ఖలిస్థాన్ తీవ్రవాదం, కశ్మీర్ సమస్యల విషయంలో పాకిస్థాన్‌తో ఏదో విధమైన లంకె ఉండడంతో, ఆ దేశమే మనకు ప్రతినాయక దేశంగా స్థిరపడిపోయింది. ఇటీవలి దశాబ్దాలలోని ఉగ్రవాదచర్యల విషయంలోనూ పాకిస్థాన్ ప్రమేయం లేదా పాకిస్థాన్ భూభాగంలోని శక్తుల ప్రమేయం ఉంటూనే వస్తోంది. హింసాత్మక, ఉగ్రవాద సంఘటనలు అనేకం వీడని ముడులుగా, అనుమానాస్పదంగా మిగిలిపోయిన మాట నిజమే. కొన్ని సార్లు వివిధ భద్రతా ఏజెన్సీల పాత్ర కూడా చర్చనీయాంశం అవుతుంది. కానీ, ఆ అంశాలు ప్రధాన రాజకీయ వేదిక మీదకి రావడానికి ఇంకా సమయం రాలేదు. ప్రజానీకంలో కొన్ని విషయాల మీద గాఢమైన విశ్వాసం ఉంటుంది. ఆ విశ్వాసాన్ని నిరంతరం పెంచిపోషించే ప్రక్రియలూ ఉంటాయి.

వాస్తవం ఏదయినా, పరిణతి చెందిన రాజకీయ నాయకుడు రాహుల్ గాంధీ వలె వ్యాఖ్యానించడు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ గెలవడం వల్ల, ఎంతో కొంత ఉత్సాహపడిన బిజెపియేతర శ్రేణులు ఎదగడానికి ఇంకా మొరాయిస్తూనే ఉన్న రాహుల్‌ను చూసి నిరుత్సాహం చెందాయి. సరే, 'ఆప్' ఒక మార్గాన్ని చూపిస్తోంది. ప్రాంతీయపార్టీలు అన్నీ కలిసి జాతీయపక్షం తోడు లేకుండా నిలబడగలవా? నెగ్గగలవా? అన్నది ప్రశ్న. ఢిల్లీ ఫలితాలు రాగానే, ఆశ్చర్యకరంగా తెలంగాణ నుంచి స్పందన వచ్చింది. ఫెడరలిజం అన్న మాటకు మళ్లీ చెలామణి వచ్చింది. చిన్నచిన్న పార్టీలన్నిటిని ఒక్క తాటి మీదకు తెచ్చి, ఢిల్లీ గద్దెను కెసిఆర్ చేజిక్కించుకోగలరని ఆయన అభిమానులు నమ్మకంగా ఉన్నారు. పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరగడం వెనుక, జాతీయ ఆకాంక్షలకు రెక్కలు రావడం కూడా ఒక కారణమని అంటున్నారు.





ఆప్ గెలుపుతో జాతీయప్రతిపక్ష శిబిరాలు సంతోషించడంతో పాటు, బిజెపి నేతలు బాగా డీలాపడడం కూడా స్పష్టంగా కనిపించింది. అయితే, సంబరం, కలవరం ఎంతో కాలం నిలవలేదు. స్నేహ హస్తం చాచి, అభివృద్ధికి సహకరించమని కేజ్రీవాల్ మోదీని అడగడం ఒక లాంఛనమే అనుకున్నా, వెనువెంటనే ఆయన నుంచి జాతీయ కార్యాచరణ ఏదీ ఉండదనే సూచన కూడా అందులో ఉన్నది. స్వధర్మ రక్షణార్థమే అయినప్పటికీ, వైఎస్ఆర్ సీపీ ఎన్‌డిఎలో చేరతానని ఉబలాటపడడం బిజెపికి ఉన్న అదనపు అవకాశాలను సూచిస్తున్నది. మరోవైపు, కాంగ్రెస్, ఎన్‌సిపి మద్దతుతో అధికారంలో ఉన్న ఉద్ధవ్ ఠాక్రే, బిజెపి విరహాన్ని భరించలేకపోతున్నాడు. కాబట్టి, ఢిల్లీ దెబ్బ తరువాత బిజెపికి కలిసివస్తున్నఅంశాలు కూడా ఉంటున్నాయి.

ఉద్వేగపూరిత మనోభావాల పునాదుల మీద, సైద్ధాంతిక లక్ష్యాలతో గట్టి సౌధాన్ని నిర్మించుకున్న బిజెపికి బలమైన ప్రత్యర్థిశిబిరం సమకూరడం సులువు కాదు. జాతీయనేత డీలా పడుతున్నప్పుడు, ప్రాంతీయ పార్టీలకు సొంతంగా ఆ శక్తి ఉన్నదా? ప్రాంతీయపార్టీలు ఏర్పడిన సమయాన్ని, సందర్భాన్ని గౌరవించవలసిందే కానీ, అవి ప్రస్తుతమైతే ఎటువంటి జాతీయ విధానాన్నీ, అవగాహననీ కలిగిలేవనే చెప్పాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే, జాతీయ వ్యవహారాలలో ప్రాంతీయపార్టీల వైఖరి అవకాశవాదంతో కూడి ఉంటున్నది.

> ఉద్వేగపూరిత మనోభావాల పునాదుల మీద, సైద్ధాంతిక లక్ష్యాలతో గట్టి సౌధాన్ని నిర్మించుకున్న బిజెపికి బలమైన ప్రత్యర్థిశిబిరం సమకూరడం సులువు కాదు. జాతీయనేత డీలా పడుతున్నప్పుడు, ప్రాంతీయ పార్టీలకు సొంతంగా ఆ శక్తి ఉన్నదా?

జాతీయస్థాయిలో బలాబలాల సమీకరణలో, తమ బలంతో తాము బేరాలు ఆడగలమని, ఒత్తిళ్లు తేగలమని, లేదా తమ బలాన్ని అమ్ముకోగలమని అనుకుంటున్నాయే తప్ప, తమకంటూ సొంత విధానాలు ఆ పార్టీలకు లేవు. ఉన్నపార్టీలలో డిఎంకె కాసింత మెరుగుగా కనిపిస్తుంది కానీ, తమ భావజాలానికి పూర్తి భిన్నమైన బిజెపితో గతంలో కలిసి నడిచిన చరిత్ర దానికి కూడా ఉన్నది. కాంగ్రెస్ ప్రయోగించిన ఆర్టికల్ 356కు బాధితురాలు ఆ పార్టీ. ఇప్పుడు కాంగ్రెస్‌తో ఉన్నది సహజమైత్రిగా భావిస్తుంది. అయినప్పటికీ, జాతీయ అంశాలపై సొంతంగా తనకంటూ ఒక వైఖరిని ప్రకటించడమైనా ఆ పార్టీ చేయగలుగుతుంది. ప్రాంతీయపార్టీల అవకాశవాద వైఖరికి ఉదాహరణ కూడా డిఎంకె నుంచే తీసుకోవచ్చు. శ్రీలంక తమిళుల సమస్య డిఎంకెకు ఎంతో కీలకమైనది, సున్నితమైనది. తాను భాగస్వామిగా ఉన్న కేంద్రప్రభుత్వం శ్రీలంకలో ఊచకోతకు మౌన సహాయం చేస్తుండగా, నిస్సహాయంగా మిగిలిపోయింది.

అటువంటి ప్రాంతీయ పార్టీల నుంచి ఏమి ఆశించగలం? గాంధీ వైపా, గాడ్సే వైపా చెప్పు అని అడుగుతున్నాడు ప్రశాంత్ కిశోర్. నితీశ్ కుమార్‌కు ఇంకా సిద్ధాంతాలున్నాయా? రామమనోహర్ లోహియా, కర్పూరీ ఠాకూర్‌ల పేర్లు ఆయనకు గుర్తున్నాయా? సిఎఎ, ఎన్ఆర్‌సీ మీద ఇప్పుడు అభినందనీయమైన వైఖరి తీసుకున్న కెసిఆర్, గతంలో ఎన్ని సార్లు, ఎన్ని సందర్భాలలో కేంద్రానికి ఓటుసాయం చేయలేదు? నల్లచట్టాలను కూడా ఆయన పార్టీ ప్రశ్నించకుండా అంగీకరించింది. వీరందరికీ విదేశాంగం గురించి, రక్షణ గురించి, ఆర్థికాంశాల గురించి జాతీయస్థాయి వైఖరులేమైనా ఉన్నాయా? ఉన్నట్టు మనకు తెలుసునా? సిఎఎ గురించి వైఎస్ జగన్ ఏమి చేశారు, ఆయన మంత్రులు ఏమి మాట్లాడుతున్నారు?

కాబట్టి, ప్రాంతీయపార్టీల చక్రానికి ఏదో ఒక జాతీయపక్షం ఇరుసుగా ఉండాలి. ఇప్పటికే, ఓటర్లు జాతీయ ఎన్నికలకు, రాష్ట్ర ఎన్నికలకు భిన్నంగా స్పందించడం అలవరుచుకున్నారేమోనన్న అనుమానం కలుగుతోంది. ప్రాంతీయపార్టీల కూటమికి జాతీయపక్షం నేతృత్వం వహించకపోతే, ఇప్పుడున్న కేంద్ర నాయకత్వానికి ఎదురే ఉండదు. ప్రాంతీయ స్థాయి నాయకులకు మోదీ ఎట్లా ప్రత్యామ్నాయం కారో, జాతీయస్థాయిలో మోదీకి ప్రాంతీయనాయకులు ప్రత్యామ్నాయం కాలేరు.

చిన్నతనం అనుకోకుండా, కాంగ్రెస్ పార్టీ కూడా ప్రశాంత్ కిశోర్‌ను ఆశ్రయిస్తే, రాహుల్‌లో ఏమన్నా తేడా వస్తుందేమో? లేకపోతే, కాంగ్రెస్ నేతలు తెగించి, రాహుల్‌కు వీడ్కోలు చెప్పి కొత్తనేతను ఎన్నుకోవడం మరో మార్గం. మోదీ వంటి మేరువును ఎదుర్కొనడానికే కాదు, పిల్లిమొగ్గలు వేసే ప్రాంతీయ నేతల చాతుర్యాన్ని తట్టుకోవడానికి కూడా ఒక పరిణతి చెందిన జాతీయనేత కావాలి. సాధ్యమా?

# ప్రజా ఉద్యమంతోనే ప్రత్యేక హోదా

ఫిబ్రవరి 20వ తేదీ. సీమాంధ్ర తెలుగు ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేని రోజు. 10 కోట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను రెండు తెలుగు రాష్ట్రాలుగా విభజన చేసిన సందర్భంలో ఐదున్నర కోట్ల ఏ.పీ. ప్రజలకు ఆనాటి ప్రధాని మన్‌మోహన్ సింగ్ ఐదేళ్ళపాటు ప్రత్యేక హోదా ఇస్తూ ప్రకటన చేసిన రోజు. ఇప్పటి అధికార బీజేపీ నాయకులు కూడా ప్రత్యేక హోదాను మేమే సాధించాం అని చెప్పుకున్న రోజు కూడా అదే. అయితే, ఆరేళ్ళు గడచినా సుదినమో, దుర్దినమో కూడా అర్థంకాని పరిస్థితి ఏ.పీ. ప్రజలది. ఇప్పటికైనా 'వట్టి మాటలు కట్టిపెట్టి, గట్టి మేల్ తలపెట్టవోయ్' అన్న గురజాడ మాటను సీమాంధ్రులు గుర్తుకు తెచ్చుకోవాలి. అందరూ ఒక్కటై హోదా సాధించి తీరాలి. నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలన్నదే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలతోపాటు అన్ని రాజకీయ పక్షాల, విద్యార్థి, యువత, ఉద్యోగ, మేధావుల అందరి డిమాండ్. గత ఆరేళ్ళుగా ఇదే డిమాండ్‌పై అన్ని పక్షాల వారూ విడివిడిగానో, ఐక్యంగానో కేంద్రంలోని బీజేపీ పెద్దలకు విజ్ఞప్తులు చేశారు. రాష్ట్రంలోనూ పలు ఆందోళనలు చేశారు. అయినా మోదీలో కించిత్ కదలికను తీసుకురాలేక పోయాం. నిన్నటి అధికార పక్షమైన తెలుగు దేశం పార్టీ, దాని అధినేత చంద్రబాబుకు హోదాపై విశ్వసనీయత లేదన్న నేటి అధికార పార్టీ వైసీపీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి తన పార్టీకి చెందిన 25మంది పార్లమెంట్ అభ్యర్థులను గెలిపిస్తే, ప్రత్యేక హోదా సాధించుకొస్తానని హామీ ఇచ్చారు. జగన్ కోరినట్టుగానే సీమాంధ్ర ఓటర్లు ఆయనకు 151 అసెంబ్లీ స్థానాలను, 22 పార్లమెంటరీ స్థానాలను ఏకపక్ష తీర్పుతో పట్టం కట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే 'రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు సంజీవని అయిన ప్రత్యేక హోదా తప్పనిసరి. ప్రత్యేక హోదా రాష్ట్రాలకు కేంద్రం నుంచి ఇస్తున్న గ్రాంట్లు తలసరి రూ.5,573 ఉంటే ఏపీకి ఇస్తున్న తలసరి గ్రాంటు రూ. 3,428. ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలకు ఆదాయపు పన్ను రాయితీ, జీఎస్టీ మినహాయింపు, పారిశ్రామిక ప్రోత్సాహకాల అందించటం వల్ల హోదాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించాలన్నా, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దారితీసే పారిశ్రామిక ప్రగతి జరగాలన్నా ప్రత్యేకహోదా అవసరం' అంటూ శాసనసభలో ముఖ్యమంత్రి జగన్ హోదా తీర్మానాన్ని ఆమోదింప చేశారు. తీర్మానానికి ముందు ఢిల్లీ వెళ్ళి ప్రధాని మోదీని, నాటి బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాను కలిసి హోదాపై విజ్ఞప్తులు చేశారు. బీజేపీ ప్రభుత్వానికి మెజార్టీ ఉన్నందున ఇతర పార్టీలపై ఆధారపడే పరిస్థితి లేదు కాబట్టి, ఒకటికి 30 సార్లు 'ప్లీజ్... ప్లీజ్...' అంటూ బతిమిలాడటం తప్ప చేయగలిగింది ఏమీ లేదని ఢిల్లీలోనే తేల్చేశారు. మరిప్పుడు ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందా? అనే భేతాళ ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం చెప్పే 'విక్రమార్కులు' రాష్ట్రంలో లేరు. పోనీ, ఢిల్లీ ప్రయోజనాలు తప్ప, రాష్ట్ర ప్రయోజనాలు పట్టించుకోని రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పినట్టు 'హోదా ముగిసిన అధ్యాయమా'? అంటే ఏ పార్టీ అంగీకరించటం లేదు. అయితే, హోదా ఎలా వస్తుంది? ఎవరు తెస్తారు? తెచ్చేందుకు ఏం చేస్తారు? బలమైన ప్రధానిని ఎలా అంగీకరింప జేస్తారు? రాజ్యసభలో వెంకయ్యనాయుడు అడిగినట్టు హోదా పదేళ్ల ఇవ్వక పోయినా, ఆనాటి ప్రధాని మన్‌మోహన్ ప్రకటించినట్టు కనీసం ఐదేళ్లైనా ఇస్తారా? ఈ ప్రశ్నలకూ ఎవరి దగ్గరా సమాధానాలు లేవు. హోదా సాధనలో ముఖ్యంగా అధికార పక్షం కర్తవ్యం ఏమిటి? తెలుగుదేశం, జనసేన, ఉభయ కమ్యునిస్టుల ప్రణాళికలేంటి? సమైక్య మేధావులు, ఎన్జీవోల వ్యవహార శైలి ఎలా ఉంటుంది? హోదా తీసుకొస్తామని ప్రజల్ని నమ్మించిన వారంతా ఊరకుండిపోవాలా? పదవుల్లో, అధికారాల్లో తులతూగుతుంటారా? ఫలితంగా ప్రజాస్వామ్య దేశంలో, అత్యున్నత పార్లమెంట్ ఇచ్చిన హోదా హామీని, న్యాయమైన హక్కులను వదులుకోవాలా? అంటే ఐదున్నర కోట్ల సీమాంధ్ర ప్రజలు మౌనంగా మిన్నకుండి పోవాలా? పాలకులు ప్రజల ఆకాంక్షలను, కోరికలను, న్యాయమైన హక్కులను కాలరాస్తున్నప్పుడు ప్రజలకు ఉద్యమాలే అంతిమ మార్గం. ఇలాంటి ఉద్యమాలను రాష్ట్ర రాజకీయ పక్షాలు నిర్మాణం చేస్తాయా? ప్రజల్ని చైతన్య పరచి నవ్యాంధ్ర సంజీవని సాధనకు నడుంకడతాయా? అధికార పక్షం అన్ని రాజకీయ పక్షాలతో కలిసి ఐక్యకార్యాచరణ ఏర్పాటు చేసుకొని ఢిల్లీ పెద్దలపై తలపడతారా?





> రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నప్పుడు తమిళనాడు, తెలంగాణ తరహాలో అందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరాన్ని గుర్తించే వరకు హోదా ఒక ఓట్ల జాతర అంశంగానే ఉంటుంది. రాజకీయ పార్టీలకే సంజీవనిగా చలామణి అవుతుంది. హోదా సాధనలో విశ్వసనీయత ఉండాలని చెప్పిన వైకాపా ఆ దిశగా హోదాను సాధించలేకపోతే, కాలం గడిచే కొద్దీ హోదా సాధన వైఫల్యానికి మూల్యం చెల్లించుకోక తప్పదు. అంతిమంగా ప్రజలు నిద్రాణ స్థితిని వీడి బలమైన ప్రజా ఉద్యమం నిర్మిస్తేనే హోదా సాధ్యం.

సీమాంధ్రలోనూ ప్రజా వెల్లువలకూ, తెగింపు ఉద్యమాలకూ కొదవ లేదు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా, నిజాం ప్రభువుకు నిరసనగా, తెలంగాణ సాయుధ పోరాటానికి సంఘీభావంగా ఎన్నో చారిత్రక ఉద్యమాలు జరిగాయి. తెలంగాణ ప్రాంతంలో జరిగిన పలు త్యాగపూరిత ఉద్యమాలకు సీమాంధ్రకు చెందిన విద్యార్థులు, యువకులే నాయకత్వం వహించారు. కానీ, ప్రజల్లో ఉన్న అలాంటి ఉద్యమ స్ఫూర్తిని సీమాంధ్ర పాలకులే నిర్వీర్యం చేశారు. పోరాడకుండా ప్రజల్ని భ్రమల్లోకి నెట్టారు. దళారీలను, వైట్ కాలర్ సోకాల్డ్ నాయకులను ప్రోత్సహించి కృత్రిమ ఆందోళనలతో సరిపెట్టారు. ప్రజల్లో నుంచి ఉద్యమాలను, నాయకులను పుట్టకుండా చేశారు. కోరిక న్యాయమైనదే అయినా భవిష్యత్ మార్గం సుగమనం చేసేదే ఐనా ప్రజల్ని ప్రేక్షకులుగా మిగిల్చారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నప్పుడు తమిళనాడు, తెలంగాణ తరహాలో అందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరాన్ని గుర్తించే వరకు హోదా ఒక ఓట్ల జాతర అంశంగానే ఉంటుంది. రాజకీయ పార్టీలకే సంజీవనిగా చలామణి అవుతుంది. హోదా సాధనలో విశ్వసనీయత ఉండాలని చెప్పిన వైకాపా ఆ దిశగా హోదాను సాధించలేక పోతే, కాలం గడిచే కొద్దీ హోదా సాధన వైఫల్యానికి మూల్యం చెల్లించుకోక తప్పదు. అంతిమంగా ప్రజలు నిద్రాణ స్థితిని వీడి బలమైన ప్రజా ఉద్యమం నిర్మిస్తేనే హోదా సాధ్యం.

**– పోతుల బాలకోటయ్య**

*(ఫిబ్రవరి 20: ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించిన రోజు)*

**వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా**

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జూబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

# సామాజిక న్యాయం పాలకుల ఇష్టమా?

పదోన్నతిలో రిజర్వేషన్ ప్రాథమిక హక్కు కాదని; ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాలను కోర్టులు ఆదేశించలేవని స్పష్టంచేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల ఒక తీర్పు వెలువరించింది. ఈ తీర్పు సహజంగానే దేశంలో పెద్దచర్చకు తెరతీసింది. పార్లమెంటులోనూ దీనిపై దుమారం లేచింది. సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని లేదా కోర్టు పరిధినుంచి రిజర్వేషన్ల అంశాన్ని తొలగించి రాజ్యాంగం 9వ షెడ్యూలులో చేర్చాలని ప్రతిపక్ష పార్టీలే కాకుండా ప్రభుత్వ మిత్ర పక్షాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. తాము రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని పాలక బీజేపీ చెప్తుందే గానీ నిర్దిష్ట చర్య లేవీ చేపట్టడం లేదు.

పదోన్నతిలో రిజర్వేషన్ల అమలును కోరిన ఒక పిటిషన్ దారుకు అనుకూలంగా ఉత్తరాఖండ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సుప్రీం కోర్టు కొట్టివేసింది. వివరంగా చూస్తే, ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపనుల శాఖలో సహాయక ఇంజనీర్లకు పదోన్నతి కల్పించడంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పాటించవద్దని నోటిఫికేషన్ ఇచ్చింది. పదోన్నతులలో రిజర్వేషన్లు పాటించేటట్లు ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని ఆదేశించవలసిందిగా ఆ రాష్ట్ర హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలయింది. దానిపై తీర్పు వెలువరిస్తూ పదోన్నతిలో రిజర్వేషన్లు పాటించాలా లేదా అనేది నిర్ణయించడానికి ఆయా సామాజిక వర్గాలు ప్రభుత్వోద్యోగాల్లో ఏమేరకు ప్రాతినిధ్యం పొందుతున్నాయన్న విషయమై నాలుగు నెలల్లో గణాంకాలు సేకరించాలని, ఆ గణాంకాలపై ఆధారపడి, ప్రాతినిధ్యం తక్కువగా ఉన్న సామాజిక వర్గాల వారికి పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ తీర్పుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో అప్పీల్ దాఖలైంది. జస్టిస్ లావు నాగేశ్వర రావు, జస్టిస్ హేమంత్ గుప్తా సభ్యులుగా వున్న సుప్రీం కోర్టు ధర్మాసనం ఆ అప్పీల్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతిలో రిజర్వేషన్ కల్పించాలా లేదా అన్నది ప్రభుత్వమే నిర్ణయించుకోవాలని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. కల్పించదలుచుకుంటే ఆయా సామాజిక వర్గాలు ప్రభుత్వోద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం కలిగి లేవని చూపించే గణాంకాలను ముందుగా సేకరించాలని తీర్పు చెప్పింది. ఏదేని సామాజిక వర్గానికి రిజర్వేషన్ కల్పించాలని అనుకోకపోతే గణాంకాలు సేకరించవలసిన పనిలేదని కూడా సుప్రీం కోర్టు వివరణ ఇచ్చింది. అటువంటి గణాంకాలు అందుబాటులో ఉన్నా వాటిపై ఆధారపడి రిజర్వేషన్లు అమలు జరపాలని ప్రభుత్వాలను కోర్టులు ఆదేశించలేవని కూడా సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పు స్పష్టంగానే ఉంది. అయితే, ఈ తీర్పు రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నదా లేదా అన్నదే చర్చనీయాంశం.

ఈ వ్యాజ్యం నేరుగా చేసే నియామకాల విషయం కాదు. ఈ కేసు గురించి సుప్రీం కోర్టు తీర్పు మొదటి పేరాలోనే 'పదోన్నతిలో రిజర్వేషన్‌కు సంబంధించిన'దని స్పష్టంగా పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుకూడా పదోన్నతిలో రిజర్వేషన్‌కు సంబంధించినదే. ఉత్తరాఖండ్ హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు రద్దుచేయడంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం 2012 సెప్టెంబర్ 5న పదోన్నతిలో రిజర్వేషన్ పాటించవద్దని ఇచ్చిన నోటిఫికేషన్ చెల్లుబాటు అవుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్, ఉత్తరాఖండ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు, హైకోర్టు తీర్పును రద్దుచేసిన సుప్రీం కోర్టు తీర్పు కూడా పదోన్నతుల్లో రిజర్వేషన్ల గురించి మాత్రమే. అయినా సుప్రీం కోర్టు తన తీర్పులో భాగంగా డైరెక్టు రిక్రూట్‌మెంట్‌లో కూడా రిజర్వేషన్లు ప్రాథమిక హక్కు కాదని పేర్కొనడంతో సమస్య బాగా విస్తరించింది.

రిజర్వేషన్లు సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు భావించి ఉంటే కొన్ని పరిమితుల్లోనైనా పదోన్నతుల్లో రిజర్వేషన్లు ప్రాథమిక హక్కు అని తీర్పు చెప్పేది. పదోన్నతుల్లో రిజర్వేషన్ ప్రాథమిక హక్కా కాదా తేల్చాలంటే అసలు రిజర్వేషన్లు వెనుకబడిన వర్గాల ప్రాథమిక హక్కా కాదా తేల్చాలి. నేరుగా జరిపే నియామకాల్లో రిజర్వేషన్లకు ఏ వాదన వర్తిస్తుందో అదే వాదన పదోన్నతుల విషయంలోనూ వర్తిస్తుంది. అందుకే రిజర్వేషన్లు ప్రాథమిక హక్కా కాదా అన్న విషయం తోనే తన తీర్పు ముడివడి ఉందని సుప్రీం కోర్టు గ్రహించింది. అందుకే కావచ్చు, కేసు, తీర్పు పదోన్నతుల్లో రిజర్వేషన్లకు పరిమితమైనవి అయినా తీర్పు ఉపోద్ఘాతంలో రిజర్వేషన్ సమస్యను మొత్తంగా సుప్రీం కోర్టు చేపట్టింది. వెనుకబాటును అధిగమించిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్ ఇవ్వడం అంటే ఇతరుల విషయంలో సమానత్వపు న్యాయాన్ని పాటించకపోవడమే అవుతుంది. కాబట్టి రిజర్వేషన్లు కల్పించినప్పుడు లేదా కొనసాగించినప్పుడు తగిన శ్రద్ధ తీసుకోవాలి. ఈ విషయంలో కోర్టు తీర్పును తప్పుపట్టలేము. ఐతే తాజా గణాంకాల ప్రకారం వెనకబడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్ కల్పించకపోవడం, కొనసాగించకపోవడం ఆయా సామాజిక వర్గాల ప్రాథమిక హక్కుకు భంగం కాదా అంటే కాదు అని సుప్రీం కోర్టు అంటుంది. వెనుక బడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్ అనేది ప్రాథమిక హక్కు కాదని కోర్టు స్పష్టంగా ప్రకటించింది. ఇంత పెద్ద విషయంపై కోర్టు తగిన వాదన చేయకుండా గత కొన్ని తీర్పులను (ఉదా: సురేష్‌చంద్ గౌతమ్ కేసు–2016) ఉటంకించి తన తీర్పును జోడించింది. అయితే రిజర్వేషన్లపై గత తీర్పులు సరైనవి కావని, వాటిని పునఃపరిశీలించాలన్న సీనియర్ న్యాయవాదులు కొలిన్ గొంజాల్వెజ్, దుష్యంత్ దావే, కపిల్ సిబాల్‌ల వాదనను కోర్టు పట్టించుకోలేదు.

> పదోన్నతిలో రిజర్వేషన్‌కు సంబంధించి వెనుకబడిన సామాజిక వర్గాలను పట్టించుకోవడం లేక పట్టించుకోకపోవడమనే అతి ముఖ్య విషయాన్ని రాజ్యాంగం ప్రభుత్వాలకు విడిచిపెట్టిందని సుప్రీం కోర్టు భావించడం ఆశ్చర్యకరంగా వున్నది. కార్యనిర్వాహక వ్యవస్థకు ఆదేశాలు ఇవ్వవలసిన తన రాజ్యాంగ బాధ్యతను, అధికారాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం వదులుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

భారత రాజ్యాంగం మొదటి వాక్యమే, 'భారతదేశ ప్రజమైన మేము... అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కొరకు... అందరికీ సమానమైన గౌరవం, సమానమైన అవకాశాల కొరకు... ఈ రాజ్యాంగాన్ని... మాకు మేము ఇచ్చుకుంటున్నాము.' అని పేర్కొంది. ఈ పీఠికలో సమానత్వమే కాక సమాన అవకాశాల గురించి కూడా నొక్కిచెప్పడం జరిగింది. అంటే అవకాశాలలో వెనుకబడిన వారి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. దీనినే జస్టిస్ చిన్నప్పరెడ్డి తన బి.సి కమీషన్ రిపోర్టులో పాజిటివ్ వివక్ష అన్నారు. రిజర్వేషన్ సదుపాయం వివక్ష కాదని, అది సమానత్వ సాధనకు ఉపయోగపడే ప్రగతి శీల వివక్ష అని జస్టిస్ చిన్నప్పరెడ్డి అన్నారు. అసమానతల నిర్మూలన ఒక సామాజిక అవసరం అని అందుకే రిజర్వేషన్లు ప్రగతిశీలమైనవని రాజ్యాంగ నిర్మాతలు భావించి రాజ్యాంగంలో పొందు పరిచారు. ఈ వాస్తవాన్ని ప్రజలు సరే, పార్టీలు, చివరికి కోర్టులు కూడా మరిచిపోతున్నట్లు ఉన్నాయి.

రాజ్యాంగం అధికరణం 16లో క్లాజు 4, 4 ఎ లను సుప్రీం కోర్టు తీర్పులో ప్రస్తావించారు. అయితే వాటిని వాటి సందర్భంలో గ్రహించినట్లు అనిపించదు. భారత రాజ్యాంగంలో అధికరణం 12 నుండి అధికరణం 35 వరకు ప్రాథమిక హక్కులుగా పేర్కొనబడ్డాయి. అధికరణం 14,15,16 సమానత్వపు హక్కు, వివక్షకు వ్యతిరేకమైన హక్కు, విద్యా, ఉద్యోగావకాశాలలో రిజర్వేషన్ హక్కును కల్పిస్తున్నాయి. రాజ్యాంగ భాగం 3లో ఉన్న ఈ హక్కులు ప్రాథమిక హక్కులు కాకుండా ఎలా పోయాయో మాత్రం సుప్రీం తన తీర్పులో వివరించలేదు. 14,15,16తో సహా భాగం 3లో ఉన్న అధికరణలన్నీ ప్రాథమిక హక్కులే. నిజానికి ప్రాథమిక హక్కు రెండు రకాలు. వాక్ స్వాతంత్ర్యం, సభా స్వాతంత్ర్యం, సంఘ స్వాతంత్ర్యం వంటి హక్కులు మొదటి రకం. ఇవి రాజ్యాధిపత్యం నుండి పౌరులకు రక్షణ కల్పిస్తున్నాయి. వీటి కొరకు ప్రభుత్వం ఏమీ చేయవలసిన అవసరం లేదు. ప్రజల హక్కులను గౌరవిస్తే సరిపోతుంది. సమాన అవకాశాల కొరకు హక్కు, సామాజిక న్యాయం, విద్యా హక్కు (21ఎ) వంటివి రెండవ రకం హక్కులు. వీటిని ప్రభుత్వం పౌరులకు కల్పించాలి. అందుకు ప్రత్యేకమైన అనుకూల చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో పౌరుల హక్కులు ప్రభుత్వ బాధ్యత. రాజ్యాంగం నాల్గవ భాగమైన ఆదేశిక సూత్రాల విషయం వేరు. అందులో ఇవ్వబడిన హక్కుల విషయంలో ప్రభుత్వాలకు వెసులుబాటు ఉంటుంది, ప్రాథమిక హక్కు విషయంలో ప్రభుత్వాలకు వెసులుబాటు ఉండదు. సుప్రీం కోర్టు తన తీర్పులో క్లాజు 16 4, 4ఎలు ప్రభుత్వాలకు నిర్దేశించబడిన విధులు కావని, ప్రభుత్వాలు రిజర్వేషన్లు ఇవ్వదలుచుకుంటే ఆ అధికారం వాటికి కల్పిస్తున్నాయని పేర్కొంది. క్లాజు 16 4; 4ఎలు సుప్రీం కోర్టు ధర్మాసనం చెప్పినట్లు ప్రభుత్వానికి అధికారాలు కల్పించే క్లాజులు. వెనుకబడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు నిరాకరించే అధికారాలు కావు, అవి స్పష్టంగా, రిజర్వేషన్ కల్పించే అధికారాలు. వెనుకబడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్ నిరాకరించే అధికారం ప్రాథమిక హక్కుల భాగంలో రాజ్యాంగ నిర్మాతలు చేర్చారని భావించలేము. వెనుకబడిన వర్గాలను పట్టించుకోవడం లేక పట్టించుకోకపోవడం అనేది రాజ్యాంగం ప్రభుత్వాలకు విడిచిపెట్టిందని సుప్రీం కోర్టు భావించడం ఆశ్చర్యకరమైన విషయం. ఆయా సందర్భాలలో ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వవలసిన తన రాజ్యాంగ బాధ్యత, అధికారాన్ని సుప్రీం కోర్టు చేజేతులా వదులుకోవడం ఆందోళనకలిగిస్తోంది. ఈ తీర్పు సామాజిక న్యాయానికే కాదు, భారత రాజ్యాంగం నిర్దేశించిన అధికార విభజన సమతౌల్యతకు కూడా భంగకరంగా ఉన్నది.





**◆ రమేష్ పట్నాయక్**
అఖిలభారత విద్యాహక్కు వేదిక

జనవాక్యం

## పథకాలపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ

వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన నవరత్నాల పథకాలు చిత్తశుద్ధిగా అమలు చేయాలని భావిస్తున్నది. కానీ రైతు భరోసా, ఫించన్లు, అమ్మఒడి పథకాలకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువై అర్హులకు లబ్ధిచేకూరటం లేదు. కొత్త ఇసుక విధానంతో కొద్దినెలలపాటు ఇబ్బందులు భరించిన ప్రజలకు ఆన్‌లైన్‌లో బుకింగ్ అందుబాటులోకి వచ్చినా, ఇసుకను అవసరం లేని వాళ్ళు బుక్‌చేసుకొని బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ప్రభుత్వం పరిపాలనా వికేంద్రీకరణకోసం, యువతకు ఉద్యోగాల కల్పనకోసం ప్రవేశపెట్టిన వాలంటీర్లు, సచివాలయం ఉద్యోగాలు ఒకేసారి సుమారు 4 లక్షల మందికి ఉపాధి లభించింది. కానీ అంతకు ముందే చిరుద్యోగాలు చేసుకుంటున్నవారు దాన్ని పూర్తిగా వదలలేక, దీనిలో పూర్తిగా టైము గడపలేక పోవడంవల్ల కొన్ని ఏరియాలో పూర్తి స్థాయి ఇంటింటి సర్వేలు జరగలేదు. ఆ కారణంగా అర్హులను గురించలేదు. పై అధికారుల పర్యవేక్షణ కొరవడితే ఏ పథకమైనా ప్రజల్లోకి వెళ్ళదు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా ప్రతి పథకాన్నీ గ్రామ సచివాలయం, వాలంటీర్ వ్యవస్థలకు ముడిపెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమే అయినా ఆ వ్యవస్థలు అంకిత భావంతో లేకపోతే ప్రభుత్వానికి వచ్చే వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉంటుంది. టోల్ ఫ్రీ నెంబర్లలో సమాధానం దొరకకపోవడం, స్పందన అప్లికేషన్లకు స్పందన కొరవడడం కూడా చాలా చోట్ల జరుగుతోంది. పౌరసరఫరాల, ఆరోగ్య, విద్యా, వ్యవసాయ, రెవెన్యూ శాఖలతో అనుసంధానమైన ఈ పథకాలన్నీ సక్రమంగా జరగాలంటే ఆయా శాఖలకు సంబంధించిన మంత్రులు, అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి. అన్ని సచివాలయాల్లో వాలంటీర్ల పేర్లు, ఫోన్ నెంబర్లు, స్పందన ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా డిస్‌ప్లే చేసేట్టుగా చూడాలి. ఆ డివిజన్ ప్రజలందరికీ ఆ వార్డు సచివాలయం తాలూకా అందరి ఫోన్‌నెంబర్లు అందుబాటులోకి వచ్చేట్లు చూడాలి.

**– జోస్యుల వేణుగోపాల్**, విజయవాడ

epaper.andhrajyothy.com

ఫ్యామిలీ కౌన్సెలింగ్

# నా కాపురం నిలబెట్టుకోవడం ఎలా?

నా వివాహమై పదేళ్లయ్యింది. మాకు ఇద్దరు పిల్లలు. ఒకరినొకరం ఎంతగానో ఇష్టపడి పెళ్లి చేసుకున్నాం. అయితే ఈమధ్య తను ఎక్కువసేపు ఫోన్‌లో చాటింగ్ చేస్తూ గడుపుతున్నాడు. అర్ధరాత్రి అయినా ఫోన్ వదలడం లేదు. దాంతో తప్పే అయినా ఆయన ఫోన్ చెక్ చేశాను. మా సమీప బంధువులైన ఇద్దరు మహిళలతో మాట్లాడుతున్నాడని తెలిసింది. ఈ విషయమై నిలదీస్తే గొడవపడి మాట్లాడటం మానేశాడు. కానీ వాళ్లతో చాటింగ్ మాత్రం మానలేదు. వాళ్లూ పెళ్లయి పిల్లలున్నవారే. ఎందుకిలా చేస్తున్నారో అర్థం కావడం లేదు. వాళ్లకు బుద్ధి చెప్పి, నా కాపురం నిలబెట్టుకోవడం ఎలా? ఈ సమస్యలతో నా ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. - శ్రుతి

మీరు చెప్పిన సమస్యలు ఈ రోజుల్లో సాధారణమైపోయాయి. నైతికత అనే పదానికి అర్థాలు మారిపోతున్నాయి. చదువు, సంస్కారం ఎందుకూ పనికిరావడం లేదు. సంసారాన్ని పణంగా పెట్టి మీవారు వేరే వాళ్లతో అర్ధరాత్రి వరకు చాటింగ్ చేయడం క్షమార్హం కాదు. అయితే అతని దృష్టిలో అదొక సరదా అంతే. అలాగే ఆ మహిళలూ అంతే. వారికి అదొక కాలక్షేప వ్యవహారం. అలాగనీ వారు కలుసుకోవడం, తిరగడం... ఇవేవీ ఉండవు. ముందే చెప్పినట్టు ఇదొక జాడ్యం. మందులు లేని మానసిక రోగం. కుటుంబాలను కూల్చివేసే ఇటువంటి ఆగడాలను వెంటనే అరికట్టాలి. లేకపోతే సున్నిత మనస్కులైన మీలాంటి వారిపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అందుకే గొడవపడటం అనవసరం. ఇంటికొచ్చాక కుటుంబానికి మాత్రమే సమయం కేటాయించాలని స్పష్టంగా వివరించండి. మీ మాట వినకపోతే పెద్దవారి సాయం తీసుకోండి. అసలు మీ భర్త ఏం కోరుకుంటున్నారో ఎందుకలా చేస్తున్నారో ఆయన నోటివెంట చెప్పిస్తే పరిష్కారం సులభం. తొందరపాటు, ఆవేశం తెచ్చుకోకుండా ప్రయత్నించండి.

● **కె.శోభ**, ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com




ఆదర్శం


రామకృష్ణ సతీమణి గృహలక్ష్మి

**మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా హేతుబద్ధమైన ఆలోచనల వ్యాప్తే లక్ష్యంగా ఏర్పడింది చార్వాక ఆశ్రమం. ఏటా 'నాస్తికమేళా' నిర్వహిస్తూ జనంలో చైతన్యం పెంపొందించడానికి పాటుపడుతోంది. ఇదంతా ఒక విద్యావేత్త ఆశయం. దాన్ని ఆయన కుటుంబం ముందుకు నడిపిస్తోంది. ఎందరిలోనో మార్పు అంకురాలను నాటుతున్న ఆ మహోద్యమం గురించి...**



# ఈ ఆశ్రమం.. మానవతకు ఆశ్రయం!

"శ్రమైక జీవన విధానమే మన సంస్కృతికి పునాది. దీనికి భిన్నంగా వినిమయ సంస్కృతి చొచ్చుకువస్తున్న నేటి కాలంలో సమాజాన్ని హేతుబద్ధమైన, శాస్త్రీయమైన ఆలోచనల దిశగా నడిపించి, మన నిజమైన సంస్కృతిని ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఇంకా పెరిగింది. ఆ దిశగా తన కార్యాచరణను చార్వాక ఆశ్రమం చేపడుతోంది" అంటారు బి. అరుణ. ఈ ఆశ్రమాన్ని జాతీయోద్యమ కాలంలో నడిచిన సంఘ సంస్కరణ ఉద్యమాలకు కొనసాగింపుగా ఆమె అభివర్ణించారు. గుంటూరు జిల్లా మంగళగిరికి 3 కిలోమీటర్ల దూరంలోని నిడమర్రులో ఉంది చార్వాక ఆశ్రమం. దీని వ్యవస్థాపకుడు అరుణ తండ్రి బి. రామకృష్ణ.

**ఇదీ నేపథ్యం!**

"తపస్సు ద్వారా ఆత్మజ్ఞానం సంపాదించగలమన్న భావవాదుల ప్రచారాన్ని తోసిపుచ్చి, ఇంద్రియ జ్ఞానం ఒక్కటే జ్ఞానసముపార్జనకు మార్గమని ప్రతిపాదించినవారు చార్వాకుడు. భారతదేశంలో క్రీస్తుపూర్వం ఆరువందల నాటికే భౌతికవాదాన్ని రూపొందించి, ప్రచారం చేశారు. మానవ జీవితం గురించి హేతుబద్ధవెత్తున దృక్పథంతో భారతీయ తాత్త్విక చింతనను ఎంతగానో ప్రభావితం చేశారు. 'భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మత- మతం' అని ఆనాడే ప్రకటించారు. తొలి భౌతికవాద తత్త్వమైన చార్వాక, లోకాయత సిద్ధాంతాన్ని తెలుగునాట తొలుత వేమన, ఆ తరువాత త్రిపురనేని రామస్వామి, కొండవీటి వేంకటకవి వంటి వారు ప్రచారం చేశారు. వారి దారిలోనే నడిచి, చార్వాకాన్ని ఇంటి పేరుగా మార్చుకున్నారు మా నాన్న గారు రామకృష్ణ" అని అరుణ వివరించారు.


ఆశ్రమంలోని రామకృష్ణ విగ్రహం
కుమార్తె అరుణ

**తొలుత విద్యాపీఠంగా...**

రామకృష్ణ అప్పటి తాడికొండ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. ఆ రోజుల్లోని విద్యావిధానం అశాస్త్రీయమని భావించి, ఆ వ్యవస్థలో ఉండలేక రాజీనామా చేశారు. 1974లో నిడమర్రులో 'ప్రగతి విద్యావనం' పేరిట చార్వాక విద్యాపీఠాన్ని స్థాపించారు. మిగిలిన విద్యాలయాలకు భిన్నంగా సిలబస్‌ను రూపొందించారు. తమ విద్యార్థుల్లో ప్రశ్నించే నైజాన్ని ప్రోత్సహిస్తూ, సైంటిఫిక్ ఎడ్యుకేషన్ సెంటర్‌గా దాన్ని తీర్చిదిద్దారు. ప్రశ్న (?) ఈ స్కూల్ సింబల్. స్వతహాగా మంచి ఉపాధ్యాయుడైన రామకృష్ణ పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసేవారు. వారికి ప్రేమగా బోధించేవారు. ఈ విద్యాపీఠమే కాలక్రమంలో 'చార్వాక ఆశ్రమం'గా మారింది. ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో నేడు మేధావులుగా, సాహితీవేత్తలుగా, అభ్యుదయ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. అంతే కాదు, 'చార్వాక' పత్రిక ద్వారా కూడా తెలుగునాట నాస్తికోద్యమాన్ని రామకృష్ణ విస్తృతంగా ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్లారు. "నాస్తికోద్యమమంటే దేవుడిని నమ్మకపోవడమేనని చాలామంది భావిస్తారు. అయితే దేవుడిని నమ్మడానికి, నమ్మకపోవడానికి కూడా ఒక తాత్వికత ఉన్నదని, పురాతన భారత తత్త్వవేత్తలు అత్యధికులు నాస్తికులేనని కొందరికే తెలుసు" అని చెబుతారు అరుణ.

**దుస్తులతో ఉన్న వేమన!**

చార్వాక ఆశ్రమంలో ప్రవేశించగానే మహాత్మా రావణ మైదానం, దుస్తులు ధరించిన వేమన విగ్రహం కనిపిస్తాయి. వేమన దిగంబరుడు కాదనీ, రావణుడు హింసోన్మాదీ కాదనీ, వేమన 300 ఏళ్ల క్రితమే విగ్రహారాధనను ఖండించి, హేతువాదానికి పట్టం కట్టి, మానవ జిజ్ఞాసకు, తార్కిక దృష్టికీ విలువ ఇచ్చాడనీ అంటారు అరుణ. వేమనను అపహాస్యం చేసేందుకే మతవాదులు, భావవాదులు ఆయనను దిగంబరునిగా, పిచ్చివానిగా చూపించే ప్రయత్నం చేశారన్నారు. "అందుకే ఆశ్రమం ఆవరణలో వేమన విగ్రహం మాత్రమే కాదు, సామాజిక మార్పు కోసం ఉద్యమించిన అంబేడ్కర్, పెరియార్ రామస్వామి, త్రిపురనేని రామస్వామి, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, కె.వి.కృష్ణ, సామినేని ముద్దు నరసింహం, పాయసి విగ్రహాలను, ఆశ్రమం లోపల భారతీయ ప్రాచీన హేతువాదులైన అసితకేశకంబళుడు, కణాదుడు, కపిలుడు, మక్కిలిగోశాలుడు తదితరుల విగ్రహాలను ఏర్పాటు చేశాం. ఆ వాదాన్ని ప్రవచించినవారిని ఈ తరానికి పరిచయం చేయడమే ఈ విగ్రహాలను ఏర్పాటు వెనుక ఉద్దేశం" అని చెప్పారామె.

**ఏటా ఒక జాతరలా...**

ఏ మతానికి చెందిన వారు ఆ మతపరమైన పండగలు, ఉత్సవాలు చేసుకుంటారు. మరి కులమతాలకు అతీతంగా మానవులందరి శ్రేయస్సును కాంక్షించే మానవతావాదులు ఏం చేయాలి? వారిలోని ఈస్థటిక్ సెన్స్‌ను ఎలా వ్యక్తపరుచుకోవాలి? ఆ ఆలోచన నుంచి రూపుదిద్దుకున్నదే 'నాస్తికమేళా'. 1992లో రామకృష్ణ ఈ మేళాకు రూపకల్పన చేశారు. నాటి నుంచి నేటి వరకూ ప్రతి ఏడాదీ ఫిబ్రవరి రెండో శని, ఆదివారాల్లో నిడమర్రులోని చార్వాక ఆశ్రమంలో భౌతికవాద కుటుంబాల సమ్మేళనంగా, ఒక జాతరలా ఈ మేళా జరుగుతూనే ఉంది. ఈ మేళాకు అభ్యుదయవాదులు, హేతువాదులు, వామపక్ష భావజాలం కలవారు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి హాజరవుతారు. మూఢనమ్మకాలు, కుల మత సమస్యలు, స్త్రీల అణచివేత, మానవ, సమాజ పరిణామ క్రమం, జీవ వైవిధ్యం, పర్యావరణం తదితర అంశాలపై చర్చలు, ఉపన్యాసాలుంటాయి. ఈ ఏడాది కూడా ఈ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు.

**ఆ కలను కొనసాగిస్తూ**

తానున్నా లేకున్నా ఈ నాస్తిక మేళా కొనసాగాలని, అందరూ ఇలానే కలుస్తూ ఉండాలన్నది రామకృష్ణ కోరిక. ఆయన 2007లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళే కర్తవ్యాన్ని భార్య గృహలక్ష్మి, బిడ్డలు సుధాకర్, స్నేహ, అరుణ, చార్వాక స్వీకరించారు. "మా అమ్మ, సోదరుడు సుధాకర్ ఆశ్రమ నిర్వహణలో పూర్తిగా నిమగ్నమయ్యారు. నేను 'జనసాహితి' ప్రధాన కార్యదర్శిగా, 'స్త్రీ విముక్తి సంఘటన' రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, ఆశ్రమానికి కావలసిన సహకారాన్ని అందిస్తున్నాను" అని చెప్పారు అరుణ. సమాజాన్ని కులాలు, మతాలుగా చీల్చివేస్తున్న సమయంలో మానవత్వానికి మాత్రమే పట్టం కట్టే ఇలాంటి ప్రయత్నాలు ఎంతో అవసరం కదూ!

**ప్రత్యామ్నాయంగా...**

**జాతీయ ఉద్యమ సమయంలో సంస్కరణ ఉద్యమాలకు సమాంతరంగా ప్రత్యామ్నాయ సాహిత్య సృష్టి జరిగింది. అందులో కందుకూరి వీరేశలింగం వెలువరించిన సాహిత్యం ఒక ఎత్తు. త్రిపురనేని రామస్వామి పురాణగాథలను భిన్న కోణంలో రచించిన సంజయ రాయబారం, సూత పురాణం, శంభూక వధ వంటి రచనలు మరో ఎత్తు. ఆ ప్రత్యామ్నాయ సాహిత్యాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.**

**- బి.అరుణ**, జనసాహితి ప్రధాన కార్యదర్శి

● **పద్మావతి వడ్లమూడి**
ఫొటోలు: **ఎస్.విజయ్‌బాబు**

స్ఫూర్తి

ఆమె పేరు గాయత్రి... మూడేళ్ల వయసు ఉన్నప్పుడు తల్లితో పాటు నిద్రిస్తుండగా, తండ్రి కోపంతో యాసిడ్ పోశాడు. తల్లీకూతుళ్ల మొహాలు కాలిపోయాయి. ఇప్పుడు... గాయత్రి బాగా చదువుకొని ఒక ఆఫీసులో ఉద్యోగం చేస్తోంది. చాలా మందికి తను ఓ ప్రేరణ.

రాధ వయసు 42 ఏళ్లు. భర్త నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటోంది. పూలు అమ్మితే నెలకు రెండు వేల సంపాదన. అనారోగ్యంగా ఉందని హాస్పిటల్‌కు వెళితే డాక్టర్ ఆపరేషన్ చేయాలన్నారు. ఆమె దగ్గర అంత డబ్బు లేదు. నా అనేవాళ్లు ఎవరూ లేరు. అయినా ఇప్పుడామె ఆరోగ్యంగా జీవిస్తున్నారు. సొంతంగా పూలకొట్టు నడుపుతున్నారు.

పద్మావతికి పోలియో వల్ల కాళ్లు చచ్చుబడ్డాయి. ఇద్దరు పిల్లలు పుట్టాక భర్త వదిలేసిపోయాడు. పిల్లలతో ఎలా బతకాలా! అని కుమిలిపోయింది. ఇప్పుడామె పేపర్ బ్యాగ్‌లు తయారుచేయడంతో పాటు సొంతంగా బోటిక్ నడుపుతున్నారు. పిల్లలను స్కూల్లో దింపిరావడానికి టూ వీలర్ కొనుకున్నారు.

పై ముగ్గురే కాదు... ఏ ఆధారం లేకుండా జీవించే వందలాది మంది ఒంటరి మహిళలకు ఆధారం 'నామ్'. ఎలాంటి ఆసరా లేకుండా జీవిత సమరం సాగించే పేద ఒంటరి మహిళలకు 'నామ్' సంస్థ అండగా నిలుస్తోంది.

# అభాగ్య మహిళలకు ఇనామ్!

మహిళకు చేదోడు వాదోడుగా నిలుస్తూ, వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్న 'నామ్ చారిటబుల్ ట్రస్ట్' వ్యవస్థాపకురాలు ఎవరో కాదు... నటి సుహాసినీ మణిరత్నం. చెన్నైలోని ఈ సంస్థ ద్వారా గడచిన పదేళ్లుగా ఆమె మహిళాభ్యున్నతికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా సమాజంలో ఒంటరిగా బతుకుపోరాటం సాగించే మహిళలు, వారి పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యతను 'నామ్' సంస్థ తీసుకుంది. యువతులు, భర్త వదిలేసినవాళ్లు, భర్త చనిపోయిన పేద మహిళలకు ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నారు.



**మహిళా వాలంటీర్లతో...**

కార్పెట్ల తయారీలాంటి ఆసక్తి ఉన్న రంగాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చి, స్వయంఉపాధిని కల్పిస్తున్నారు. తద్వారా తమ జీవితాలను తీర్చిదిద్దుకునే అవకాశాన్ని వారికి కల్పిస్తున్నారు. ఒంటరి మహిళల పిల్లలకు చదువు చెప్పించే బాధ్యతను 'నామ్' సంస్థ తీసుకుంది. ఏదో ఒక సేవాకార్యక్రమానికి పరిమిత మవకుండా వారి జీవితాలను పరిపూర్ణంగా చక్కదిద్దే పనిని సంస్థ తలకెత్తుకుంది.

ఒంటరిమహిళలు, వారి పిల్లలకు అవసరమైన ఆరోగ్య చికిత్స అందిస్తున్నారు 'నామ్' ప్రతినిధులు. వారిని శారీరకంగా, మానసికంగా బలోపేతం చేసేందుకు యోగాలో శిక్షణ ఇస్తున్నారు. మహిళలు తమను తాము కాపాడుకునేందుకు యుద్ధవిద్యల్లో శిక్షణ ఇస్తున్నారు. సమస్యలతో కొట్టుమిట్టాడుతోన్న మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు పై చదువులకు అవసరమయ్యే ఫీజును భరిస్తున్నారు. దీంతో పాటు 2015లో చెన్నైలో వరదలు వచ్చినప్పుడు కూడా బాధితులను ఆదుకోవడంలో 'నామ్' చొరవ తీసుకుంది. ఈ సంస్థ పూర్తిగా మహిళా వాలంటీర్లతోనే నడుస్తోంది. పలువురు మహిళలు, విద్యావంతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పలు సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు.

**కళ ద్వారా సేవ!**

'నామ్' సంస్థను స్థాపించి పదేళ్లు అయిన సందర్భంగా సేవాకార్యక్రమాలకు అవసరమైన విరాళాల కోసం ఇటీవల సుహాసిని ఆధ్వర్యంలో పలువురు సినీతారలతో వినూత్నంగా ఒక క్యాలెండర్ రూపొందించారు. ప్రముఖ చిత్రకారుడు రాజా రవివర్మ పెయింటింగ్స్‌ను ఫొటోలుగా మలిచారు. సమంత, ఖుష్బూ, శోభన లాంటి 12 మంది సినీతారలు ఈ ఫొటోషూట్‌లో పాల్గొన్నారు. ఒక్కో క్యాలెండర్ ధర రూ. 1500. వీటి అమ్మకం ద్వారా వచ్చే ఆదాయాన్ని 'నామ్'లో ఆశ్రయం పొందుతున్న ఒంటరి మహిళల కోసం, పలు సేవా కార్యక్రమాల కోసం వినియోగిస్తారు.



ఒంటరి మహిళలకు బాసటగా నిలిచే క్రమంలో చాలా ఇబ్బందులే ఎదుర్కొన్నారు సుహాసిని. అయినా వెనుకడుగు వేయలేదు. మహిళలు సొంతంగా ఎదుగుతుండడం చూసి ఇరుగు పొరుగు ఇబ్బందులు సృష్టించేవారు. కొంతమంది పిల్లలు తండ్రి లేకపోవడం వల్ల తల్లిని గౌరవించకపోయేవారు. తమను చదివించడానికి తల్లులు పడే కష్టాన్ని పిల్లలు అర్థం చేసుకునేవారు కాదు. పని ప్రదేశాల్లో లైంగిక హింసకు గురవుతూ చెప్పుకోలేక కుమిలిపోయే పలువురు మహిళలకు కౌన్సిలింగ్ ఇచ్చి సమస్య నుంచి బయటపడేసింది 'నామ్'.



"మేము మీటింగ్ కోసం ఒంటరి మహిళలను పిల్చినప్పుడు తమకు ఏవో ఫ్రీ గిఫ్ట్‌లు ఇస్తారనుకొని వచ్చేవారు. అలాంటి ఆలోచనల నుంచి వారిని బయటకు తేవడానికి నాకు చాలాకాలం పట్టింది. నేను ఒంటరి మహిళలకు చేపలు పట్టివ్వాలనుకోలేదు. వారికి చేపలు పట్టడం నేర్పాలనుకున్నాను"
**-సుహాసినీ మణిరత్నం**

**బతికించే శక్తిని బయటకు తెచ్చేందుకు...**

"దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి తమిళనాడులో ఉచితంగా లబ్ధి చేకూర్చే పథకాలు చాలా ఉన్నాయి. మేము మీటింగ్ కోసం ఒంటరి మహిళలను పిలిచినప్పుడు కూడా తమకు ఏవో ఫ్రీ గిఫ్ట్‌లు ఇస్తారనుకొని వచ్చేవారు. అలాంటి ఆలోచనల నుంచి వారిని బయటకు తేవడానికి నాకు చాలాకాలం పట్టింది. ప్రభుత్వం వారికి తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు సాయం చేయకుండా, ఉచితాల పేరుతో తాయిలాలు ఇస్తోంది. నేను ఒంటరి మహిళలకు చేపలు పట్టివ్వాలనుకోలేదు. వారికి చేపలు పట్టడం నేర్పాలనుకున్నాను" అంటారు సుహాసిని.

NAAM CHARITABLE TRUST

ఈ సంస్థ ఆధ్వర్యంలో మహిళలు తయారుచేసిన వస్తువులు అమ్మేందుకు ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నారు. కొందరు మహిళలకు జీవనోపాధి కోసం ఆటోలు కొనిపెట్టారు. 'నామ్ ఫౌండేషన్' ద్వారా చెన్నైలోని సూర్యానగర్‌ను సుహాసిని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారు. పదేళ్ల నుంచి ఎంతోమంది మహిళలకు బతుకుదెరువు కల్పిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్న 'నామ్' కోసం... ఎంత బిజీగా ఉన్నప్పటికీ సమయాన్ని కేటాయిస్తూ విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు సుహాసినీ మణిరత్నం.

ఈ సంస్థ ద్వారా మరింత మందికి ఉపాధి, భరోసా ఇవ్వాలన్నదే ఆమె ధ్యేయం. ఆ దిశగా చక్కని ఆలోచనలతో 'నామ్' సరైన దిశగా అడుగులు వేస్తుండటం విశేషం.

పేరెంటచ్

# పీచుపదార్థాలు మరవద్దు!



పిల్లల చదువులు, లక్ష్యాలు మాత్రమే కాదు... అనుకున్నది సాధించాలంటే వాటికి అనువుగా వాళ్ల ఆరోగ్యం కూడా బాగుండాలి. శరీరం శక్తివంతంగా, నిర్మలంగా ఉండాలి. అందుకే శరీరానికి అవసరమైన పోషకాలన్నీ సంపూర్తిగా అందాలి. ప్రొటీన్లు, విటమిన్లు, లవణాలతో పాటు శరీరాన్ని నిర్మలంగా ఉంచే పీచు పదార్థాలు తప్పనిసరిగా అందాలి. కీరా లాంటి పీచుపదార్థాలతో పాటుగా విటమిన్లు, లవణాలు ఉండే పండ్లు ఇవ్వాలి. అయితే సమస్య ఏమిటంటే, పరీక్షల వేళ పిల్లల నిద్రా సమయం బాగా తగ్గిపోతుంది. దీనివల్ల ఆహారం జీర్ణం కావడంలో కొంత అంతరాయం ఏర్పడుతుంది. దాంతో మలబద్ధకం ఏర్పడుతుంది. మలినాలు బాగా పేరుకుపోయిన వారిలో జీవశక్తి, వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతాయి. ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు రావడం మొదలవుతాయి. శరీరం నీరసించి అసహనం, చిరాకు పెరుగుతాయి. సమస్య మరీ ఎక్కువైతే, ఒళ్లంతా దురద, మంట మొదలవుతుంది. పరీక్షల సమయంలో ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే, ఇక వాళ్లు ఏం చదువుతారు? పరీక్షల్లో ఏం రాస్తారు? చాలామంది తల్లిదండ్రులు పిల్లలకు బలవర్ధక ఆహారం ఇవ్వడం మీదే దృష్టి పెడతారు. కానీ, శరీరంలో నిలిచిపోయే వ్యర్థపదార్థాలను బయటికి పంపే విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా ఉంటారు. ఇది పిల్లలను తరచూ జబ్బుల బారిన పడేలా చేస్తుంది. ఫలితంగా బాగా చదివి మంచి ర్యాంకులు సాధించగలిగే పిల్లలు కూడా అతి తక్కువ మార్కులతో డీలా పడిపోతారు. సరైన తిండి లేకపోతే ఎంత చదివినా విషయాన్ని ఆకళింపు చేసుకుని, గుర్తుంచుకునే శక్తి ఉండదు. ఎంతో కొంత గుర్తున్నా, రాయడంలో ఒక అశక్తత ఏర్పడుతుంది. అందుకే పౌష్టికాహారానికి సరిసమానంగా పీచుపదార్థాలను కూడా ఇస్తూ ఉండాలి. అప్పుడే శరీరం మలినాలు లేకుండా శుభ్రమవుతుంది. అప్పుడే చదివింది గుర్తుంచుకుని పరీక్షలు బాగా రాస్తారు. ఆశించిన మార్కులూ, ర్యాంకూ సాధిస్తారు.

బ్యూటీ

# మేకప్ తేలిగ్గా తీసేద్దాం!

స్కిన్‌కేర్‌లో మేకప్ తొలగించడం కూడా ముఖ్యమైనదే. ఫంక్షన్లకు వెళ్లి ఇంటికి తిరిగొచ్చాక మేకప్ రిమూవర్ అందుకుంటారు చాలామంది. అయితే సమయానికి మేకప్ రిమూవర్ అందుబాటులో లేకున్నా కంగారు పడాల్సిన అవసరం లేదు. అలాంటప్పుడు ఇంట్లో లభించే వాటితో సులువుగా మేకప్ తొలగించవచ్చు. అదెలాగంటారా...



**కొబ్బరి లేదా ఆలివ్ నూనె:** కళ్ల దగ్గరి మేకప్, లిక్విడ్ లిప్‌స్టిక్ అంత తొందరగా వదలదు. కాటన్ ప్యాడ్ మీద కొద్దిగా కొబ్బరి లేదా ఆలివ్ నూనె వేసి దాంతో నెమ్మదిగా కళ్లు, పెదవుల మీద రుద్దితే మేకప్ పోతుంది.

**పెట్రోలియం జెల్లీ:** కళ్ల దగ్గర మేకప్ వదిలించేందుకు పెట్రోలియం జెల్లీ రాయాలి. దాంతో దీనిలో మేకప్ కరిగిపోతుంది. ఇది సురక్షితమైనది కూడా.

**మాయిశ్చరైజర్ క్రీమ్:** ఇది చర్మానికి తేమను అందించడమేగాక మేకప్ రిమూవర్‌గానూ పనిచేస్తుంది. కాటన్ ప్యాడ్ మీద మాయిశ్చరైజర్ క్రీమ్ రాసి, దాంతో కళ్ల చుట్టూ రుద్దితే మేకప్ తొలగిపోతుంది. అయితే ఆయిల్, పెట్రోలియం జెల్లీతో మేకప్ తొలగించిన తరువాత నీళ్లతో ముఖం కడుక్కోవడం మరవద్దు.

పదో తరగతిలో బయాలజీ, సోషల్ స్టడీస్ కీలకమైన సబ్జెక్టులు. డయాగ్రామ్స్‌తో బయాలజీ, మ్యాప్‌లు, చరిత్ర, సమకాలీన అంశాల నేపథ్యంగా సోషల్ స్టడీస్ ఉంటాయి. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఈ రెండు సబ్జెక్ట్‌లలో మంచి మార్కులకు ఎలాంటి వ్యూహాలు అనుసరించాలో తెలుసుకుందాం..




# మ్యాప్‌తో మరిన్ని మార్కులు

## బయాలజీ

- ఇందులోని పాఠ్యాంశాలను సులువు, కష్టం అనే రెండు భాగాలుగా విభజించుకోవాలి. సులవైన వాటికి తక్కువ, కష్టమైన వాటికి ఎక్కువ సమయం కేటాయించుకునేలా స్టడీ ప్లాన్‌ను రూపొందించుకోవాలి.
- వివిధ పాఠ్యాంశాలలో ఇచ్చిన ప్రయోగాలపై ఎక్కువ దృష్టి సారించాలి. సబ్జెక్ట్‌లోని ప్రాథమిక భావనలను తరచుగా పునశ్చరణ చేసుకుంటూ ఉండాలి. అన్ని రకాల నిర్వచనాలను గుర్తుపెట్టుకోవాలి.
- బయాలజీ అంటేనే చాలా డయాగ్రామ్స్ ఉంటాయి. వీటికి కూడా మార్కులిస్తారు. కాబట్టి డయాగ్రామ్స్‌ను నీట్‌గా వేయడంతోపాటు అందులోని భాగాలను గుర్తించడం, వాటిపై అవగాహన ఉండటం ఎంతో కీలకం.
- నిరంతరం చదవకుండా ప్రతి గంటకు 5 - 10 నిమిషాలపాటు విరామం తీసుకోవాలి. తగినంత విశ్రాంతి కూడా అవసరం అని గుర్తుంచుకోవాలి.



ఎన్. పూర్ణచంద్రరావు
ఛైర్మన్, ప్రగతి విద్యాసంస్థలు,
తూర్పు గోదావరి జిల్లా.

## సోషల్ స్టడీస్ పేపర్-1

- పాఠ్యాంశాల వారీగా ముఖ్యమైన పాయింట్లను చదువుకోవాలి. తద్వారా అందులోని ప్రాథమిక భావనలను అవగాహన చేసుకోవచ్చు.
- పాఠ్యపుస్తకంలోని ముఖ్యమైన పాయింట్లను పెన్సిల్ లేదా పెన్నుతో అండర్‌లైన్ చేసుకోవాలి.
- ముఖ్యమైన పాయింట్లు, నిర్వచనాలు, పదాలు, సంఘటనలను ఒక నోట్‌బుక్‌లో ప్రత్యేకంగా రాసుకోవాలి. పునశ్చరణ చేసుకోవడానికి ఈ నోట్స్ ఎంతో ఉపయోగపడుతుంది.
- తేదీలు, సంవత్సరాలు, గణాంకాలను చక్కగా గుర్తుంచుకోవడానికి టైమ్‌లైన్ చార్ట్‌లను రూపొందించుకోవడం ఉత్తమం. తద్వారా ఇవి ఎక్కువ కాలం గుర్తుంటాయి.
- పరీక్షలో ఇచ్చిన ప్రశ్నపత్రాన్ని క్షుణ్నంగా చదవాలి. తద్వారా ఎటువంటి ప్రశ్నలు అడిగారు అనే విషయంలో స్పష్టత వస్తుంది. ముందుగా స్వల్ప సమాధాన ప్రశ్నలతో పరీక్షను ప్రారంభించాలి. అటుపై ఎస్సే ప్రశ్నలు రాయాలి.
- ప్రతి సమాధానంలో హెడ్డింగ్స్, ముఖ్యమైన పాయింట్లను హైలైట్ చేయాలి. తద్వారా మెరుగైన స్కోర్ సాధించవచ్చు.
- మ్యాప్ పాయింట్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధనకు ఇది తోడ్పడుతుంది.
- గత ప్రశ్నపత్రాలను విధిగా పరిశీలించాలి. ఎందుకంటే కొన్ని ప్రశ్నలు పునరావృతం అవుతుంటాయి.
- ఎస్సే విభాగం కోసం సమాధానాలను పాయింట్ల రూపంలో చదవడం ప్రయోజనకరం. దీంతో సమయం కలిసి రావడంతో పాటు సమాధానాన్ని ప్రభావవంతంగా ప్రెజెంట్ చేసేందుకు అవకాశం లభిస్తుంది.

## సోషల్ స్టడీస్ పేపర్-2

- ప్రతి పాఠ్యాంశంలోని కీలకమైన పాయింట్లను చదవాలి. పాఠం చివర ఇచ్చే ప్రశ్నలే పరీక్షలో వస్తాయనుకుంటే పొరపాటే. పాఠంలో ఎక్కడి నుంచైనా ప్రశ్నలు అడగవచ్చు.
- చాప్టర్లు 18 - 22 నుంచి ఎక్కువ ప్రశ్నలు రావచ్చు. కాబట్టి వీటిపై అధికంగా దృష్టిసారించాలి. సాధారణ ఎన్నికలు, రాజ్యాంగ సవరణలు వంటి అంశాలను సమకాలీన కోణంలో చదవాలి.
- చరిత్రలో ఉండే రాజులు, స్వాతంత్ర్య సమరయోధులు, ఇతర కీలక అంశాలను పెన్సిల్ / పెన్‌తో అండర్‌లైన్ చేసుకోవాలి.
- సమాధానంలో ముఖ్యమైన పాయింట్లను పెన్సిల్ / కలర్ స్కెచ్‌లతో హైలైట్ చేయడం మార్కులపరంగా లాభిస్తుంది.
- మ్యాప్ పాయింటింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ప్రపంచ యుద్ధాలు, ఐక్యరాజ్యసమితి, ఏషియన్ - ఆఫ్రికన్ కాలనీస్, వలస రాజ్యాలతో సంబంధం కలిగిన దేశాలు, ప్రదేశాలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- పాఠ్యాంశాలలోని కీలకమైన తేదీలు, పేర్లు, గణాంకాలను ప్రత్యేకంగా ఒక నోట్ బుక్‌లో రాసుకోవాలి.
- ఎస్సే ప్రశ్నలతో పోల్చితే స్వల్ప సమాధాన, ఆబ్జెక్టివ్ ప్రశ్నలలో మెరుగైన స్కోర్ సాధించవచ్చు.
- చదవడంతోపాటు రాయటం కూడా ప్రాక్టీస్ చేస్తే పరీక్షలో సమయపాలన అలవడుతుంది.

తాజా ప్రతిపాదన

# అగ్రశ్రేణి సంస్థల్లో ఆన్‌లైన్ డిగ్రీ



చదువుకోవాలంటే కాలేజీకి వెళ్లడం తప్పనిసరేమీ కాదు. అందివస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఊహించనంత మార్పుల దిశగా ప్రపంచం దూసుకెళుతోంది. ఇప్పుడంతా ఆన్‌లైన్ మాధ్యమంగా చదువు సాగుతోంది. తరగతి గది నెట్ ఇంట్లోకి వచ్చేసింది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఆన్‌లైన్ విద్యను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్ - 2020లో దేశంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో అసలు ఆన్‌లైన్ కోర్సులు ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయి, వీటితో లాభనష్టాలు తదితర అంశాలపై విశ్లేషణ..

అగ్రశ్రేణి విద్యాసంస్థల ద్వారా మాత్రమే ఆన్‌లైన్ కోర్సులను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-100లో ఉన్న విద్యాసంస్థలు, యూనివర్సిటీలను ఈ ఆన్‌లైన్ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తారు. అయితే ఈ ఇన్‌స్టిట్యూట్‌లు గత మూడేళ్లలో కనీసం రెండేళ్ళు ఓవరాల్ కేటగిరీలో టాప్-100 ర్యాంకింగ్స్‌లో చోటు సంపాదించుకొని ఉండాలి. అందులో కూడా అన్నిటికి ఒకేసారి కాకుండా కొన్ని సంస్థలకే మొదట ఈ కోర్సులను ప్రారంభించేందుకు అనుమతిస్తారు.

## టాప్‌లోనే

టాప్-100 కేటగిరీలో ఐఐఎస్సీ, ఐఐటీలు, జేఎన్‌యూ, హెచ్‌సీయూ, బెనారస్ హిందూ వర్సిటీ వంటి ప్రముఖ సంస్థలు మాత్రమే కనిపిస్తాయి. ఏ రకంగా చూసినా ఇవే దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థలు. ఫ్యాకల్టీ, ల్యాబ్‌లు, పరిశోధనలు, ఆన్‌లైన్ టీచింగ్ - లెర్నింగ్, సమర్థవంతమైన మౌలిక వసతుల విషయంలో మరే ఇన్‌స్టిట్యూట్‌లు వీటితో పోటీపడలేవు. అంతేకాకుండా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో వీటిలో కొన్ని సంస్థలకు అనుభవం కూడా ఉంది. విద్యారంగంలో వీటికి ఉన్న పేరు ప్రఖ్యాతలు కూడా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి దోహదపడుతుంది. ఈ నేపథ్యంలో టాప్-100 విద్యాసంస్థల ద్వారా మాత్రమే ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభించాలని కేంద్రం భావిస్తోంది.

## పూర్తిస్థాయి కోర్సులు

ఉత్తమ బోధన వనరులను అందరికీ సులభంగా, నాణ్యతతో అందించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ కోర్సులు అనే భావన మొదలైంది. ఇప్పటికే కొన్ని సంస్థలు ఆన్‌లైన్‌లో సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాయి. అయితే ఇవి పూర్తిస్థాయి కోర్సులు కావు. ఇవి మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా అప్పటికప్పుడు నిర్దిష్టంగా ఏదైనా ఒక అంశానికి సంబంధించి అవగాహన కల్పించేందుకు రూపొందించిన స్వల్పకాలిక కోర్సులు మాత్రమే. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో డిగ్రీ కోర్సులను ఆన్‌లైన్‌లో అందించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని విప్లవాత్మక నిర్ణయంగా పేర్కొనవచ్చు. తద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా.. స్వయంగా కాలేజీలకు వెళ్లి చదవాల్సిన అవసరం లేదు. ఎప్పుడు, ఎక్కడ నుంచైనా స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్ సహాయంతో తమకు నచ్చిన కోర్సులను ఆన్‌లైన్‌లో అభ్యసించవచ్చు. స్కిల్స్, అర్హతను పెంచుకోవడం కోసం ఉద్యోగులు, విద్యార్థులు తమ రోజువారీ షెడ్యూల్‌కు భంగం కలగకుండా అందుబాటులో ఉండే సమయంలోనే ఈ కోర్సులను చదివే వెసులుబాటు దక్కుతుంది. మరొక కీలక పరిణామం.. ఈ నిర్ణయం ద్వారా విద్యారంగంలో ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు)లకు అవకాశం లభిస్తుంది. తద్వారా మరిన్ని పెట్టుబడులు వస్తాయి. వీటితో ఉన్నత విద్యలో నాణ్యత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు కేంద్రం బడ్జెట్ ప్రసంగం ద్వారా పేర్కొంది.

## టెక్నికల్ కోర్సులు

ప్రయోజనాలు ఉన్నప్పటికీ అదే సమయంలో కొన్ని సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రాక్టికల్ ఓరియెంటేషన్‌కు ప్రాధాన్యం ఉండే టెక్నికల్ కోర్సుల విషయంలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కంటే క్లాస్ రూమ్ ఇంటరాక్షన్‌తోనే ఎక్కువ ప్రయోజనం. ఆన్‌లైన్‌తో ప్రాక్టికల్ నైపుణ్యాలు పొందే అవకాశం పెద్దగా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టాప్ - 100లో ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీల సంఖ్య ఎక్కువ. ఈ ఇన్‌స్టిట్యూట్‌లు అన్ని రకాల కోర్సులు అందిస్తాయా, కేవలం కొన్నిటికి పరిమితం అవుతాయా అనే విషయంలో సందిగ్ధత నెలకొని ఉంది. అంతేకాకుండా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ అంటేనే డిజిటల్ టెక్నాలజీ తప్పనిసరి. ఈ క్రమంలో కంప్యూటర్, ఇంటర్నెట్, ఐసీటీ టూల్స్ వంటివి తప్పనిసరి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, ఆర్థిక పరిస్థితులు అనుకూలించని వారికి వీటిని సమకూర్చుకోవడం కష్టమే. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు అంతగా ఉండవు. కాబట్టి గ్రామీణ విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యను అందించడం సవాలుతో కూడుకున్న వ్యవహారమే.

## కారణాలివే

సంప్రదాయ కోర్సులతో సమానంగా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెనుక పలు కారణాలు ఉన్నాయి. దేశంలో వందల సంఖ్యలో యూనివర్సిటీలు, వేల సంఖ్యలో కాలేజీలు ఉన్నాయి. అయినప్పటికీ బ్యాచిలర్ స్థాయి కోర్సుల్లో చేరుతున్న వారి సంఖ్య ఆశించిన స్థాయిలో ఉండటం లేదు.

- ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకారం 2018-19 విద్యాసంవత్సరంలో బ్యాచిలర్ స్థాయి కోర్సుల్లో నమోదు 26.3 శాతం మాత్రమే. అదే సమయంలో ఉన్నత విద్యలో చేరుతున్న మారుమూల ప్రాంతాల విద్యార్థుల సంఖ్య మరీ తక్కువగా ఉంటోంది.
- మరోవైపు 2022 నాటికి జాతీయ స్థాయిలో ఉన్నత విద్యలో నమోదును 30 శాతానికి చేర్చాలని కేంద్రం లక్ష్యం. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి నుంచే, వీలున్నప్పుడే చదువుకునే అవకాశం కల్పించే ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులకు శ్రీకారం చుట్టడమే ఉత్తమమని ప్రభుత్వ ఆలోచన.

## రెండేళ్ల క్రితమే

*యూజీసీ 2018 మే 24న ఆన్‌లైన్ కోర్సుల విషయంలో కొన్ని నిబంధనలను రూపొందించింది. వాటి ప్రకారం దేశంలోని యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ, డిప్లొమా కోర్సులను అందించవచ్చు. 2019-20 విద్యా సంవత్సరానికి యూజీసీ ఆన్‌లైన్ కోర్సులను అందించడానికి కొన్ని విద్యా సంస్థలకు అనుమతినిచ్చింది. అవి.. జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ - మైసూరు (వెబ్‌సైట్: www.jssuni.edu.in), మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ - మణిపాల్ (వెబ్‌సైట్: https: //manipal.edu/), భారతీ విద్యాపీఠ్ యూనివర్సిటీ - పుణె (వెబ్‌సైట్: http://bvunversity.edu.in/), డీవైపాటిల్ విద్యాపీఠ్ యూనివర్సిటీ - పుణె (వెబ్‌సైట్: https://dpu.edu.in/), శాస్త్ర యూనివర్సిటీ - తంజావూరు (వెబ్‌సైట్: https:// www.sastra.edu/), అమిటీ యూనివర్సిటీ - నోయిడా (వెబ్‌సైట్: www.amity.edu/). అయితే ఇగ్నోకి ఆన్‌లైన్ కోర్సెస్ / ప్రోగ్రామ్స్ రెగ్యులేషన్స్ 2018 నుంచి యూజీసీ మినహాయింపు ఇచ్చింది.*

---

చేసేయండి!

## రంగురంగుల డిస్కులు



**కావలసినవి**
● డ్రాయింగ్ పేపర్ ● వివిధ రంగుల స్కెచ్ పెన్నులు ● కత్తెర ● గ్లూ



1. డ్రాయింగ్ పేపర్‌ను గుండ్రంగా ముక్కలుగా కట్ చేసుకోండి.



2. బొమ్మలో చూపించిన విధంగా స్కెచ్ పెన్నులతో రంగులు వేయండి.



3. అలా మీకు కావలసినన్ని డిస్కులు తయారుచేసుకోండి.



4. తరువాత ఒక్కో డిస్క్ తీసుకుంటూ నాలుగువైపులా కత్తెరతో చిన్నగా కత్తిరించండి.



5. ఇప్పుడు ఒక డిస్కును మరొక డిస్కు చీలికలోకి చొప్పించండి.

## ఏవి ఎన్ని?




## రంగులు వేయండి



## కనిపెట్టండి చూద్దాం!

ఈ బొమ్మలో కొన్ని తప్పులున్నాయి. వాటిని కనిపెట్టండి?




జవాబులు (తలకిందులుగా ముద్రించబడింది)

1. క్యాట్‌లో టీ అక్షరం తిరగబడి ఉంది.
2. బాలిక వేసుకున్న సాక్స్
3. స్కేట్స్ రెండు లేవు
4. మూడు అంకె రివర్స్‌గా ఉంది
5. బాలిక వేసుకున్న డ్రెస్ ఒక చేయి పొడవు
6. చెప్పులు ఒకేలా లేవు
7. యాపిల్‌లో ఇ తిరగబడి ఉంది.
8. 2+2=5 తప్పు.

## పదాలు సరిచేయండి

p l a p e (2 4 1 3 5) → _ _ _ _ _ (1 2 3 4 5)

a p e r (3 1 2 4) → _ _ _ _ (1 2 3 4)

r o n a g e (2 1 4 3 5 6) → _ _ _ _ _ _ (1 2 3 4 5 6)

n o m e l (5 4 3 2 1) → _ _ _ _ _ (1 2 3 4 5)

## డైలీ సుడోకు - 285

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 | 7 | | 6 | | 2 | |
| | | 3 | | | | | 7 | 8 |
| | | | | | 9 | 4 | 3 | |
| | | | 4 | 1 | | 7 | | 2 |
| | | | | | | | | |
| 2 | | 7 | | 6 | 3 | | | |
| | 5 | 4 | 3 | | | | | |
| 3 | 8 | | | | | 9 | | |
| | 7 | | 2 | | 4 | 1 | | |

**సుడోకు- 284 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 1 | 5 | 2 | 8 | 9 | 4 | 7 | 3 |
| 7 | 4 | 8 | 5 | 3 | 6 | 9 | 1 | 2 |
| 9 | 2 | 3 | 4 | 1 | 7 | 8 | 6 | 5 |
| 2 | 6 | 9 | 3 | 7 | 4 | 5 | 8 | 1 |
| 5 | 8 | 1 | 6 | 9 | 2 | 3 | 4 | 7 |
| 3 | 7 | 4 | 8 | 5 | 1 | 2 | 9 | 6 |
| 4 | 3 | 7 | 1 | 2 | 8 | 6 | 5 | 9 |
| 8 | 9 | 2 | 7 | 6 | 5 | 1 | 3 | 4 |
| 1 | 5 | 6 | 9 | 4 | 3 | 7 | 2 | 8 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ వరుసలోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.






# మూడు చిత్రాలు ఒకేసారి చేయను!
- నితిన్



**"ప్రేమలో పడక ముందు, పడిన తర్వాత... నేను ఒకేలా ఉన్నాను. నాలో మార్పులేం లేవు!" అని నితిన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'భీష్మ'. వెంకీ కుడుముల దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. శుక్రవారం సినిమా విడుదల! నితిన్ చెప్పిన ముచ్చట్లు...**

● 'భీష్మ'లో మీమ్స్ చేసే యువకుడిగా కనిపిస్తా. పాత్ర సరదాగా ఉంటుంది. సినిమా కూడా వినోదాత్మకమే. ఇటీవల విడుదలైన ఆర్గానిక్ ఫార్మింగ్ గురించి చెప్పాం. ఆ విషయం ముందే చెప్తే సీరియస్ సినిమా అనుకుంటారని ట్రైలర్ వరకూ దాచాం. 'అతడు'లో ఫైట్ స్ఫూర్తితో సెకండాఫ్‌లో పొలంలో ఫైట్ డిజైన్ చేశాం. చాలా బాగా వచ్చింది. త్రివిక్రమ్‌గారికి నచ్చింది. ప్రేక్షకులకూ నచ్చుతుంది.

● ట్రైలర్‌లో పవన్‌కల్యాణ్‌గారి 'ఖుషి'లో టెంపుల్ సీన్‌ను గుర్తుచేసే సీన్ ఒకటి ఉంది. చాలామంది దానిపై ట్రోల్స్ చేశారు. పబ్లిసిటీకి పవన్‌గారిని వాడుకుంటున్నానని! వాళ్లకు తెలియనిది ఏంటంటే... నా కెరీర్ స్టార్టింగ్ నుండి, ఆఖరికి ఫ్లాప్ చిత్రాల్లోనూ ఎక్కడో ఒక చోట పవర్‌స్టార్ ప్రస్తావన లేదా ఆయన పోస్టర్ ఉంటుంది. ఆయనపై నాకున్న స్వచ్ఛమైన ప్రేమ అది. ప్యూర్ లవ్!

● రెండు మూడు ఫ్లాప్స్ రావడంతో కథపై రాజీ పడకూడదనీ, నాకు నచ్చేవరకూ చిత్రీకరణ ప్రారంభించకూడదనీ నిర్ణయించుకున్నా. అందుకని, ఆలస్యమైంది. 'అ... ఆ'లో కొన్ని సన్నివేశాలపై గురూజీ త్రివిక్రమ్‌తోనూ వాదించా. అలా చేస్తే... ప్రతిదీ హిట్ అవుతుందనే గ్యారెంటీ లేదు. కానీ, ఎట్ లీస్ట్... నాకు నచ్చిన సినిమా చేశాననే సంతృప్తి ఉంటుంది కదా!

● ఏడాది గ్యాప్ రావడంతో మూడు కథలు విన్నా. కొంత వ్యవధిలో మూడు సినిమా షూటింగులు స్టార్ట్ అయ్యాయి. చంద్రశేఖర్ ఏలేటిగారు కళ్లు బ్లింక్ చేయమనేవారు. 'భీష్మ' సెట్‌లో వెంకీ కుడుముల అలా వద్దనేవాడు. 'రంగ్ దే' సెట్‌లో వెంకీ అట్లూరిది మరో స్టైల్. క్యారెక్టర్స్ మధ్య షిఫ్ట్ కావడానికి టైమ్ పట్టింది. కన్ఫ్యూజ్ అయ్యేవాణ్ణి. కానీ, దర్శకులకు క్లారిటీ ఉండడంతో వాళ్లను ఫాలో అయ్యా. మళ్లీ మూడు సినిమాలు ఒకేసారి చేయను.

● దుబాయ్‌లో పెళ్లి చేసుకోవాలనే ఆలోచన నాది కాదు. మా ఇద్దరి ఫ్యామిలీలది. రీసెంట్‌గా ఇంట్లో 'పసుపు కుంకుమ' ఫంక్షన్ జరిగింది. అప్పుడు ఎంతసేపు అనిపించింది. ఒక విధంగా 'శ్రీనివాస కల్యాణం' నా పెళ్లికి రిహార్సల్స్ వంటిది. నా పెళ్లి వార్త బయటకు రాగానే నాని 'వెల్కమ్ టు క్లబ్. వికెట్ డౌన్' అని విష్ చేశాడు. వరుణ్‌తేజ్ ఫోన్ చేసి 'నువ్వు చేసుకుంటున్నావ్! మా ఇంట్లో ప్రెజర్ చేస్తున్నారు' అన్నాడు. ఇంకా చాలామంది చాలా రకాలుగా విష్ చేశారు.

# మేలో మొదలు... ఏప్రిల్‌లో విడుదల!


జూ.ఎన్టీఆర్, త్రివిక్రమ్

జూనియర్ ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా ఒక చిత్రాన్ని రూపొందించనున్నాయి. సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మాతలు. ఈ ఏడాది మేలో చిత్రీకరణ ప్రారంభించి, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. ఎన్టీఆర్, త్రివిక్రమ్, హారిక అండ్ హాసిని కలయికలో 'అరవింద సమేత వీరరాఘవ' విజయం తర్వాత రూపొందుతున్న చిత్రమిది. ఈ చిత్ర నిర్మాణంలో ఎన్టీఆర్ ఆర్ట్స్ భాగస్వామి అయింది. మిగతా నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు తర్వాత వెల్లడించనున్నారు. హీరోగా ఎన్టీఆర్ 30వ చిత్రమిది.

# పోస్టర్ ఎక్కే స్థాయికి..


టి.మహిపాల్ రెడ్డి, సురేశ్‌బాబు

పోస్టర్ అంటించడానికి కూడా పనికి రాని ఒక వ్యక్తి.. పోస్టర్ మీదకు ఎక్కే స్థాయికి ఎలా ఎదిగాడు అన్న ఇతివృత్తంతో తెరకెక్కిన చిత్రం 'పోస్టర్'. సంధ్య థియేటర్‌లో ప్రొజెక్టర్ ఆపరేటర్‌గా పదేళ్లు పనిచేసిన టి.మహిపాల్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రమిది. విజయ్ ధరన్, రాశీ సింగ్, అక్షత సోనావానే నటీనటులు. టి.శేఖర్ రెడ్డి, ఏ.గంగారెడ్డి, ఐ.జి రెడ్డి. నిర్మాతలు. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను డి.సురేశ్‌బాబు విడుదల చేశారు. "టీజర్ చూస్తుంటే థియేటర్ నేపథ్యంలో తీసిన సినిమాలా అనిపిస్తుంది. ప్రేక్షకులను థియేటర్‌కి తీసుకొచ్చే అంశాలు కనిపిస్తున్నాయి" అని సురేశ్‌బాబు అన్నారు. "ప్రతి ఇంట్లో జరిగే కథనే సినిమాగా తీశా. ప్రతి చోట సమస్యలుంటాయి. వాటిని అధిగమించి ముందుకెళ్తేనే జీవితంలో ఏదైనా సాధించగలం' అన్నది ఇందులో కీలక అంశం. చిన్న విషయానికి కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకోవద్దు అనే సందేశం కూడా ఉంది. త్వరలో సెన్సార్ పూర్తి చేసి సినిమాను విడుదల చేస్తాం" అని దర్శకుడు తెలిపారు. శివాజీరాజా, మధుమణి, రామరాజు, కాశీ విశ్వనాథ్, స్వప్నిక తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: నివాస్, సంగీతం: శాండీ అద్దంకి.

# నానీ... నిర్మాతగా ప్రయోగాలు, హీరోగా కమర్షియల్స్ చెయ్!!
- 'దిల్' రాజు


రుహానీ శర్మ, విష్వక్‌సేన్

"నటనలో నాని బిజీగా ఉంటూ... నిర్మాతగా డిఫరెంట్ 'అ!' చేశాడు. మళ్లీ డిఫరెంట్ స్క్రిప్ట్ 'హిట్' యాక్సెప్ట్ చేసి, తీయడానికి గట్స్ కావాలి. నాని... ఇలానే ప్రయోగాత్మక చిత్రాలను నిర్మించు. నువ్వు చేసే చిత్రాలు మాత్రం కమర్షియల్‌గా ఉండాలి. ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. నైజాం, విశాఖలో మేమే విడుదల చేస్తున్నాం" అని 'దిల్' రాజు అన్నారు. విష్వక్‌సేన్, రుహానీ శర్మ జంటగా నటించిన చిత్రం 'హిట్'. 'ది ఫస్ట్ కేస్' అనేది ఉపశీర్షిక. శైలేష్ కొలను దర్శకుడు. నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. బుధవారం 'దిల్' రాజు ట్రైలర్ విడుదల చేశారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "శైలేష్ కథ చెప్పేటప్పుడు నెక్ట్స్ ఏం జరుగుతుందనే ఉత్కంఠతో విన్నాను. కథ పూర్తయ్యాక ఓకే చెప్పేశా. "ఇదొక థ్రిల్లర్. ట్రైలర్‌లో చూసిన దానికంటే సినిమాలో ఎక్కువ ఉంటుంది" అని శైలేష్ అన్నారు.

# మళ్లీ మళ్లీ చూశా... సినిమా అద్భుతమే!
- క్రిష్


సాయి రోనక్, ప్రీతి అన్సారి

"మూణ్ణెళ్ల క్రితం ఈ సినిమా చూశా. నచ్చింది. కానీ, అక్కడక్కడా చిన్న అసంతృప్తి. సుజోయ్, సుశీల్‌కు అదే చెప్పా. చిన్న చిన్న కరెక్షన్స్ చేసి మళ్లీ వారం తర్వాత చూపించారు. ఇంకా బావుంది. నెల ముందు మళ్లీ చూపించారు. మూణ్నాలుగుసార్లు చూసిన వ్యక్తిగా చెబుతున్నా... దర్శకులిద్దరూ అద్భుతమైన సినిమా తీశారు. 12 ఏళ్ల క్రితం తలో చెయ్యి వేస్తేనే నేను రాగలిగా. అప్పటి నా పరిస్థితిని వీళ్లలో చూసుకున్నా" అని క్రిష్ అన్నారు. సాయి రోనక్, ప్రీతి అన్సారి జంటగా, రాహుల్ రామకృష్ణ ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'ప్రెషర్ కుక్కర్'. సుజోయ్, సుశీల్ స్వీయ దర్శకత్వంలో అప్పిరెడ్డితో కలిసి నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీ-రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. "నువ్వు అమెరికాకు వెళ్లకపోతే ఎందుకు పనికి రావని పిల్లలను ప్రెజర్ పెడుతున్న తల్లితండ్రులకు ఈ సినిమా ఒక కనువిప్పు" అని తనికెళ్ల భరణి అన్నారు. "చదువు-ర్యాంకుల పేరుతో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి, చదువు పూర్తయిన తర్వాత అమెరికా వెళ్లాక, ఇండియాలో వృద్ధాప్యంలో ఉన్న వాళ్ల తల్లిదండ్రులు పిల్లల్ని వెనక్కి రమ్మన అడగలేక పడే మానసిక సంఘర్షణ నేపథ్యంలో చిత్రాన్ని తెరకెక్కించాం" అని సుజోయ్, సుశీల్ అన్నారు.

# నేను మెచ్చిన చిత్రమిది!
- పరుచూరి గోపాలకృష్ణ


విక్రమ్ శివ, ప్రగతి యాదాటి

"నేను సినిమా చూశా. నచ్చింది! నేను మెచ్చిన చిత్రమిది. ఐదు అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలకూ వెళ్లింది. మూడు పాత్రలతో కెవెల్ ప్రసాద్ అద్భుతంగా తీశారు. ప్రతిఒక్కరూ చూడాల్సిన చిత్రమిది" అని పరుచూరి గోపాలకృష్ణ అన్నారు. విక్రమ్ శివ, ప్రగతి యాదాటి జంటగా నటించిన చిత్రం 'స్క్రీన్ ప్లే'. 'ఆఫ్ ఎన్ ఇండియన్ లవ్ స్టోరీ'... ఉపశీర్షిక. డాక్టర్ అరుణకుమారి నిర్మాత. కెవెల్ ప్రసాద్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం ప్రసాద్స్ గ్రూప్ అధినేత రమేశ్ ప్రసాద్ విడుదల చేశారు. కెవెల్ ప్రసాద్ మాట్లాడుతూ "నేపాల్ సినీ విశ్లేషకుడొకరు తెలుగు రాకున్నా... సబ్‌టైటిల్స్‌తో చూసి అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలకు 'స్క్రీన్‌ప్లే'ను సిఫారసు చేశాడు. ప్రవేశ రుసుము తీసుకోకుండా చలనచిత్రోత్సవాల నిర్వాహకులు 'స్క్రీన్‌ప్లే'ను ఎంపిక చేస్తున్నారు. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. నారాయణమూర్తి, విజయేంద్ర ప్రసాద్, పరకాల ప్రభాకర్, జెకె భారవి, సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ తదితరులతో పాటు చిత్రబృందం పాల్గొంది.

# డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్నారు!


అభిరామ్ వర్మ, కృతి గార్గ్

"ప్రచార చిత్రాలు చూశా. ప్రామిసింగ్‌గా ఉన్నాయి. 'రాహు' టైటిల్ ఆలోచింపజేసే విధంగా ఉంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్నారు. సినిమా హిట్ అవ్వాలి" అని జీవితా రాజశేఖర్ అన్నారు. అభిరామ్ వర్మ, కృతి గార్గ్ జంటగా, 'కాలకేయ' ప్రభాకర్, 'సత్యం' రాజేశ్, 'చలాకీ' చంటి, గిరిధర్, స్వప్నిక ప్రధాన తారలుగా నటించిన చిత్రం 'రాహు'. సుబ్బు వేదుల దర్శకత్వం వహించడంతో పాటు ఏవీఆర్ స్వామి, శ్రీశక్తి బాబ్జి, రాజా దేవరకొండతో కలిసి నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. మంగళవారం హైదరాబాద్‌లో మ్యూజిక్ సక్సెస్‌మీట్ నిర్వహించారు. "ప్రవీణ్ లక్కరాజు మంచి పాటలు ఇచ్చారు. ఇప్పటివరకూ విడుదలైనవన్నీ శ్రోతలను ఆకట్టుకున్నాయి. త్వరలో మిగతా రెండు పాటలను విడుదల చేస్తాం" అని సుబ్బు వేదుల అన్నారు. "న్యూ ఏజ్ థ్రిల్లర్ చిత్రమిది. కొత్తవారితో తీశాం. సినిమా సక్సెస్‌మీట్‌లో ప్రేక్షకులను కలుస్తాం" అని ఏవీఆర్ స్వామి అన్నారు.










epaper.andhrajyothy.com

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 428.62 | 133.40 | 501 | 1,155 | | |
| 41,323.00 | 12,125.90 | 41,636 | 47,700 | 71.54 | 58.67 |

ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత)

# పారదర్శకంగా ఉండండి

- 15 రోజుల్లో లోపాలను సరిచేయండి
- ఏడాదికి 200 తనిఖీలు చేస్తున్నాం
- ఈ సంవత్సరం అంతే ఉంటాయ్
- ఔషధ తయారీ యూనిట్లపై యూఎస్ఎఫ్‌డీఏ డిప్యూటీ కంట్రీ డైరెక్టర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ ఔషధ కంపెనీల తయారీ యూనిట్లలో తరచూ అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) తనిఖీలు జరుగుతున్నాయి. హెచ్చరిక లేఖలు, 483 ఫామ్‌ను ఎఫ్‌డీఏ జారీ చేస్తోంది. దీనిపై ఆందోళన అవసరం లేదని, కంపెనీలు పారదర్శకంగా ఉంటే భయపడాల్సిన అవసరం లేదని భారత్‌లో యూఎస్ఎఫ్‌డీఏ డిప్యూటీ కంట్రీ డైరెక్టర్ సరాహ్ మెక్ ముల్లన్ అన్నారు. ఎఫ్‌డీఏ కోరిన సమాచారం అందించాలని సూచించారు. 'తయారీ యూనిట్లలో లోపాలను నిర్దేశిత సమయమైన 15 రోజుల్లో సవరించాలి. సమస్యను సరిగ్గా అర్థం చేసుకుంటే.. అనుమతు లు సులభంగా వస్తాయి. వాస్తవానికి గత కొద్ది సంవత్సరాలుగా భారత ఔషధ తయారీ యూనిట్లలో నాణ్యతా వ్యవస్థలు బాగా మెరుగయ్యాయి. ప్రతి ఏడాది భారత్‌లో 200 తనిఖీలు జరుగుతున్నాయి. ఈ ఏడాది (అక్టోబరు-సెప్టెంబరు) కూడా ఇదే స్థాయిలో తనిఖీలు ఉంటాయి. తనిఖీలు జరిగినప్పుడు పూర్తి సమాచారం ఇస్తే ఆ తర్వాత జరిగే తనిఖీలు సులభమవుతాయి. సమాచారాన్ని దాచడం వల్ల ఇబ్బందులు ఎదురవతాయ'ని ముల్లన్ అన్నారు. బయో ఏషియాలో 'మీట్ ద క్వాలిటీ ఇంపరేటివ్' అనే అంశంపై ఆమె మాట్లాడారు. కాగా ఔషధ తయారీ యూనిట్లలో ఆటోమేషన్ నైపుణ్యాలు కలిగిన నిపుణులు దొరకడం..అప్‌గ్రేడేషన్ సవాలుగా మారిందని ముల్లన్ వ్యాఖ్యానించారు. నిపుణులను కాపాడుకోవడానికి కంపెనీలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఔషధ కంపెనీలు నాణ్యత, పారదర్శకత, నైపుణ్యాలున్న నిపుణులను సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సింజెన్ సీఓఓ మహేశ్ బాల్ఘట్, యునైటెడ్ స్టేట్ ఫార్మకోపియా గ్లోబల్ సైట్స్ ఎస్‌వీపీ సురేంద్రనాథ్ కోడూరు, డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ క్వాలిటీ గ్లోబల్ అధిపతి గణదీశ్ కామత్ పాల్గొన్నారు.

# మెడ్‌టెక్ ఔత్సాహికులకు 'ప్రాజెక్ట్ తేజ్'



ఒప్పంద పత్రాలతో బీవీఆర్ మోహన్ రెడ్డి, రంగ్నేకర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెడికల్ టెక్నాలజీ రంగంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ వినూత్న ఆలోచనలు, ఉత్పత్తులను పరీక్షించుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం 'ప్రాజెక్ట్ తేజ్' పేరుతో ఒక వేదికను కల్పిస్తోంది. మెడికల్ టెక్ వినూత్నాల అభివృద్ధి వేగంగా పెరగడానికి ఇది దోహదం చేస్తుంది. ఇందుకోసం మెడ్‌టెక్ కనెక్ట్‌తో ప్రభుత్వం చేతులు కలిపింది. సైయెంట్, జింటియోకు చెందిన ఇండియా 2022 కొలిషన్‌లు మెడిటెక్ కనెక్ట్‌ను ఏర్పాటు చేశాయి. బయోఏషియా 2020లో భాగంగా ప్రాజెక్ట్ తేజ్‌పై రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్), మెడిటెక్ కనెక్ట్‌లు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రాజెక్ట్ తేజ్ దేశీయంగా, తక్కువ ధరకు మెడికల్ టెక్నాలజీ వినూత్న ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి దోహదపడగలదని సైయెంట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి తెలిపారు. మెడికల్ టెక్నాలజీలోని కంపెనీలు, ఆసుపత్రులు, స్టార్టప్‌లు తదితరాలు కలిసి పనిచేయొచ్చని చెప్పారు. కొత్త టెక్నాలజీలను పరీక్షించి, వాణిజ్యపరంగా మార్కెట్లోకి ప్రవేశపెట్టడానికి ప్రాజెక్ట్ తేజ్ దోహదపడుతుందన్నారు. తెలంగాణలోని మెడ్‌టెక్ పార్క్‌కు ఇది మద్దతుగా నిలుస్తుందని, మెడ్‌టెక్ రంగంలో పెట్టుబడులకు తెలంగాణను గమ్యస్థానంగా మార్చడంలో ఉపకరిస్తుందని రిచ్ డైరెక్టర్ జనరల్ అజిత్ రంగ్నేకర్ చెప్పారు. మెడ్‌టెక్ కనెక్ట్ ప్రాజెక్ట్ తేజ్‌ను నిర్వహిస్తుంది. దేశవ్యాప్తంగా 25 సంస్థలు దీనికి అండగా నిలుస్తాయి.



# పసిడి పరుగు

- రూ.42,000 దాటిన ధర
- కిలో వెండి రూ.48 వేల పైమాటే..

న్యూఢిల్లీ: పసిడి మరింత ప్రియమైంది. బుధవారం ఢిల్లీ స్పాట్ మార్కెట్లో పది గ్రాముల బంగారం(24 క్యారెట్లు) ధర రూ.462 పెరిగి రూ.42,339కి చేరుకుంది. వెండిదీ పుత్తడి బాటే. కిలో వెండి ఒక్కరోజులో రూ.1,047 మేర ఎగబాకి రూ.48,652కి పెరిగింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి పై 'కరోనా' మబ్బులు కమ్ముకున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో విలువైన లోహాలకు డిమాండ్ పెరిగింది. తదనుగుణంగా దేశీయ మార్కెట్లోనూ బంగారం, వెండి రేట్లు పుంజుకున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆభరణాల కొనుగోళ్లు పెరగడం మరో కారణం. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు (31.5 గ్రాములు) బంగారం ఒక దశలో 1,606.60 డాలర్లు, వెండి 18.32 డాలర్లకు చేరుకున్నాయి.

## ఫిగో, ఫ్రీ స్టైల్, ఆస్పైర్ మోడళ్లలో బీఎస్-6 వెర్షన్లు

న్యూఢిల్లీ: కార్ల కంపెనీ ఫోర్డ్ తన ఫిగో, ఫ్రీస్టైల్, ఆస్పైర్ మోడళ్లలో బీఎస్-6 వెర్షన్లను బుధవారంనాడు విడుదల చేసింది. ఈ మూడు మోడళ్లు కూడా 1.2 లీటర్, 1.5 లీటర్ పెట్రోల్, డీజిల్ ఇంజన్లతో అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. బీఎస్-6 ఫిగో ధరల శ్రేణి రూ.5.39 లక్షల నుంచి రూ.7.85 లక్షల వరకు, ఆస్పైర్ ధర రూ.5.99 లక్షల నుంచి రూ.8.34 లక్షల వరకు, ఫ్రీస్టైల్ ధర రూ.5.89 లక్షల నుంచి రూ.8.19 లక్షల (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ) వరకు ఉన్నట్లు తెలిపింది. బీఎస్-6 కార్లలో తన మొబిలిటీ, కనెక్టివిటీ సొల్యూషన్ 'ఫోర్డ్‌పాస్‌టీఎం'ను స్టాండర్డ్ ఫీచర్‌గా అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

# టీవీలు, స్మార్ట్‌ఫోన్లు ప్రియం!

- రిఫ్రిజిరేటర్లు, ఏసీలు కూడా...
- 5-10 శాతం వరకు పెరగనున్న ధరలు
- వినియోగదారుడి జేబుకు కరోనా చిల్లు



చైనాను వణికిస్తున్న కోవిడ్-19 (కరోనా) వైరస్ ప్రభావంతో భారత్‌లో టీవీలు, స్మార్ట్‌ఫోన్లు సహా ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు సమీప భవిష్యత్‌లో పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. చైనాలో తయారయ్యే వీటి విడిభాగాల ధరలు పెరగటం, సరఫరాలు దెబ్బతినటమే ఇందుకు ప్రధాన కారణం. కొన్ని కంపెనీలు ఈ నెలాఖరులో, మరికొన్ని సంస్థలు మార్చి మొదటి వారంలో ఈ ఉత్పత్తుల ధరలు పెంచేందుకు రెడీ అవుతున్నాయి. ధరల పెరుగదల ఎంత లేదన్నా 3 నుంచి 5 శాతం వరకు ఉంటుందని అంచనా. టీవీల ధరలు మాత్రం 7 నుంచి 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమల వర్గాలు భావిస్తున్నాయి.

### సరఫరాలు బంద్

కోవిడ్-19 వైరస్ దెబ్బతో చైనాలో చాలా ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. కరోనా ప్రభావం తగ్గుముఖం పడుతుందన్న వార్తలు వస్తున్నప్పటికీ పనిచేసేందుకు కార్మికులు అంతగా ముందుకు రావటం లేదు. దీంతో చైనా నుంచి పెద్దఎత్తున ఎలక్ట్రానిక్ వినియోగ వస్తువులు, ఉపకరణాలు దిగుమతి చేసుకునే భారత దిగుమతిదారులు లబోదిబోమంటున్నారు. ఈ దెబ్బతో టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ఫ్రిజ్‌లు తయారు చేసే కంపెనీల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. వీటి తయారీకి అవసరమైన విడిభాగాల కోసం ఈ కంపెనీలు ఎక్కువగా చైనాపైనే ఆధారపడతాయి. కరోనా వైరస్ ప్రభావంతో మూతపడిన ఫ్యాక్టరీలు ఎప్పుడు తెరుచుకుంటాయో కూడా తెలియడం లేదు. మరోవైపు ఆటోమొబైల్ విడిభాగాలు, ఫార్మా కంపెనీలదీ ఇదే పరిస్థితి.

### ధరలు పెంచిన షామీ..

చైనాకు చెందిన షియోమీ కంపెనీ గత వారం ఒక స్మార్ట్‌ఫోన్ మోడల్ ధర రూ.500 పెంచింది. విడిభాగాల సరఫరాకు అంతరాయం ఏర్పడమే కాకుండా, ధరలు పెరిగినందున తామూ పెంచక తప్పడం లేదని తెలిపింది. కాగా మిగతా చైనా కంపెనీలు మాత్రం ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిలో ఉన్నాయి.

**భారత మార్కెట్‌పై చైనా పట్టు..**

- 85 శాతం స్మార్ట్‌ఫోన్ల విడిభాగాలు చైనా నుంచే దిగుమతి
- టీవీల తయారీ విడిభాగాల్లో 75 % అక్కడి నుంచే
- ఏసీలు, ఫ్రిజ్‌ల విడిభాగాలు కూడా

రోజురోజుకు పరిస్థితి దిగజారుతుండటంతో కొన్ని కంపెనీలు అమ్మకాల ప్రమోషన్ కోసం చేసే ఖర్చులు, రిటైలర్లకు ఇచ్చే డిస్కౌంట్లు తగ్గించుకుంటున్నాయి.

### డిస్కౌంట్లలో కోత

మరో నెల రోజుల వరకు పరిస్థితి మెరుగుపడే అవకాశం లేదని ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ ఇప్పటికే తన రిటైలర్లకు స్పష్టం చేసింది. ఇదే సమయంలో రిటైలర్లకు ఇచ్చే డిస్కౌంట్లు, ఇతర ప్రోత్సాహకాలు తగ్గించి, ధరలు పెంచకుండా ప్రస్తుత పరిస్థితి నుంచి బయటపడాలని యాపిల్ ఇండియా భావిస్తున్నట్లు సమాచారం.



చైనా నుంచి అన్ని విడిభాగాల దిగుమతి ఆలస్యమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ధరలు 3 నుంచి 5 శాతమైనా పెంచక తప్పదు.
- కమల్ నంది, బిజినెస్ హెడ్, గోద్రెజ్ అప్లయెన్సెస్



కరోనా వైరస్ ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండదు. ప్రపంచ జీడీపీ, వాణిజ్యంపై మాత్రం బాగానే ఉంటుంది. ఎందుకంటే ప్రస్తుతం భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ.
- శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్

# నెల్లూరులో మెడికవర్ హాస్పిటల్

- విస్తరణకు మరో రూ.300 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెడికవర్ గ్లోబల్ నెల్లూరులో 250 పడకల ఆసుపత్రిని ప్రారంభించింది. దీంతోపాటు మెడికవర్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఎంఓఐ)ను ఏర్పాటు చేయనున్నట్లు మెడికవర్ గ్లోబల్ సీఈఓ ఫ్రెడ్రిక్ రాగ్‌మార్క్ తెలిపారు. మెడికవర్ గ్లోబల్ వ్యాపారంలో భారత్ కేంద్ర బిందువుగా మారిందని, ఈ మార్కెట్లో పెట్టుబడులు కొనసాగిస్తామని ఫ్రెడ్రిక్ తెలిపారు. ఇప్పటివరకు రుణం, ఈక్విటీ రూపంలో రూ.700 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. నెల్లూరులోని ఎంఓఐ సహా రానున్న ప్రాజెక్టుల్లో మరో రూ.300 కోట్లు పెట్టనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ హైదరాబాద్, కర్నూలు, విశాఖపట్నంలో మెడికవర్ ఆసుపత్రులున్నాయని మెడికవర్ ఇండియా చైర్మన్ అనిల్ కృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో 500 పడకల ఆసుపత్రి కొనుగోలుకు చర్చలు జరుగుతున్నాయి. ఏపీలో మరో 500 పడకల సామర్థ్యాన్ని సమకూర్చుకోనున్నాం. ఇందుకోసం విశాఖపట్నంలో 200, శ్రీకాకుళంలో 300 పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## చిన్న సంస్థలకు 'ఫండింగ్ డాక్టర్' సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు నిధుల సమీకరణ, రావాల్సిన బకాయిల రికవరీ వంటి సేవలను అందించడం కోసం బిజినెస్ డాక్టర్ 'ఫండింగ్ డాక్టర్' పేరుతో సేవలను ప్రారంభించింది. చిన్న సంస్థలు రుణాలు, ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్, ప్రైవేట్ ఈక్విటీ, క్యాపిటల్ మార్కెట్లో లిస్టింగ్ ద్వారా నిధుల సమీకరణకు ఫండింగ్ డాక్టర్ సాయపడుతుందని, హైదరాబాద్‌లో ఈ సేవలను ప్రారంభించామని ఫండింగ్ డాక్టర్ సహ వ్యవస్థాపకుడు ఎం శ్రీనివాసరావు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని ఎంఎస్ఎంఈలకు నిధుల సమీకరణ, బకాయిల రికవరీకి సాయం చేస్తామని చెప్పారు. త్వరలో హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాలకు సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు.

# 4 రోజుల నష్టాలకు తెర

- 429 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: వరుసగా నాలుగు రోజులపాటు నష్టాలను మూటగట్టుకున్న దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారంనాడు లాభాల బాటపట్టాయి. చైనాలో కరోనా వైరస్ కేసు లు తగ్గుముఖం పట్టడం, ఈ వైరస్ పట్ల తగిన చర్యలు తీసుకుంటామని భారత ప్రభుత్వం హామీ ఇవ్వడం వంటి ప్రకటనల నేపథ్యంలో స్టాక్ మార్కెట్ సూచీలు పెరిగాయి. బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ ఒక దశలో 41,357.16 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 428.62 పాయింట్ల లాభంతో 41,323 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 133.40 పాయింట్లు పెరిగి 12,125.90 పాయింట్ల వద్ద క్లోజైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారంనాడు ఫార్మాసూటికల్స్, టెక్స్‌టైల్స్, కెమికల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ హార్డ్‌వేర్, సోలార్, ఆటో, సర్జికల్ ఎక్విప్‌మెంట్స్, పెయింట్స్ వంటి రంగాల ప్రతినిధులతో భేటీ కావటం మార్కెట్లో ఉత్సాహాన్ని నింపింది. దీంతో బీఎస్ఈ ఎనర్జీ, హెల్త్‌కేర్, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు 2.37 శాతం వరకు పెరిగాయి. బీఎస్ఈలోని మొత్తం 19 రంగాల సూచీలు లాభాలతో ముగిశాయి.

**వొడా ఐడియా షేరు 38 శాతం జంప్**

కంపెనీ బ్యాంకు గ్యారెంటీలను ప్రభుత్వం నగదుగా మార్చుకునే అవకాశం లేదన్న వార్తల నేపథ్యంలో బుధవారం వొడాఫోన్ ఐడియా షేరు భారీగా పెరిగింది. బీఎస్ఈలో ఒక దశలో 48.18 శాతం పెరిగిన షేరు రూ.4.49 స్థాయికి చేరుకుంది. చివరకు 38.28 శాతం లాభంతో రూ.4.19 వద్ద క్లోజైంది. ఎన్ఎస్ఈలో 40 శాతం పెరిగి రూ.4.20 వద్ద క్లోజైంది.

**అరబిందో అదుర్స్..**

హైదరాబాద్‌లోని యూనిట్-4 కు సంబంధించి యూఎ స్ఎఫ్‌డీఏ నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ నివేదిక వచ్చిన నేపథ్యంలో అరబిందో ఫార్మా షేరు బుధవారంనాడు జోరుగా పెరిగింది. బీఎస్ఈలో 20.40 శాతం లాభంతో రూ. 602.25 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 20.78 శాతం పెరిగి రూ. 604.40 వద్ద క్లోజైంది.



# టెక్నాలజీతోనే అందరికీ వైద్యం సాధ్యం

- ఏఐతో కచ్చితమైన చికిత్స
- ఇంటెల్ ఇండియా చీఫ్ నివృతి రాయ్
- హైదరాబాద్‌లో ఇంటెల్ ఏఐ కేంద్రం



ఇంటెల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, నివృతి రాయ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోట్లాది మందికి ఆరోగ్య సంరక్షణ సేవలు అందించాలంటే.. టెక్నాలజీ ఒక్కటే మార్గం. కరోనా వైరస్ వంటి అత్యవసర పరిస్థితులు అధిగమించాలన్నా.. వాటిని ముందుగా అంచనా వేయాలన్నా టెక్నాలజీ వల్లే సాధ్యమవుతుందని ఇంటెల్ ఇండియా అధిపతి నివృతి రాయ్ అన్నారు. ప్రస్తుతం కంప్యూటింగ్ సామర్థ్యాలు పెరిగాయి. కంప్యూటింగ్, డేటా నిల్వల సామర్థ్యాలు తక్కువ వ్యయానికే లభిస్తున్నాయి. అందువల్ల డేటాను విశ్లేషణ చేయడం చౌక అయిందని వ్యాఖ్యానించారు. బయోఏషియాలో ఆమె ఏఐ ఫర్ సోషల్ గుడ్-అడ్వాన్సింగ్ అఫర్డబుల్ హెల్త్‌కేర్ అనే అంశంపై మాట్లాడారు. మూత్ర పిండాల వ్యాధిని డాక్టర్ల కంటే ముందే ఎంతో కచ్చితంగా కృత్రిమ మేధ (ఏఐ) గుర్తించగలదు. కంప్యూటింగ్ ద్వారా 200 రెట్లు వేగంగా డయాగ్నోసిస్ చేయొచ్చని అందుకు అవసరమైన కంప్యూటింగ్ సామర్థ్యాలున్నాయన్నారు.

### 6,000 మందికి ఒక స్పెషలిస్ట్

దేశంలో ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక డాక్టరు మాత్రమే ఉన్నారు. ప్రతి ఆరు వేల మందికి ఒక స్పెషలిస్టు మాత్రమే సేవలు అందిస్తున్నాడు. దేశంలో డయేరియా వంటి వ్యాధుల చాలామంది చనిపోతున్నారు. టెక్నాలజీ మాత్రమే ఇటువంటి మరణాలను అడ్డుకోగలదు. లెక్కలు, ఏఐ, మెషిన్ లెర్నింగ్‌ను వినియోగించి ఉపద్రవాలను నివారించవచ్చు. ప్రత్యేకమైన వ్యాధులను కలిగించే 201-220 వైరస్‌లు ఉన్నట్లు గుర్తించారు. ప్రతి ఏడాది 2.3 వైరస్‌లను గుర్తిస్తున్నారు. 18 శాతం కేన్సర్ మరణాలకు వైరస్సే కారణం. కేన్సర్ చికిత్సకు ప్రతి ఏడాది 80 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నారు. తప్పుడు చికిత్సల వల్ల 2.5 బిలియన్ డాలర్లను అనవసరంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇటువంటి ఖర్చులను టెక్నాలజీతో నివారించవచ్చని రాయ్ అన్నారు. కాగా, ఇంటెల్ ఏఐ అప్లైడ్ రీసెర్చ్ కేంద్రాన్ని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

# జెఎల్ఆర్ డ్రైవర్ రహిత విద్యుత్ కారు



కోవెంట్రీ (యూకే): టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ లాండ్ రోవర్ (జెఎల్ఆర్) డ్రైవర్ రహిత విద్యుత్ కారును ఆవిష్కరించింది. సెంట్రల్ ఇంగ్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వార్విక్ వద్దనున్న తన నూతన ఇన్నోవేషన్ సెంటర్‌లో దీన్ని కంపెనీ అభివృద్ధి చేసింది. దీన్ని ప్రాజెక్టు వెక్టార్‌గా కంపెనీ చెబుతోంది. ఇది అడ్వాన్స్‌డ్, ఫ్లెక్సీబుల్, మల్టీ యూజ్ ఎలక్ట్రిక్ వెహికిల్ అని పేర్కొంది. సమాజాన్ని మరింత సురక్షితంగా, ఆరోగ్యవంతంగా, పర్యావరణాన్ని పరిశుద్ధంగా ఉంచే ఇన్నోవేషన్లలో జెఎల్ఆర్ లీడర్‌గా ఉంటుందని మరోసారి ప్రాజెక్ట్ వెక్టార్ నిరూపించిందని కంపెనీ సీఈఓ రాల్ఫ్ స్పెత్ తెలిపారు. కాగా 15 కోట్ల పౌండ్లతో ఏర్పాటు చేసిన జెఎల్ఆర్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రిన్స్ చార్లెస్ లాంఛనంగా ప్రారంభించారు. ఇది యూరప్‌లో అతిపెద్ద ఆటోమోటివ్ ఆర్ అండ్ డీ సెంటర్. ఈ నేషనల్ ఆటోమోటివ్ ఇన్నోవేషన్ సెంటర్‌లో యూకే, భారత్ నుంచి 1,000 వరకు విద్యావేత్తలు, పరిశోధకులు, ఇంజనీర్లు, డిజైనర్లు భవిష్యత్ కార్లు, వాహనాలపై పని చేయనున్నారు.

# టెలికాం రంగ స్థిరత్వంపై దృష్టి పెట్టండి

**ఆర్థిక మంత్రితో ఎయిర్‌టెల్, వొడా ఐడియా చీఫ్ భేటీ**

న్యూఢిల్లీ: సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిల చెల్లింపులు జరపలేక నానా తంటాలుపడుతున్న టెలికాం కంపెనీలు ఎయిర్‌టెల్, వొడాఫోన్ ప్రభుత్వ ఊరట కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎయిర్‌టెల్ అధినేత సునీల్ భారతీ మిట్టల్, వొడాఫోన్ ఐడియా చైర్మన్ కుమార మంగళం బిర్లా బుధవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. అయితే, మంత్రితో ఏం చర్చించారనే విషయాన్ని వెల్లడించేందుకు ఇరువురూ నిరాకరించారు. గడిచిన మూడున్నరేళ్ల నుంచి టెలికాం రంగం తీవ్ర ఒత్తిడిలో ఉందని సునీల్ మిట్టల్ అన్నారు. టెలికాం రంగ స్థిరత్వంపై ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక మంత్రి కంటే ముందు టెలికాం కార్యదర్శి అన్షు ప్రకాశ్‌తో మిట్టల్ సమావేశమయ్యారు. నిర్మలతో భేటీ అనంతరం మిట్టల్ మాట్లాడుతూ.. ఏజీఆర్ బకాయిల గురించి చర్చించలేదన్నారు. "దేశానికి, ప్రభుత్వ డిజిటల్ ఎజెండాకు టెలికాం పరిశ్రమ కీలకం. ఇతర రంగాలకు చెందిన చాలా పరిశ్రమలూ టెలికాంపై ఆధారపడి ఉన్నాయి. ఉద్యోగాల కల్పన, టెలికాం సేవల ద్వారా సమకూరే పన్ను ఆదాయం వంటి అంశాలు కూడా ముడిపడి ఉన్నాయి. కాబట్టి టెలికాం రంగం స్థిరంగా ఉంచడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టాలి" అని మిట్టల్ పేర్కొన్నారు. ఏజీఆర్ బకాయిల చెల్లింపుల విషయంలో ప్రభుత్వ ఊరట కోరారా..? ఏమైనా హామీ లభించిందా అన్న ప్రశ్నలపై వ్యాఖ్యానించేందుకు కుమార మంగళం బిర్లా నిరాకరించారు.

# నాబార్డు చైర్మన్‌గా చింతల గోవిందరాజులు

- సిఫారసు చేస్తూ బ్యాంక్స్ బోర్డు బ్యూరో నిర్ణయం
- 24 ఏళ్ల తరువాత తెలుగు వ్యక్తికి అవకాశం



హైదరాబాద్/గుంటూరు/అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు(నాబార్డు) చైర్మన్ పదవి తెలుగు తేజాన్ని వరించనుంది. కీలకమైన ఈ పదవికి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా బ్రాహ్మణకోడూరుకు చెందిన చింతల గోవిందరాజులు నియమితులు కానున్నారు. ఈ పదవికి ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల నుంచి 18 మంది పేర్లు బోర్డు పరిశీలనకు రాగా.. ఇంటర్వ్యూలు, కసరత్తు అనంతరం గోవిందరాజులు పేరును సిఫారసు చేస్తూ బ్యాంక్స్ బోర్డు బ్యూరో నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ అరుదైన అవకాశం ఓ తెలుగు వ్యక్తికి 24 ఏళ్ల తరువాత లభించినట్లయింది. 24 ఏళ్ల క్రితం తెలుగువారైన కోటయ్య ఈ సంస్థకు చైర్మన్‌గా వ్యవహరించారు. కాగా, కొంతకాలంగా నాబార్డు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్న చింతల గోవిందరాజులు.. పాఠశాల, కళాశాల విద్య గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాలలో, జేకేసీ కళాశాలలో అభ్యసించారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ (అగ్రికల్చర్), ఎంఎస్సీ అగ్రానమీ పూర్తిచేశారు. ఆ తర్వాత ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ)లో సీడ్ టెక్నాలజీ విభాగంలో పీజీ చేశారు. 1985లో నాబార్డులో నేరుగా గ్రేడ్-బి అధికారిగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా చేరారు. గడిచిన 35 ఏళ్లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. లఖ్‌నవూలోని బీఐఆర్‌డీ డైరెక్టర్‌గా, న్యాబ్‌ఫిన్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. స్వయం సహాయక బృందాలు, ఈ-శక్తి, రీఫైనాన్స్ రంగాల్లో వినూత్న పథకాలకు గోవిందరాజులు శ్రీకారం చుట్టారు. 20 దేశాల్లో పర్యటించి వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి బ్యాంకింగ్ రంగ సహకారం, స్థితిగతులపై అధ్యయనం చేసిన అనుభవం ఆయనకు ఉంది. వివిధ అభివృద్ధి పథకాల్లో నిరుపేదలను భాగస్వామ్యం చేయడం, తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడం కోసం కృషి చేశారు.

## ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 19వ తేదీకి.. | | విజయవాడ | 355 |
| హైదరాబాద్ | 340 | విశాఖపట్నం | 390 |
| 20వ తేదీకి.. | | వరంగల్ | 342 |
| చిత్తూరు | 403 | డజను గుడ్లు రూ. 60 | |
| గోదావరి | 355 | | |

## ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 54 | విజయవాడ | 60 |
| వరంగల్ | 54 | గుంటూరు | 60 |
| మహబూబ్‌నగర్ | 54 | ఒంగోలు | 62 |
| కరీంనగర్ | 55 | చిత్తూరు | 55 |
| కర్నూలు | 54 | నెల్లూరు | 55 |
| విశాఖపట్నం | 60 | అనంతపురం | 60 |
| గోదావరి | 54 | | |

## బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 41,120 | 41,900 | 42,920 | 41,550 | 41,630 |
| క్రితం ముగింపు | 41,110 | 41,400 | 42,470 | 41,350 | 41,220 |
| 22 క్యారెట్లు | 39,180 | 38,800 | 39,480 | 38,480 | 39,650 |
| క్రితం ముగింపు | 39,160 | 38,300 | 39,070 | 38,240 | 39,260 |
| వెండి (కిలో) | 47,500 | 49,500 | 49,100 | 48,600 | 51,800 |
| క్రితం ముగింపు | 46,400 | 48,000 | 48,000 | 47,700 | 50,660 |

# 12150 పైన స్వల్ప అప్‌ట్రెండ్

**టెక్ వ్యూ**

నిఫ్టీ రికవరీలో ప్రారంభమై 12000 వద్ద బౌన్స్ బ్యాక్ సాధించింది. ఆ తర్వాత రోజంతా నిలకడగా ట్రేడవుతూ చివరికి 130 పాయింట్ల లాభంతో డే గరిష్ఠ స్థాయిలో క్లోజయింది. ఈ బలమైన రికవరీతో తక్షణ కరెక్షన్ ముప్పు నుంచి బయటపడి సురక్షిత జోన్‌లోకి ప్రవేశించినట్టు కనిపిస్తోంది. మరోసారి స్వల్పకాలిక నిరోధం 12150 స్థాయిలో పరీక్షకు సమాయత్తం అవుతోంది. గత కొద్ది వారాలుగా మార్కెట్ కన్సాలిడేషన్ ట్రెండ్‌లో ట్రేడవుతోంది.

**బుధవారం స్థాయిలివే...**

**నిరోధం : 12150 మద్దతు : 12080**

- ఇంట్రాడే మైనర్ నిరోధం 12150. మరింత అప్‌ట్రెండ్ కోసం ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 12230, 12300.
- 12150 వద్ద విఫలమైతే బలహీనతకు ఆస్కారం ఉంటుంది. మరింత బలహీనపడితే మైనర్ మద్దతు స్థాయి 12080 కన్నా దిగజారితే మైనర్ బలహీనత సాధిస్తుంది.
- తదుపరి దిశకు సమాయత్తం అవుతున్నందు వల్ల స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

# ప్రథమార్ధం మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** మాఘ బహుళ ద్వాదశి
**నక్షత్రం :** ఉత్తరాషాఢ
**అప్రమత్తం :** ఆర్ర్ద, స్వాతి, శతభిషం నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 1.50**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ మెరుగ్గా ప్రారంభమై 1.10 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 3.2.0 వరకు నిలకడ/నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 9.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.10 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.20 సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 12165, 12200**

**మద్దతు స్థాయిలు : 12085, 12050**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

## రద్దు కాకుంటే అవిశ్వాసం!

- ఆపరేషన్ ఆకర్షకు శ్రీకారం.. మండలిపై వైసీపీ ఎత్తుగడ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శాసనమండలి రద్దు కోసం తీర్మానం చేసి పంపించిన రాష్ట్ర ప్రభుత్వం... ఒకవేళ అది కాకుంటే ప్రత్యామ్నాయ మార్గాన్ని కూడా చూస్తోందని సమాచారం. మండలి చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే యోచన కూడా చేస్తోందని అంటున్నారు. ప్రస్తుతానికి మండలిలో వైసీపీకి మెజార్టీ లేనందున... కలిసొచ్చే సభ్యులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోందని విశ్వసనీయ సమాచారం. టీడీపీ సభ్యులతో పాటు, మరికొందరిని కూడా తమ వైపు రావాలని అడుగుతున్నట్లు తెలిసింది. సరిపడా సంఖ్యాబలం వస్తే అవిశ్వాసం పెట్టాలన్న ఆలోచనపై ముందడుగు వేస్తోందని అంటున్నారు.

# తహసీల్దార్ల దిగ్బంధం


దుగ్గిరాల,పెదకాకాని తహసీల్దార్ల కారుకు అడ్డంగా రోడ్డుపై బైఠాయించిన రైతులు


కారులో తహసీల్దారు మల్లేశ్వరి

తాడికొండ/మంగళగిరి క్రైమ్, ఫిబ్రవరి 19: రాజధాని నిర్మాణానికి రైతులిచ్చిన భూములను పేదలకు నివేశన స్థలాలుగా ఇచ్చేందుకు వాటిని సర్వే చేయడానికి వచ్చిన తహసీల్దార్లను, రెవెన్యూ సిబ్బందిని అమరావతి ప్రాంత రైతులు అడ్డగించారు. వారు ముందుకు కదలకుండా నాలుగు గంటలపాటు కారు ముందు రాస్తారోకో చేశారు. 'తాత, ముత్తాతల నుంచి సంక్రమించిన భూములను రాజధానికి ఇచ్చాం. మాకే ఇంత వరకూ ప్రభుత్వం ప్లాట్లు కేటాయించలేదు. రాజధాని అభివృద్ధి చేయకుండా మా భూములను పేదలకు నివేశన స్థలాలు ఎలా ఇస్తారు' అని అధికారులను నిలదీశారు. వీటిపై సర్వే చేయడానికి వస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. తమకు ప్లాట్లు అప్పగించిన తర్వాత.. మిగులు భూములు ఉంటే అప్పుడు పేదలకు ఇవ్వాలని సూచించారు. రైతులకు, సీఆర్‌డీఏ అధికారులకు మధ్య ఒప్పందం ఉందని.. రెవెన్యూ అధికారులకు రాజధాని భూములతో ఎలాంటి సంబంధమూ లేదని తెగేసిచెప్పారు. రాజధాని పరిధిలోని మంగళగిరి మండలం కృష్ణాయపాలెం గ్రామంలో 103, 106 సర్వే నంబర్లలో భూముల సర్వేకు దుగ్గిరాల, పెదకాకాని మండల తహసీల్దార్లు మల్లేశ్వరి, రమేశ్‌నాయుడు, సర్వేయర్లు శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ వచ్చారు. ఇది తెలుసుకున్న గ్రామ రైతులు రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. తహసీల్దారు మల్లేశ్వరి కారు దిగలేదు. కారు దిగి తమకు సమాధానం చెప్పాలని రైతులు పట్టుబట్టినా ఆమె స్పందించలేదు. దీంతో రైతులు రోడ్డుపై కారుకు అడ్డంగా బైఠాయించారు. రాజధాని నిర్మాణానికి తాము పంట పొలాలు ఇస్తే.. పేదల నివేశన స్థలాల కోసం వాటిని కేటాయించడమే కాకుండా కనీసం ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు సర్వేకు రావడం ఏమిటని మండిపడ్డారు. ఇకపై రాజధాని ప్రాంతంలో పంట భూములను సర్వే చేయాలనుకుంటే ముందుగా ఆయా గ్రామాల రైతులకు సమాచారం అందించాకే అడుగుపెట్టాలని, లేకుంటే ఇలాగే అడ్డుకుంటామని హెచ్చరించారు. మధ్యాహ్నం 12.15 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రైతులు రాస్తారోకో చేశారు.

### మా శవాల మీదుగా వెళ్లాలి..

సర్వే విషయం తెలిసి యర్రబాలెం, పెనుమాక, మందడం, వెలగపూడి గ్రామాలకు చెందిన రైతులు, జేఏసీ నాయకులు హుటాహుటిన పెద్ద సంఖ్యలో కృష్ణాయపాలెం తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తుగ్లక్ సీఎం డౌన్‌డౌన్... తుగ్లక్ పాలన నశించాలి.... ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం... దొంగల రాజ్యం, దోపిడి రాజ్యం... అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉద్రిక్తత నెలకొనడంతో మంగళగిరి, తుళ్లూరు డీఎస్పీలు దుర్గాప్రసాద్, శ్రీనివాసరెడ్డి, మంగళగిరి పట్టణ, రూరల్ సీఐలు శ్రీనివాసులరెడ్డి, శేషగిరిరావు, తుళ్లూరు సీఐ శరత్‌బాబు, ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు భారీ సంఖ్యలో తమ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. అదే సమయంలో మంగళగిరి తహసీల్దారు జీవీ రామ్‌ప్రసాద్ అక్కడకు వచ్చారు. కృష్ణాయపాలెంలో ప్రభుత్వ పోరంబోకు భూములను, డొంక భూములను సర్వే చేయడానికే రెవెన్యూ అధికారులు వచ్చారని సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఇతర మండలాల పేదలకు రాజధాని గ్రామాల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ముందుగానే రెవెన్యూ అధికారులు ఒప్పంద పత్రాలు తీసుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందని పలువురు రైతులు ప్రస్తావించగా.. అలాంటిదేమీ లేదని ఆయన తెలిపారు. పలువురు మహిళలు మాట్లాడుతూ 4 గంటల సేపు అధికారిని అడ్డగిస్తేనే పోలీసులు, ఇతర అధికారులు వచ్చి నిరసనలు విరమించాలని చెబుతున్నారని.. 64 రోజుల నుంచి తాము ఆందోళనలు చేస్తూ లాఠీ దెబ్బలు తింటుంటే ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. గ్రామ సభలు నిర్వహించకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. రాజధానిలో సర్వేల పేరుతో అధికారులు వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎవరైనా వస్తే తమ శవాల మీదుగా వెళ్లాల్సిందేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.


మండలి చైర్మన్ షరీఫ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వైవీబీ

## చైర్మన్ నిర్ణయాన్ని ఎవ్వరూ ప్రశ్నించలేరు

- లోపాలున్నా అడిగేందుకు లేదు...
- కోర్టుల్లోనూ సవాల్ చేయలేరు: యనమల

అమరావతి, విజయవాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): "శాసనమండలిలో చైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఇది పలుమార్లు రుజువైంది. సభలో చైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని పాలనా విధులు నిర్వహించే ఒక అధికారి కాదనలేడు. రేపు అసెంబ్లీలో కూడా సభాపతి నిర్ణయాన్ని కార్యదర్శి కాదంటే... అది ప్రజాస్వామ్యానికి పెను విఘాతం కాదా?" అని మండలిలో విపక్ష నేత యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. తన ఆదేశాన్ని ధిక్కరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు శాసనమండలి చైర్మన్ ఫిర్యాదు చేయడం నిబంధనల ప్రకారమే జరిగిందన్నారు. ఈ మేరకు యనమల బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటరీ వ్యవస్థలో చాలా సందర్భాల్లో ఓటింగ్ లేకుండానే బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపిస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇది సభ మూడ్‌ను బట్టి ఉంటుందన్నారు. సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, కార్యక్రమాలు నడపలేని పరిస్థితి వచ్చినప్పుడు... రాజ్యాంగంలోని 212 ప్రకరణం ప్రకారం చైర్మన్‌కు నిర్ణయం తీసుకునే అధికారం ఉందన్నారు. ఆ నిర్ణయం తీసుకోవడంలో ఏవైనా పద్ధతి లోపాలున్నా... వాటిని ప్రశ్నించేందుకు లేదని కూడా స్పష్టం చేశారు. న్యాయస్థానాల్లో కూడా సవాల్ చేసేందుకు లేదన్నారు. ఇంత స్పష్టంగా అన్నీ ఉంటే... కార్యదర్శి మాత్రం చైర్మన్ నిర్ణయాన్ని ఎలా ధిక్కరిస్తారన్నారు. కార్యదర్శి అరెస్టు అవుతారని తాను అన్నట్లు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అయితే సభాధిక్కరణ కింద తీర్మానం పెట్టొచ్చని... ఎలాంటి చర్యలు అయినా తీసుకునే హక్కు సభకు ఉంటుందని చెప్పానన్నారు.

### కార్యదర్శిపై హక్కుల తీర్మానం: వైవీబీ

"మండలి చైర్మన్ ఆదేశాల మేరకు కార్యదర్శి వెంటనే సెలెక్ట్ కమిటీని నియమించాలి. ఆ రెండు బిల్లులను కమిటీకి పంపాలి. చైర్మన్ ఆదేశాలను కార్యదర్శి అమలు చేయాలి. అందుకు భిన్నంగా వ్యవహరించడం సభాహక్కుల ఉల్లంఘన కిందికే వస్తుంది. రానున్న బడ్జెట్ సమావేశాల్లో కార్యదర్శిపై సభాహక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశపెట్టి కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఎమ్మెల్సీ యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన చైర్మన్ షరీఫ్‌ని కలిసి అభినందనలు తెలిపారు. అధికారపక్షం ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం వ్యవహరించి చట్టసభ ప్రతిష్ఠను పెంచారని చైర్మన్‌ను ప్రశంసించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కన్నా, చిత్రంలో మాధవ్, పురందేశ్వరి తదితరులు

## అసమర్థ పాలకుడు జగన్

- రాష్ట్రం సీఎం సొంత జాగీరు కాదు
- ప్రతిపక్ష నేతలను భయభ్రాంతులు చేస్తున్న వైసీపీ: కన్నా

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 19: "పాలనకు పనికిరాని అసమర్థుడు జగన్మోహన్‌రెడ్డి. తొమ్మిది నెలలుగా రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది. అరాచకాలు, అక్రమాలతోనే వైసీపీ ఆవిర్భవించింది. రాష్ట్రం సీఎం సొంత జాగీరు కాదు. ఆడింది ఆట, పాడింది పాటలా పాలన సాగిస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదు" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ బుధవారం కడపలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ప్రతిపక్ష పార్టీలను భయభ్రాంతులకు గురి చేసేలా బీజేపీ కార్యకర్తలు, నాయకులను అక్రమ కేసుల్లో ఇరికించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారన్నారు. కడపలో తమ పార్టీ అధికార ప్రతినిధి బండి ప్రభాకర్‌పై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఈ కేసును బేషరతుగా ఎత్తివేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర మాజీ మంత్రి దగ్గుపాటి పురందేశ్వరి, మాజీ మంత్రులు రావెల కిశోర్‌బాబు, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## రస్ అల్‌ఖైమాపై ఏం చేయబోతోంది?

- జగన్‌ని అరెస్టు చేస్తే రాష్ట్ర ప్రజలకు అవమానం
- ఈ వ్యవహారంపై సీఎంఓ స్పందించాలి: వర్ల డిమాండ్

మంగళగిరి, ఫిబ్రవరి 19: "రస్ అల్‌ఖైమా తన పెట్టుబడులను రాబట్టుకోవడానికి ఏం చేయబోతోంది? ఈ విషయంలో ప్రధాని ఎలా స్పందించనున్నారు? అసలు ఆ దేశానికి, మన దేశానికి మధ్య జగన్ వ్యవహారంలో ఏం జరుగుతోంది? అన్న ఉత్సుకత రాష్ట్ర ప్రజలందరిలో ఉంది" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాన్‌పిక్ పోర్టు పేరుతో రస్ అల్‌ఖైమా నుంచి సేకరించిన పెట్టుబడులను నిమ్మగడ్డ ప్రసాద్ దుర్వినియోగం చేశారన్నారు. వాటిని వివిధ మార్గాల్లో జగన్ డొల్ల కంపెనీల్లో పెట్టారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే సెర్బియాలో నిమ్మగడ్డ అరెస్టు అయ్యారని గుర్తు చేశారు. ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న నిమ్మగడ్డ తన వాగ్మూలంలో నిధులన్నింటినీ జగన్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టినట్లు స్పష్టంగా చెప్పారని అన్నారు. దీనితో నిమ్మగడ్డ చెప్పిన వ్యక్తిని తమకు అప్పగించాలని, లేదా తమకు రావల్సిన సొమ్ములను ఇప్పించాలని కోరుతూ భారత ప్రభుత్వానికి రస్ అల్‌ఖైమా లేఖ రాసిందన్నారు. దీనితో కంగారుపడిన జగన్ తనను వారికి అప్పగించవద్దని ప్రధాని శరణుజొచ్చాడని వర్ల చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై సీఎంఓ తక్షణమే ఓ ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మన సీఎంను వేరే దేశం వారు అరెస్టు చేస్తే ఆంధ్ర ప్రజలకు ఎంత అవమానంగా ఉంటుందో జగన్ ఆలోచించుకోవాలన్నారు.

## వెళ్లగొట్టినందుకే అదనపు శాఖ: పంచుమర్తి



మంగళగిరి, ఫిబ్రవరి 19: "రాష్ట్రం నుంచి భారీ పరిశ్రమలన్నింటిని విజయవంతంగా వెళ్లగొట్టినందుకు ప్రతిఫలంగా మంత్రి మేకపాటి గౌతంరెడ్డికి అదనంగా నైపుణ్య అభివృద్ధి శాఖను సీఎం జగన్ అప్పగించారు" అని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఏ తరహా నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని, ఏ సంస్థ సహకారంతో పెడుతోందో చెప్పాలని డిమాండ్ చేశారు. "ప్రకాశం జిల్లాలో మెగాఫుడ్ పార్కుల కోసం శిక్షణ ఇప్పించాం... మీరక్కడ మీ వైసీపీ నాయకులకు క్రికెట్ బెట్టింగులు, దొంగనోట్ల చెలామణిపై శిక్షణ ఇప్పిస్తారా! కడపలో టెక్నికల్ ట్రైనింగ్ ఇప్పించాం... మీరు మట్కా నెంబరు గేమ్‌పైన, పేకాటపైన శిక్షణనిస్తారా? తిరుపతిలో ఎలక్ట్రానిక్ రంగానికి సంబంధించి శిక్షణ ఇప్పించాం... అక్కడ ఎర్రచందనం స్మగ్లింగ్ గురించి శిక్షణ ఇప్పిస్తారా! విశాఖలో సాఫ్ట్‌వేర్ రంగానికి సంబంధించి శిక్షణ ఇప్పించాం...మీరు భూకబ్జాలపై శిక్షణ ఇప్పిస్తారా! గోదావరి జిల్లాల్లో ఆక్వాఫుడ్స్ ప్రాసెసింగ్‌పై శిక్షణ ఇప్పించాం... మీరు ఇసుక దందాల గురించి శిక్షణ నిస్తారా! కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆటోమొబైల్ రంగంపై శిక్షణ ఇప్పించాం...మీరు బూతులెలా మాట్లాడాలో శిక్షణ ఇస్తారా?" అని ఎద్దేవా చేశారు.

## రైతు సమస్యలపై స్పందించని జగన్: అఖిలప్రియ

రుద్రవరం, ఫిబ్రవరి 19: "కర్నూలు జిల్లా పర్యటనలో సీఎం వైఎస్ జగన్ రైతు సమస్యలపై స్పందించలేదు. సాగు, తాగు నీటిపై స్పష్టత ఇవ్వలేదు. జిల్లా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యేలు విన్నవించినా సీఎం జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోక పోవడం దారుణం" అని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. కర్నూలు జిల్లా తిప్పారెడ్డిపల్లెలో బుధవారం ఆమె మాట్లాడారు. అమరావతిలో రాజధాని తొలగిస్తే ఎక్కువ నష్టపోయేది రాయలసీమేనని చెప్పారు.

## తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జుల నియామకం

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జులను నియమిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ తెలిపింది. ఏలూరు నియోజకవర్గానికి బడేటి రాధాకృష్ణయ్య(చంటి), గుడివాడకు రావి వెంకటేశ్వరరావు, బాపట్లకు వేగేశ్న నరేంద్రవర్మ, మాచర్లకు కొమ్మారెడ్డి చలమారెడ్డిని నియమించినట్లు మీడియా సమన్వయకర్త నరేంద్రబాబు తెలిపారు.

## స్థాయికి మించి మాట్లాడుతున్న సజ్జల: బుద్దా



విజయవాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వ సలహాదారుగా గౌరవప్రదమైన పదవిలో ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి వైసీపీ నాయకుడిలాగా దిగజారి మాట్లాడుతున్నారు. బాగా చదువుకున్న సజ్జల మాజీ సీఎం చంద్రబాబుపై అవాకులు, చవాకులు మాట్లాడటం సిగ్గుచేటు. ఆయన స్థాయికి మించి మాట్లాడుతున్నా.. చంద్రబాబుపై ఆయన చేసిన ప్రతి విమర్శకు తమ దగ్గర సమాధానాలున్నాయి. మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమా?" అని ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సవాల్ విసిరారు. బుధవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. నవరత్నాల పేరుతో ప్రజలను నయవంచనకు గురి చేసిన జగన్ రాష్ట్రాన్ని సరైన విధానంలో నడిపించడంలో విఫలమయ్యారని బుద్దా విమర్శించారు. "చంద్రబాబు ప్రజాచైతన్య యాత్ర అనగానే శుక్రవారం బ్యాచ్‌కి వెన్నులో వణుకు మొదలైనట్లుంది. కంగారులో ఏం మాట్లాడాలో కూడా అర్థం కావడం లేదు పాపం" అంటూ ట్వీట్ చేశారు.

## నేడు ఢిల్లీకి పవన్.. సైనిక్ బోర్డుకు కోటి విరాళం

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం ఢిల్లీలో పర్యటించనున్నారు. కేంద్రీయ సైనిక్ బోర్డు కార్యాలయాన్ని సందర్శించి, కోటి రూపాయల విరాళాన్ని అందిస్తారు. అనంతరం విజ్ఞాన భవన్‌లో జరిగే ఇండియన్ స్టూడెంట్స్ పార్లమెంట్ సదస్సులో పాల్గొంటారు. దేశానికి స్వచ్ఛమైన యువ రాజకీయ నాయకత్వాన్ని అందించడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యసిస్తారు. కాగా, సుగాలీ ప్రీతి కేసును సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమని పవన్ అన్నారు. సీఎం జగన్ రెడ్డి, వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సుగాలీ ప్రీతి కుటుంబానికి ఊరట కలిగిస్తుందన్నారు.


ఐటీ కంపెనీల సీఈవోలతో మంత్రుల సమావేశం

## 'ఐటీ' కోసమే మిలీనియం టవర్స్

- వేరే అవసరాలకు వినియోగించం
- రూ.3 వేల కోట్లతో అదానీ డేటా సెంటర్
- మంత్రులు మేకపాటి, అవంతి వెల్లడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఐటీకి కేటాయించిన మిలీనియం టవర్స్‌ను వేరే అవసరాలకు వినియోగించే ఆలోచన లేదని మంత్రులు మేకపాటి గౌతంరెడ్డి, అవంతి శ్రీనివాస్‌లు చెప్పారు. బుధవారం రుషికొండలోని ఐటీ సెజ్‌ను ఇద్దరు మంత్రులు సందర్శించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ మిలీనియం టవర్ 1లో ఉన్న కాండ్యునెంట్ సంస్థ విస్తరణ కోసం అనుమతి కోరిందని, మరో లక్ష చదరపు అడుగుల విస్తరణకు సిద్ధంగా ఉందని, త్వరలోనే ఇవ్వడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. విశాఖను ఐటీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, వచ్చే ఏడాదిలో 50 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. అదానీ కంపెనీ రూ.3 వేల కోట్లతో విశాఖలో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుందని, ఇందుకు 80 ఎకరాలు కావాలని కోరినట్టు చెప్పారు. మాజీ సీఎం చంద్రబాబు వ్యవహారశైలి కారణంగా రాష్ట్రం నుంచి కొన్ని కంపెనీలు వెళ్లిపోతున్నాయన్నారు. ఇప్పటివరకు ఏ ఐటీ సంస్థకూ తాము నోటీసులు ఇవ్వలేదని, వెళ్లిపొమ్మని కోరలేదని చెప్పారు. విశాఖలో ఐటీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక మంత్రి అవంతి శ్రీనివాసరావు తెలిపారు. మిలీనియం టవర్స్‌లో సెక్రటేరియట్ ఏర్పాటు కానుందా? అన్న ప్రశ్నకు అవన్నీ ఊహాజనితమేనని మంత్రి కొట్టిపారేశారు. మిలీనియం టవర్-2 నిర్మాణానికి నిధులు విడుదల చేశామని, నిధులు ఇచ్చినా తప్పే, ఇవ్వక పోయినా తప్పే అన్న చందంగా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని దుయ్యబట్టారు.

## రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన బాబు: సజ్జల

విజయవాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): "గడచిన ఐదేళ్ల కాలంలో చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేశాడు. రూ.2.60 లక్షల కోట్ల అప్పులను మాకు అప్పగించి వెళ్లారు" అని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. విజయవాడలో బుధవారం ఏపీయూడబ్ల్యూజే నిర్వహించిన 'మీట్ ద మీడియా'లో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ నిజమైన విజన్‌తో ముందుకు వెళ్తున్నారన్నారు. వైసీపీ రూపొందించిన మేనిఫెస్టోలో 85 శాతం వరకు అమలు చేశామన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికీ మనోధైర్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాజధానిని మార్చడం లేదని, అమరావతి నుంచి రెండు భాగాలను ఆయా ప్రాంతల ప్రజల ఆకాంక్షల మేరకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. అమరావతి రైతులకు ప్రభుత్వం అన్యాయం చేయదని చెప్పారు.


గుంటూరులో ఏపీ మ్యాప్‌ను తలపించేలా మానవహారంగా నిలబడిన మహిళలు

# అమరావతిని కదలనివ్వం



గుంటూరులో అమరావతి పరిరక్షణ సమితి మహా పాదయాత్ర

### ప్రభుత్వ నిర్ణయంతో సామాజిక ఉపద్రవం.. సీఎం మనసు మారాలంటూ హోమాలు

- కడప దర్గాకు వందమంది ముస్లింల పాదయాత్ర
- రేపటి నుంచి గ్రామాల్లో ప్రభాత భేరి
- 64రోజూ కొనసాగిన రైతుల ఆందోళనలు

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో దేశానికి సామాజిక ఉపద్రవం రానుంది. ఎకరం భూమి ఇచ్చి 25సెంట్లు తీసుకుంటున్నాం. ఇది త్యాగం కాదా?' అంటూ రాజధాని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 'రాష్ట్రానికి రాజధాని ఒక్కటే ఉండాలి. అది అమరావతే కావాలి' అనే నినాదంతో ఆందోళనలు కొనసాగించారు. 64రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోకుండా... తమ భూములను వేరే ప్రాంత పేదలకు ఇవ్వడం కోసం అధికారుల వచ్చి సర్వేలు చేయడమేంటని రైతులు మండిపడుతున్నారు. మా ఆవేదనను అర్థం చేసుకోకుండా సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. రాజధానిని ఇక్కడే ఉంచుతామని స్పష్టంగా ప్రకటించేవరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, ఎర్రబాలెంలో 64వ రోజు రిలే దీక్షలు చేపట్టారు. తాడికొండ అడ్డరోడ్డు, కలెక్టరేట్ ఎదుట, పెదపరిమి, 14మైలు తదితర ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగించారు. తుళ్లూరు, మందడం, వెలగపూడిలో రైతులు, రైతు కూలీలు, మహిళలు 24గంటల దీక్ష చేపట్టారు. సీఎం మనసు మారాలంటూ నేలపాడు రైతులు, మహిళలు, కూలీలు మన్యు పాశుపత హోమం, అఘోర పాశుపత హోమం నిర్వహించారు. రేపటి నుంచి రాజధాని గ్రామాల్లో దళిత డప్పు కళాకారులతో ఉదయం 5గంటలకు ప్రభాత భేరి నిర్వహించనున్నట్లు జేఏసీ నేత శ్రీనివాస్ తెలిపారు. అమరావతిని రాజధానిగా కొనసాగించేలా చూడాలంటూ వంద మంది ముస్లింలు అమరావతి నుంచి కడప దర్గాకు పాదయాత్ర చేయనున్నట్లు జేఏసీ నేతలు పేర్కొన్నారు.


సీఎం మనసు మారాలంటూ యాగం నిర్వహిస్తోన్న నేలపాడు రైతులు

### మహిళల మహా పాదయాత్ర

అమరావతి పరిరక్షణ సమితి మహిళా నేతల అధ్వర్యంలో గుంటూరులో బుధవారం మహా పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా... అమరావతిని కదలనివ్వబోమని అమరావతి పరిరక్షణ సమితి మహిళా జేఏసీ నేతలు స్పష్టం చేశారు. రాజధాని తరలింపు రాష్ట్ర ప్రజలందరి సమస్య అంటూ జాతీయ జెండా రంగులతో వస్త్రధారణ చేసిన మహిళలు బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుంచి వేంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు భారీ ప్రదర్శన చేశారు. అక్కడ ఏపీ మ్యాప్‌ను తలపించేలా మానవహారంగా ఏర్పడి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. జేఏసీ పిలుపు మేరకు తుళ్లూరు, రాయపూడి, తాడికొండ, పెదపరిమి, పొన్నెకల్లు, నిడముక్కల తదితర ప్రాంతాల నుంచి మహిళలు, రైతులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనకు తరలి వచ్చారు. వీరికి వివిధ రాజకీయ పార్టీల నేతలు మద్దతు తెలుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. లాయర్లు, డాక్టర్లు, చార్టెడ్ అకౌంటెంట్స్, విద్యార్థులు, మహిళలు ర్యాలీ భాగస్వాములయ్యారు.




## రాజధాని ఉద్యమానికి 'అనంత' మద్దతు

అనంతపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు అనంతపురం రైతన్నలు మద్దతుగా నిలిచారు. అమరావతి పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్, సీపీఐ జిల్లా కార్యదర్శి దేవరగుడి జగదీశ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ రైతు సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, కాటమయ్యతోపాటు 40మందికి పైగా రైతులు బుధవారం అమరావతి బయలుదేరారు.


ఆందోళన చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

## దళితుల భూమి సేకరణ అన్యాయం

**▸ శాసనసభ కమిటీ ఎదుట సంఘాల నిరసన**

గుజరాతీపేట(శ్రీకాకుళం), ఫిబ్రవరి 19: వైఎస్‌ఆర్ నవశకంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి దళితుల భూములను సేకరించడం అన్యాయమంటూ దళిత సంఘాల ప్రతినిధులు శాసనసభ ఎస్సీ కమిటీ ఎదుట నిరసన తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో దళితుల సమస్యలపై వినతులు స్వీకరించేందుకు రాష్ట్ర శాసనసభ ఎస్సీ కమిటీ సభ్యులు వచ్చారు. సామాజిక న్యాయ పోరాట సమితి (ఎస్‌ఎన్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేశ్, కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) జిల్లా కార్యదర్శి బెలమర ప్రభాకరరావు, వ్యవసాయ కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారపు సింహాచలం తదితరుల ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న దళిత సంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, స్థానిక వైసీపీ నాయకులు కక్షగట్టి దళితుల భూములను మాత్రమే వైఎస్ఆర్ నవశకం పథకం కోసం సేకరిస్తుండటం ఎంతవరకు సమంజసమని కమిటీ ఛైర్మన్ గొల్ల బాబూరావును ప్రశ్నించారు. జిల్లాలో సుమారు 700 ఎకరాల భూమిని దళితుల నుంచి సేకరించినప్పటికీ ఏ ఒక్కరూ తమకు జరిగిన అన్యాయంపై పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆక్రమణలో ఉన్న భూములను మాత్రం అధికారులు సేకరించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతులు స్వీకరించిన కమిటీ సభ్యులు.. పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కమిటీ సభ్యులు కంబాల జోగులు, గుమ్మడి సంధ్యారాణి, ఎండపల్లి శ్రీనివాసరెడ్డి, వెన్నుమట్ల ఎలీజా, అలజంగి జోగారావు, కొండేటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

### ▸ 45 ఏళ్లకే పెన్షన్ హామీ ఏమైంది?: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 45 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పిస్తానని ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీ ఏమైంది? రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన పెన్షన్లు, రేషన్‌కార్డుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలి" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సీఎం జగన్‌కు ఆయన లేఖ రాశారు.

### ▸ సీఏఏ అమలు కూడదని తీర్మానించండి: మధు

హిందూపురం టౌన్, ఫిబ్రవరి 19: "కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఆర్సీ, ఎన్‌పీఆర్, సీఏఏ చట్టాలు రాష్ట్రంలో అమలు చేయకూడదు. ఆ మేరకు శాసనసభలో వైసీపీ, టీడీపీ తీర్మానం చేయాలి" అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం జిల్లా హిందూపురంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీ, బహిరంగసభకు ఆయన హాజరయ్యారు.

### ▸ సోనియాకు శైలజానాథ్ కృతజ్ఞతలు


సోనియాగాంధీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సాకే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పీసీసీ నూతన అధ్యక్షునిగా నియమితులైన మాజీ మంత్రి సాకే శైలజానాథ్ బుధవారం సాయంత్రం ఢిల్లీలో ఆ పార్టీ అధినేత్రి సోనియాగాంధీతో భేటీ అయ్యారు. తనను పీసీసీ అధ్యక్షునిగా నియమించినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ నూతన కార్యవర్గ సభ్యుల ప్రతిపాదిత జాబితాను శైలజానాథ్ సోనియాకి సమర్పించారు.

### తుగ్లక్ పాలనను మించింది: తులసిరెడ్డి

హిందూపురం టౌన్, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో అధికారం చేపట్టిన 9 నెలల్లో జగన్ పాలన పిచ్చి తుగ్లక్ పాలనను మించిపోయిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల పరిస్థితి పెనంపై నుంచి నిప్పుల పొయ్యిలో పడినట్లుందన్నారు. ఈ ప్రభుత్వం రద్దులు, వేధింపులు, కక్షసాధింపుల పాలనగా సాగుతోందన్నారు. శాసన మండలి రద్దు వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి వెన్నుపోటు పొడవడమేనన్నారు. జగన్‌కు అహంకారం, అహంభావం ఎక్కువని విమర్శించారు. జగన్ ఎనిమిది నెలల్లోనే 50 వేల కోట్లు అప్పుచేసి కొన్ని శాఖలకు సంబంధించి నిధులు మళ్లించి వాటిని నిర్వీర్యం చేశారన్నారు. ప్రత్యేక హోదాకు బీజేపీ పంగనామాలు పెట్టిందని అన్నారు.

## నిబంధనలు నచ్చకపోతే వెళ్లిపోండి

**▸ పేద విద్యార్థులకు 25% కోటా ఇవ్వాల్సిందే: మంత్రి సురేశ్**

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలకు ప్రభుత్వ విధానాలు, నిబంధనలు నచ్చకపోతే.. వెళ్లిపోవచ్చని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ అడ్మిషన్లు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు సిద్ధమయ్యాయని వెల్లడించారు. విజయవాడలోని సిద్దార్థ డిగ్రీ కళాశాలలో బుధవారం ఇంటర్‌లో బోధన, ప్రభుత్వ విధానాల అమలు అంశాలపై ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, ప్రతినిధులతో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సదస్సులో మంత్రి మాట్లాడారు. విద్యాబోధనను సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. చిన్న చిన్న కాలేజీల పేర్లతో పెద్ద పెద్ద సంస్థలు కళాశాలలు నడుపుతున్నారని యాజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ కాలేజీల్లో బడుగు, బలహీన వర్గాలకు 25% సీట్లు కేటాయించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా పనిచేయకపోతే రాష్ట్రం నుంచి వెళ్లిపోవచ్చన్నారు.

# రాష్ట్రంలో అవినీతి పెరిగింది

- ▸ 'పోలవరం' పూర్తి కాకపోతే జగన్‌ను జాతి క్షమించదు
- ▸ 22 మంది ఎంపీలున్నా చేయరా?
- ▸ కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు భయమా?
- ▸ మరోసారి జైలుకెళ్లేందుకు సిద్ధపడండి
- ▸ అప్పుడైనా కేంద్రం పూర్తి చేస్తుంది
- ▸ పోలవరంపై జగన్‌ది ద్వంద్వ నీతి: ఉండవల్లి



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 19: "రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది. నీతిగా ఉండాలని సీఎం జగన్ తన ఎమ్మెల్యేలకు, ఎంపీలకు చెప్పినా మార్పు కనిపించడం లేదు. ప్రభుత్వ శాఖలను చూస్తుంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. పేదల ఇళ్ల కోసం చేస్తున్న భూసేకరణలో కొంతమంది భూములను మినహాయించడం కోసం అధికారులు గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా డబ్బులు తీసుకుంటున్నారు" అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక నెంబరు ఇచ్చి ఫిర్యాదు చేయండి అంటే అవినీతి ఆగదని, మండల స్థాయిలో మీ అనుచరులు, మనుషులనైనా పెట్టుకుని ఒక్కొక్క నెంబరు ఏర్పాటు చేసి అవినీతిని రూపుమాపే ప్రయత్నమన్నా చేసుకోవాలని సీఎం జగన్‌కు సూచించారు. "పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయకపోతే జగన్‌ను జాతి క్షమించదు" అని ఉండవల్లి హెచ్చరించారు. జగన్ మాట తప్పడు, మడమ తిప్పడని భావించే ప్రజలు ఓట్లు వేశారని, దానిని నిలబెట్టుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కేవీపీ రామచంద్రరావు కేసు వేశారని, అదే కేసు ప్రభుత్వంలో ఉన్న మీరు ఎందుకు వేయలేకపోయారని ఉండవల్లి ప్రశ్నించారు. కేసు వేసినంత మాత్రాన కేంద్రాన్ని ఇబ్బంది పెట్టినట్టు కాదన్నారు. ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వాలు చేసిన తప్పే జగన్ చేస్తున్నారని విమర్శించారు. "ఇటీవల ప్రధానిని కలిసిన జగన్ పోలవరం విషయాన్ని ప్రస్తావించి, దీనిని పూర్తి చేయాలని డిమాండ్ చేసి ఉంటే బాగుండేది. లేకపోతే జగన్‌కు ఎలాగూ 16 నెలల జైలు అనుభవం ఉంది కాబట్టి తనపై ఉన్న కేసుల నేపథ్యంలో నన్ను జైల్లో అయినా పెట్టండి, లేదా రాష్ట్రానికి న్యాయమైనా చేయండి" అని డిమాండ్ చేసి ఉంటే కేంద్రం దిగివచ్చేదని ఉండవల్లి పేర్కొన్నారు. వైసీపీకి 22 మంది ఎంపీలున్నా ఇప్పుడు చేయలేకపోతే ఇంకెప్పటికీ చేయలేరని చెప్పారు. పోలవరం విషయంలో ప్రభుత్వానికి నిర్దిష్టమైన ప్రణాళిక లేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పూర్తి చేస్తామన్న వారు అధికారంలోకి వచ్చాక వదిలేశారని అన్నారు. రాజమహేంద్రవరంలో ఇసుకకు కొరత ఏమిటని ఉండవల్లి ప్రశ్నించారు. గోదావరి ఒడ్డుకు వెడితే నీళ్లు లేవని, అన్నీ ఇసుక తిన్నెలే కనిపిస్తున్నాయని, కానీ ఇక్కడ ఇసుక ర్యాంప్‌లన్నీ మూతపడే ఉన్నాయన్నారు. ఈ కొరత ప్రభుత్వమే సృష్టించిందని ధ్వజమెత్తారు. మద్యం రేట్లు విపరీతంగా పెంచేశారని, దీని ప్రభావంతో సారా తయారీ పెరుగుతోందన్నారు. రాజమహేంద్రవరంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

### ఆ చానళ్లను ఆపడం సరికాదు

రాష్ట్రంలో రెండు చానళ్ల ప్రసారాలను నిలిపివేయించడం సీఎంకు తగదని ఉండవల్లి అన్నారు. విమర్శలకు భయపడే నాయకుడికి పతనం ప్రారంభమైనట్టేనని చెప్పారు. వైఎస్ హయాంలో కూడా కొన్ని పత్రికలు ఆయనను విమర్శించాయని, అయినా ఆయన పట్టించుకోలేదని తెలిపారు. గతంలో మాజీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా చానళ్ల ప్రసారాలను నిలిపివేశారని, వారి విధానాన్నే జగన్ అనుసరించడం సరికాదన్నారు. తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, వెంటనే ప్రసారాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# చేస్తారా.. చస్తారా?

- ▸ సచివాలయ ఉద్యోగుల మెడపై కత్తి
- ▸ ఆగమేఘాలపై ఆదేశాలు, బిల్లులు తయారుచేయాలని ప్రభుత్వ ఒత్తిడి
- ▸ సంతకాలు, ఫార్మాలిటీస్ తర్వాత.. ముందు ఫైళ్ల పని జరగాల్సిందే

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుకున్నదే తడవుగా ఆగమేఘాలపై ఆదేశాలు రావలసిందే.. బిల్లులు తయారవ్వాల్సిందేనన్న ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అమరావతిలోని సచివాలయ సిబ్బంది మెడపై కత్తిపెట్టి.. నియమ నిబంధనలతో సంబంధం లేకుండా.. సీఎం చెప్పారంటూ అడ్డగోలుగా ఫైళ్లను కదిలిస్తున్నారు. సీఎం నిర్ణయాన్ని ఎలాగైనా అమలు చేసేయాలన్న అత్యుత్సాహంతో అధికారులు నిబంధనలతో పనిలేకుండా తమపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారంటూ సెక్రటేరియట్ ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారు. జీవో 13పై సీఎస్ నీలం సాహ్ని సంతకం లేకపోవడం.. ఆదేశాలు రాకముందే ఆ జీవో ఇవ్వడం.. ఉత్తర్వులిచ్చాక ఆదేశాలు జారీచేయడం వంటివి వారిని కలవర పెడుతున్నాయి. ఏదైనా ఫైలుపై సంతకాలూ ఇతర ఫార్మాలిటీస్ తర్వాత.. ముందు సీఎం ఆదేశాల మేరకు పనులు జరగాల్సిందేనని ఉన్నతాధికారులు స్పష్టం చేయడంపై విస్మయం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ఒక విధానాన్ని మార్చాలని సీఎం కొన్ని నెలల క్రితం నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం పలు వివాదాలకు దారితీసి ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. ఇది ఒక కీలక శాఖ పరిధిలోకి వస్తుంది. ఈ నిర్ణయం అమల్లోకి రావాలంటే మరో శాఖ ఆమోదం తప్పనిసరి. తూతూమంత్రంగా ఆమోదం కోసం చివరి నిమిషంలో ఆ రెండో శాఖకు పంపారు. అయితే నిబంధనల ప్రకారం కాకుండా.. నేరుగా ఒక పేపర్ ఇచ్చి.. దీనిపై ఇప్పటికే సీఎం నిర్ణయం తీసుకున్నారని.. ఆ పని చేసిపెట్టాలని మంత్రి కార్యాలయం నుంచి ఒక పేపర్ తెచ్చి ఇచ్చారు. ఇలా కాదని.. నిబంధనల ప్రకారం ఆ శాఖ నుంచి తమకు యూవో నోట్ రావాలని, దాని ప్రకారమే తాము పనిచేస్తామని రెండో శాఖ ఉద్యోగులు చెప్పారు. దీంతో తక్షణమే ఒక యూవో నోట్ టైప్ చేసి ఆ పేపరుకు జత చేసి రెండో శాఖలోని అధికారులకు అందజేశారు. దీనిపై కంగుతిన్న రెండో శాఖ ఉద్యోగులు తమ ఉన్నతాధికారిని సంప్రదించగా.. వారు అడిగిన పని చేసిపెట్టండి.. కానీ ఎక్కడా పేర్లు, సంతకాలు రాయొద్దని సూచించారు. ఆ సూచనల మేరకు ఉద్యోగులు పనికి పూనుకోగానే.. మొదటి శాఖ నుంచి మరో సమాచారం వచ్చింది. రెండో శాఖ చేయాల్సిన పనినే మరొకరితో చేయించుకుని ఆ పేపర్లు కూడా రెండో శాఖలోని ఉద్యోగులకు చేరవేశారు. వాటిని ఆమోదిస్తే చాలని కోరారు. త్వరగా కానిచ్చేయాలనడంతో రెండో శాఖ ఉన్నతాధికారి సంతకం లేకుండానే ఆ పేపర్లు మొదటి శాఖకు వెళ్లిపోయాయి.

### ఒక జీవో 11 తప్పులు

టీటీడీ పాలకమండలిని ఏర్పాటు చేస్తూ దేవదాయ శాఖ 4 నెలల క్రితం ఇచ్చిన జీవోలో సభ్యుల పేర్లు తప్పుగా రావడంతో దాన్ని సవరిస్తూ బుధవారం మరో జీవో ఇచ్చింది. సభ్యులతో పాటు, ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలోనూ అక్షర దోషాలు దొర్లాయి. ఈ అక్షర దోషాల ప్రభావం బయటపడి.. వాటిని సరిదిద్దడానికి ప్రభుత్వానికి 4 నెలలు పట్టిం ది. 2019 అక్టోబరు 19న మొదటి జీవో వచ్చింది. అందులోని ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలో గోవింద హరిగా ఉన్న పేరును ప్రస్తుత జీవోలో గోవింద్‌హరిగా మార్చారు. దుష్యంత్ కుమార్ దాస్‌ను దుష్యంత కుమార్ దాస్‌గా మార్చారు. సభ్యుల విషయానికొస్తే ఏకంగా 11 మంది సభ్యుల పేర్లను మొదటి జీవోలో తప్పుగా రాశారు. చిప్పగిరి వెంకట ప్రసాద కుమార్ పేరును పాత జీవోలో చిప్పగిరి ప్రసాద్ కుమార్‌గా రాశారు. పుత్తా ప్రతాప్‌రెడ్డి పేరును పుట్టా ప్రతాప్ రెడ్డిగా పాత జీవోలో రాశారు. నాదెళ్ల సుబ్బారావు పేరును నాదెండ్ల సుబ్బారావుగా, మేడా వెంకట మల్లికార్జునరెడ్డి పేరును ఎం.మల్లిఖార్జున రెడ్డి అని పాత జీవోలో పేర్కొన్నారు. ఇలాంటి అక్షర దోషాలను సరిదిద్ది బుధవారం కొత్త జీవో ఇచ్చారు. హడావుడిగా, తొందరపాటుతో జీవో ఇవ్వడం వల్లే తప్పులు దొర్లాయని అధికారులు తెలిపారు. పేర్లు తప్పుగా పడిన సభ్యులకు ఇచ్చే అలవెన్సులకు బ్యాంకుల్లో ఇబ్బందులు ఎదురవుతుండడంతో జీవోలో పేర్లు సవరించినట్లు చెప్పారు.

#### జడ్జి కాదు.. మాజీ జడ్జి!

మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖకు సంబంధించి 2019 అక్టోబరు 11వ తేదీన వచ్చిన జీవోను కూడా సవరిస్తూ బుధవారం మరో జీవో ఇచ్చారు. పాతజీవోలో 'జడ్జి, గౌరవనీయ హైకోర్టు' అని ఉన్న చోట.. 'మాజీ జడ్జి, గౌరవనీయ హైకోర్టు' అని చదువుకోవాలని సవరణ జీవోలో పేర్కొన్నారు.

## ఇంజనీరింగ్‌లో 2 ఫీజులు

- ▸ కన్వీనర్ కోటాకు రెట్టింపుగా మేనేజ్‌మెంట్ ఫీజు
- ▸ 90% కాలేజీలకు కనీస ఫీజు రూ.35-40 వేలు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ఫీజుల స్వరూపం మారనుంది. ప్రైవేట్ కాలేజీల్లో 2 ఫీజుల విధానం అమల్లోకి రానుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా కన్వీనర్ కోటా(కేటగిరి-ఏ)కు, మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి-బీ)కు వేర్వేరు ట్యూషన్ ఫీజుల పద్ధతిని ప్రవేశ పెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. కన్వీనర్ కోటాకు రెట్టింపుగా మేనేజ్‌మెంట్ కోటా ఫీజు ఉండనుంది. దేశంలో ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిసా, ఉత్తరప్రదేశ్.. తదితర రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో బహుళ ఫీజుల విధానం ఉంది. ఆయా రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఫీజుల విధానాలను అధ్యయనం చేసిన ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ 2019-20 నుంచి మన రాష్ట్రంలోనూ ఇంజనీరింగ్‌లో రెండు ఫీజుల విధానాన్ని ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తోంది. మూడు విద్యా సంవత్సరాల పాటు కొత్త ఫీజుల విధానం అమలు కానుంది. గతంలో మాదిరిగానే కనీస ఫీజు ఇకపైనా ఉంటుంది. ఇప్పటి వరకు కనీస ఫీజు రూ.35 వేలు ఉండగా.. ఇకపై రూ.35 వేలు-రూ.40 వేలు మధ్య ఉండనుంది. ఉదాహరణకు ఏదైనా కాలేజీకి కేటగిరి-ఏ ఫీజు రూ.35 వేలుగా నిర్ధారిస్తే, కేటగిరి-బీ కోటా ఫీజు రూ.70 వేలు.. అంటే రెట్టింపు ఫీజు కానుంది. పూర్తి ఫీజు రీయింబర్‌మెంట్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కమిషన్ 2 రకాల ఫీజులను తెరమీదికి తెచ్చినట్టు తెలుస్తోంది. ఈ నెల 4 నుంచి ఇంజనీరింగ్ కాలేజీల తనిఖీ కొనసాగుతోంది. ఇప్పటి వరకు దాదాపు 150 ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలు పూర్తయ్యాయి. వీటిలో సింహభాగం కాలేజీలు కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి నడుస్తున్నట్లు కమిషన్ అంచనాకు వచ్చినట్లు సమాచారం. కేవలం విద్య కోసం పెట్టిన ఖర్చును బట్టి చూస్తే ప్రస్తుతం ఉన్న ఫీజులను తగ్గించాల్సిన పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. శాస్త్రీయంగా చూస్తే 90% ఇంజనీరింగ్ కాలేజీలకు కనీస ఫీజునే నిర్ధారించే అవకాశం ఉంది. కాగా తనిఖీలను ఈ నెల 28తో పూర్తి చేసి, మార్చి 3-4 తేదీల్లో ట్యూషన్ ఫీజులను ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కమిషన్ భావిస్తోంది.

## జగన్ మీడియాపై చర్య తీసుకోండి

- ▸ బాబు పీఏ ఇంట్లో ఐటీ దాడుల్లో 2వేల కోట్లు దొరికాయని తప్పుడు కథనాలు
- ▸ ప్రెస్ కౌన్సిల్, ఎడిటర్స్ గిల్డ్‌కు యనమల లేఖలు

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న టీడీపీ పైన, పార్టీ నాయకులపైనా అసత్య వార్తలు ప్రచురిస్తున్న జగన్ పత్రిక, చానల్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కోరారు. ఈ మేరకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ జస్టిస్ ప్రసాద్, ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడు శేఖర్‌గుప్తాలకు బుధవారం ఆయన విడివిడిగా లేఖలు రాశారు. "ఈ నెల 14వ తేదీన 'మచ్చుకు రూ.2వేల కోట్లు.. చంద్రబాబు కొండంత అవినీతిలో గోరంత వెలుగు. తెలుగుదేశం అధినేత పీఏపై జరిగిన దాడుల్లో బయటపడ్డ రూ.2వేల కోట్ల భాగోతం' అన్న కథనం రాశారు. 15వ తేదీన 'ఆంధ్రా అనకొండ. చంద్రబాబు దోపిడీ పర్వంలో స్వల్పభాగమే వెలికితీసిన ఐటీ శాఖ' అంటూ మరో కథనం రాశారు. ఈ రెండు వార్తల్లోని అంశాలు పూర్తిగా అసత్యాలు" అని తెలిపారు.

# బాబు భద్రతపై గందరగోళం

- ▸ పోలీసు శాఖలోనే తలోమాట.. సెక్యూరిటీ తగ్గిస్తున్నామన్న నిఘా ఐజీ
- ▸ 58 మంది సిబ్బందికే పరిమితమంటూ చంద్రబాబు సహాయకుడికి లేఖ
- ▸ అలాంటిదేమీ లేదన్న డీజీపీ.. 183 మందితో భద్రత ఇస్తున్నామని వెల్లడి
- ▸ భిన్న ప్రకటనలపై తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు చంద్రబాబు. గతంలో ప్రతిపక్ష నేతగా పదేళ్లు ఉన్నారు. ప్రస్తుతం అదే పదవిలో కొనసాగుతున్నారు. సీఎంగా ఉన్న సమయంలో మావోయిస్టుల దాడి నుంచి ప్రాణాలతో తప్పించుకున్న ఆయనకు.. కేంద్రం బ్లాక్ క్యాట్ కమేండోలతో రక్షణ కల్పిస్తోంది. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో చంద్రబాబు ఒక్కరికే ఆ స్థాయి భద్రత ఉంది. అలాంటి నాయకుడికి జగన్ ప్రభుత్వం సెక్యూరిటీ తగ్గించేసింది. ఆయనకు 150 మందికి పైగా సిబ్బందితో భద్రత కల్పిస్తున్నామని.. అంత మంది అవసరం లేదని పోలీసు శాఖ చెబుతోంది. అందుకు అనుగుణంగా ఇంటెలిజెన్స్ విభాగం ఐజీ ఇక నుంచి ఆయనకు 58 మందితో మాత్రమే భద్రత ఇస్తామంటూ.. కుదించిన సిబ్బంది వివరాలతో చంద్రబాబు సహాయకుడికి ఏకంగా లేఖ రాశారు. దీనిపై టీడీపీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేయడంతో ప్రతిపక్ష నేతకు సెక్యూరిటీ తగ్గించలేదని, ఆంధ్ర, తెలంగాణల్లో కలిపి మొత్తం 183 మందితో రక్షణ కల్పిస్తున్నామని డీజీపీ గౌతమ్ సవాంగ్ ప్రకటించారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం అధిపతి లేఖకు, పోలీసు బాస్ ప్రకటనకు పొంతన లేకపోవడంతో చంద్రబాబు సెక్యూరిటీపై ఇప్పుడు గందరగోళం ఏర్పడింది.

#### కుదింపు.. తగ్గింపులు

ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చేవారు రాజకీయ ప్రత్యర్థులతోపాటు శత్రువులను కూడా కలిగి ఉంటారు. ముఖ్యంగా రాయలసీమ, పల్నాడు ప్రాంతానికి చెందిన వారిలో ఎక్కువ మంది నేతల ప్రాణాలకు ముప్పు ఉంటుంది. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్రంలో మావోయిస్టులను అణచివేశారు. ఫ్యాక్షన్‌పై ఉక్కుపాదం మోపడంతో పాటు ఎర్రచందనం స్మగ్లర్లపై కఠినంగా వ్యవహరించారు. దీంతో ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని గతంలో వెలువడిన ప్రకటనలు, జరిగిన దాడుల ఆధారంగా పోలీసులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రక్షణ కల్పించేవారు. అయితే జగన్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసిందన్న ఆరోపణలున్నాయి. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న మాజీ మంత్రులు జేసీ దివాకర్‌రెడ్డి, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులకు భద్రత తగ్గించగా.. కాల్వ శ్రీనివాసులు, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు సహా పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ తొలగించింది. దీనిపై నిరసన, అభ్యంతరాలు వ్యక్తమైనా ప్రభుత్వం పట్టించుకోలేదు. చంద్రబాబు కుమారుడు లోకేశ్‌కూ ఇటీవల భద్రత కుదించింది. ఇప్పుడు చంద్రబాబు వంతు.

#### పార్టీ ఏదైనా...

రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు కొన్నాళ్లు అధికారం, మరి కొన్నాళ్లు ప్రతిపక్షంలో ఉంటారు. ప్రజా సేవలో ఉన్న వ్యక్తులు, నేతలను రక్షించే బాధ్యత పోలీసు శాఖపై ఉంటుంది. ప్రభుత్వాలు మారినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రజా సేవకుల ప్రాణాలకు కోరి ముప్పు కలిగించినట్లే. గతంలో తనకు ప్రాణహాని ఉందని మాజీ మంత్రి పరిటాల రవీంద్ర ఎన్నిసార్లు ప్రకటన చేసినా 2005లో అప్పటి వైఎస్ ప్రభుత్వం ఆయనకు భద్రత తగ్గించింది. చివరకు ప్రత్యర్థుల చేతిలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు చంద్రబాబులాంటి వారి రక్షణే ప్రశ్నార్థకమైతే.. తమలాంటి వాళ్ల పరిస్థితేంటని ఇతర నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# కంభళా వీరులు

## బోల్ట్ కంటే మిన్నగా పరుగులు.. మొన్న శ్రీనివాస.. నేడు నిషాంత్



- కంబళ పోటీల్లో రికార్డుల మోత
- బోల్ట్ వరల్డ్ రికార్డు టైమింగ్ బ్రేక్
- సోషల్ మీడియాలో ట్రెండింగ్
- గ్రామీణ క్రీడకు అంతర్జాతీయ గుర్తింపు

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'కంబళ'... పరుగుల ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్న పేరిది! బెంగళూరులో జరిగే ఈ సంప్రదాయ దున్నపోతుల పోటీలో శ్రీనివాస గౌడ్ అనే యువకుడు స్ప్రింట్ దిగ్గజం ఉసేన్ బోల్ట్‌ను మించిన వేగంతో పరిగెత్తి ఔరా అనిపిస్తే.. తాజాగా బజగోళి జోగిబెట్టు ప్రాంతానికి చెందిన నిషాంత్ శెట్టి అనే మరో యువకుడు ఆ రికార్డును బ్రేక్ చేసి మరో సంచలనానికి తెరలేపాడు. శ్రీనివాస 143 మీటర్ల దూరాన్ని 13.68 సెకన్లలో పరిగెత్తితే.. నిషాంత్ ఇదే దూరాన్ని 13.62 సెకన్లలో పూర్తి చేశాడు. ఈ ఇద్దరి వేగాన్ని 100 మీటర్లతో పోల్చినపుడు ఒలింపిక్స్‌లో దిగ్గజ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ నెలకొల్పిన ప్రపంచ రికార్డు (9.58 సెకన్లు) టైమింగ్ కంటే తక్కువ. అంటే శ్రీనివాస గౌడ 100 మీటర్లను 9.55 సెకన్లలో పూర్తిచేస్తే.. నిషాంత్ 9.51 సెకన్లలోనే దాన్ని అధిగమించినట్లన్నమాట! అలాగే ఆనంద్ (9.57), సురేశ్ శెట్టి (9.57) అనే మరో ఇద్దరు కూడా బోల్ట్ టైమింగ్‌లోపే 100 మీటర్ల రేసును పూర్తిచేయడం విశేషం. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సింథటిక్ ట్రాక్‌పై నిర్వహించే రేసుతో... బురదలో నిర్వహించే ఇలాంటి సంప్రదాయ క్రీడను పోల్చడం సరైనదా.. కాదా అనే అంశాన్ని పక్కనబెడితే. శ్రీనివాస గౌడ, నిషాంత్ శెట్టి పరిగెత్తిన విధానం చూసి స్ప్రింట్ కింగ్ బోల్ట్‌ను మించిన మొనగాళ్లంటూ సోషల్ మీడియాలో బ్రహ్మరథం పడుతున్నారు.

**100 మీటర్లలో ఎవరెలా..**

| పేరు | 100 మీ.రికార్డు | పరిగెత్తిన దూరం |
|---|---|---|
| ఉసేన్ బోల్ట్ | 9.58 సెకన్లు | -- |
| శ్రీనివాస గౌడ | 9.55 సెకన్లు | 143 మీటర్లు (13.68) |
| నిషాంత్ శెట్టి | 9.51 సెకన్లు | 143 మీటర్లు (13.62) |

### ● జానపద క్రీడ కంబళ

కర్ణాటక కోస్తా తీరంలో కంబళ ఒక జానపద క్రీడ. బలిష్టంగా ఉండే దున్నపోతులను బురద నేలల్లో పరుగెత్తించి వాటితో పాటే పరుగెత్తే ఈ క్రీడ దక్షిణ కన్నడ, ఉడిపి జిల్లాల్లో బహుళ ప్రాచుర్యం పొందింది. జానపద నేపథ్యం కల్గిన కంబళ కోస్తారైతుల జీవితాల్లో విడదీయరాని భాగమైంది. పంట కోతల అనంతరం రైతులు వినోదం కోసం దీన్ని ఎన్నో సంవత్సరాలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. రెండు బలిష్ఠమైన దున్నపోతుల మెడలకు తాడు కట్టి వాటిని పరుగెత్తించడం ఈ క్రీడలో ప్రధానాంశం. కంబళకు వందల ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉంది. నవంబరు, డిసెంబరు అనంతరం చలికాలంలో కోస్తాలో కంబళ పోటీలు ప్రారంభమై మార్చి చివరి వరకు జరుగుతుంటాయి. పోటీలను చూసేందుకు వేల సంఖ్యలో రైతులు గుమిగూడుతుంటారంటే దీని ప్రాచుర్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

### ● పేరెలా వచ్చిందంటే..

తుళు భాషలో కంప అంటే బురద లేదా మురికి అనే అర్థం. బురద నేలలో దున్నపోతులను పరుగులు తీయిస్తారు కాబట్టి కాలక్రమంలో ఇది కంబళగా మారిందని చరిత్రకారులు చెబుతున్నారు. కోతల అనంతరం బీడుబడిన, ఉపయోగించని పొలాలనే ఈ పోటీ కోసం ఎంచుకుంటారు. 200 మీటర్ల మేరకు మార్గాన్ని ఇసుక వేసి జారిపోకుండా సిద్ధం చేస్తారు. కంబళకు రకరకాల పేర్లు ఉన్నాయి. ఒక్క దున్నపోతుతో జరిపే పోటీని ఒంటిగద్దె కంబళ, రెండు దున్నపోతులతో పోటీని జోడిగద్దె కంబళ, సూర్యచంద్ర, లవకుశ, జయవిజయ, విజయవిక్రమ, వీరవిక్రమ ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు. నేత్రావతి ఫల్గుణి నదుల పేర్లతోనూ వీటిని పిలుస్తారు. కంబళలో పాల్గొనేందుకు బలిష్టమైన ఆరోగ్యవంతమైన దున్నపోతులను ఎంపిక చేసి వాటికి నాణ్యమైన గడ్డి తినిపిస్తారు. నూనెతో వారానికోసారి మర్దన చేయిస్తారు. పోటీలు ప్రారంభమయ్యే రోజు ముందుగా వీటితో రిహార్సల్స్ నిర్వహిస్తారు.



#### పోటీల్లోనూ రకాలు

**కంబళ** పోటీలు కూడా పలురకాలుగా ఉంటాయి. రెండు దున్నపోతుల మెడలకు తాళ్లు కట్టి వాటిని పట్టుకొని పరుగులు దీసే పోటీ ఒకరకం కాగా రెండు దున్నలకు నాగలి కట్టి పరుగులు పట్టించేది మరోరకం. ఇదిలావుండగా వేగంగా పరుగెడుతున్న దున్నపోతులను మధ్యలో అడ్డుకోవడం మరోరకమైన పోటీ. తమిళనాడులో దీనిని జల్లికట్టు అని కూడా పిలుస్తారు. అయితే ఈ రెండింటికీ బాగా వ్యత్యాసం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.


జెమీమా రోడ్రిగ్స్


టెస్టు ట్రోఫీతో కివీస్ - భారత్ కెప్టెన్లు విలియమ్సన్, విరాట్

# మాదే సంతోషకర జట్టు

## స్మృతి మంధాన



**సిడ్నీ:** తాజా టీ20 ప్రపంచకప్ టోర్నీలో భారత్ గట్టి పోటీదారే కాదు.. అత్యంత సంతోషకర జట్టుకూడానం టోంది స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన. యువ ఆటగాళ్లతో నిండిన భారత మహిళల జట్టు సగటు వయస్సు 23లోపే ఉండడం విశేషం. అందుకే ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉంటామని చెబుతోంది. ఈ విషయంలో తమకు ఒక్క థాయ్‌లాండ్ కాస్త పోటీ ఇవ్వచ్చని సరదాగా తెలిపింది. 'సరదాగా ఎలా ఉండాలో మా బృందానికి తెలుసు. మేం నృత్యాలతో పాటు పాటలు కూడా పాడతాం. ఈ టోర్నీలో మాదే అత్యంత సంతోషకర జట్టని నా అభిప్రాయం. ఎందుకంటే మా వయస్సులో సరదాలే కదా ఉండేది. ఒకవేళ అలా లేకుంటే మాలో ఏదో సమస్య ఉన్నట్టే. గత ఏడాదిన్నరగా మా జట్టు ఇలాగే ఉంది. ఇంతకుముందేమో కానీ ఇప్పుడు టీనేజర్లు జట్టులోకి వచ్చాక మాలో కూడా సరికొత్త ఉత్సాహం వచ్చేసింది. ఇక జెమీమా రోడ్రిగ్స్ సందడి చాలా ఎక్కువగా ఉంటుంది. తను మంచి గిటారిస్టు కూడా' అని 23 ఏళ్ల స్మృతి పేర్కొంది.

# అనామకుల నుంచి.. ఫేవరెట్స్ వరకు

**ఆస్ట్రేలియాలో జరగబోయే మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఫేవరెట్స్ ఎవరు? అంటే అందులో కచ్చితంగా భారత జట్టు పేరుంటుంది. తొలి రెండు టోర్నీల్లో అనూహ్యంగా ఆడినా ఆ తర్వాత క్రమంగా వెనక్కివెళ్లింది. అప్పట్లో టీమిండియా గురించి స్వదేశంలోనూ ఎవరూ పట్టించుకోని పరిస్థితి. కానీ మనకూ మంచి రోజులు వస్తాయనే ధీమాతో ఆత్మవిశ్వాసాన్ని మాత్రం కోల్పోలేదు. దీనికి తోడు జట్టులోని పలువురు స్టార్ బ్యాట్స్‌వుమెన్ దూకుడైన ఆటతో అందరి దృష్టినీ తమ వైపునకు తిప్పుకోగలిగారు. దీంతో భారత్ ప్రస్తుతం ప్రత్యర్థి జట్లకు సవాల్ విసరగలిగే స్థాయికి చేరింది. ఈనేపథ్యంలో ఇప్పటిదాకా జరిగిన టీ20 మెగా టోర్నీలో భారత జట్టు ప్రస్థానంపై ఓసారి దృష్టి సారిద్దాం..**

## టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళల ప్రస్థానం


హర్మన్‌ప్రీత్

**మ**హిళల క్రికెట్‌లో టీ20 ప్రపంచకప్ 2009లో ఆరంభమైంది. ఇంగ్లండ్‌లో పురుషుల టోర్నీకి సమాంతరంగా ఈ ఈవెంట్‌ను నిర్వహించారు. జులన్ గోస్వామి నేతృత్వంలో భారత జట్టు బరిలోకి దిగింది. ఆ టోర్నీలో కేవలం 8 జట్లు పాల్గొనగా నాలుగేసి చొప్పున రెండు గ్రూపులుగా విభజించారు. టాప్-2 టీమ్స్ నేరుగా సెమీస్‌కు వెళ్లాయి. ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్థాన్‌లతో భారత్ గ్రూప్ దశలో ఆడింది. అయితే తొలి పోరులో ఇంగ్లండ్ చేతిలో పది వికెట్ల తేడాతో ఓడిన భారత్ ఆ తర్వాత పాక్‌తో చావోరేవో మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. ఒత్తిడిని తట్టుకుంటూ పాక్‌ను కేవలం 75 పరుగులకే పరిమితం చేసిన భారత్ అటు లంకను కూడా ఓడించి సెమీస్‌కు అర్హత సాధించింది. అక్కడ మాత్రం పటిష్ఠ కివీస్ చేతిలో పరాజయం పాలైంది. ఓవరాల్‌గా ఎలాంటి అంచనాలు లేకున్నా మెరుగైన ప్రదర్శననే కనబరిచింది.


జులన్ గోస్వామి

### 2010- మళ్లీ సెమీస్‌లోనే బోల్తా..

ఎనిమిది జట్లతో తొలి వరల్డ్‌కప్‌లో ఆడించిన ఫార్మాట్‌నే ఇక్కడా కొనసాగించారు. ఈసారి భారత్ గ్రూపులో శ్రీలంక, పాక్‌తో పాటు న్యూజిలాండ్‌ను చేర్చారు. దీంతో తొలి మ్యాచ్‌లో కివీస్ చేతిలో 10 వికెట్ల తేడాతో ఓటమి ఎదురైనా ఆ తర్వాత పాక్, శ్రీలంకలపై గెలిచి వరుసగా రెండోసారి కూడా సెమీస్‌కు చేరగలిగింది. కానీ ఈసారీ సెమీస్ అడ్డంకిని అధిగమించలేకపోయింది. ఏడు వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో పరాజయం పాలై నిష్క్రమించాల్సి వచ్చింది. స్పిన్నర్ దయానా డేవిడ్ తొమ్మిది వికెట్లతో టోర్నీ టాప్ బౌలర్‌గా నిలవడం ఊరటనిచ్చింది.

### 2012- ఒక్క విజయమూ లేదు

శ్రీలంకలో జరిగిన ఈ టోర్నీ భారత మహిళల జట్టుకు చేదు ఫలితాన్నే ఇచ్చింది. మిథాలీ రాజ్ నేతృత్వంలో జట్టు తొలిసారి బరిలోకి దిగింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, పాకిస్థాన్ జట్లతో పోటీపడగా ఈసారి కనీసం గ్రూప్ దశను కూడా దాటలేకపోయింది. ఆసీస్ చేతిలో ఎనిమిది వికెట్ల తేడాతో ఓడగా.. ఇంగ్లండ్ జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో చిత్తు చేసింది. పూనమ్ రౌత్ ఈ రెండు మ్యాచ్‌ల్లో మెరిసినా ఫలితం లేకపోయింది. ఇక గ్రూప్ చివరి పోరులో పాక్‌తోనైనా ఓదార్పు విజయం దక్కుతుందనుకుంటే 98 పరుగులను కూడా ఛేదించలేక ఒక వికెట్ తేడాతో ఓడాల్సి వచ్చింది.

### 2014- మిథాలీ మెరిసినా..

**టో**ర్నీ చరిత్రలో ఈసారి జట్ల సంఖ్య 8 నుంచి 10కి చేరింది. ప్రతీ గ్రూప్‌లో తొలి రెండు జట్లకు సెమీస్ బెర్త్ దక్కగా మూడో స్థానంలో నిలిచిన వారిని క్వాలిఫికేషన్ మ్యాచ్ ఆడించారు. ఇందులో గెలిచిన జట్టును వచ్చే ఎడిషన్‌లో నేరుగా ఆడించారు. ఇక గ్రూప్ దశలో ఇంగ్లండ్, విండీస్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో ఆడిన భారత్ రెండు మ్యాచ్‌లే నెగ్గి మూడో స్థానంలో నిలిచింది. కానీ పాక్‌పై అర్హత మ్యాచ్‌లో గెలిచి పరువు కాపాడుకుంది. మిథాలీ రాజ్ జట్టు తరపున అత్యధిక పరుగులు (208) సాధించింది.


మిథాలీ

**మహిళల టీ20 ప్రపంచకప్ మరొక్క రోజులో..**

### 2016-స్వదేశంలో జరిగినా..

స్వదేశంలో జరిగిన ఈ మెగా టోర్నీలో భారత జట్టు తీవ్రంగా నిరాశపరిచింది. ఇంగ్లండ్, విండీస్, పాక్, బంగ్లాదేశ్‌లను కలిగిన తమ గ్రూపులో మిథాలీ సేన నాలుగో స్థానంలో నిలిచింది. తొలి మ్యాచ్‌లో బంగ్లాపై గెలిచినా ఆతర్వాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడింది. ఈటోర్నీలో అటు మిథాలీ కేవలం 78 పరుగులే సాధించడం జట్టు విజయాలపై ప్రభావం చూపింది.

### 2018-దూకుడుతో పాటు వివాదాలు...

తమ క్రికెట్ చరిత్రలో ఆరో టీ20 ప్రపంచకప్‌ను భారత్ అత్యంత విజయవంతంగా ముగించింది. స్వదేశంలో జరిగిన టోర్నీలో దారుణ వైఫల్యం తర్వాత జట్టులో అనేక మార్పులు జరిగాయి. కొత్త కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఆధ్వర్యంలో యువ రక్తంతో జట్టు బరిలోకి దిగింది. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ దూకుడైన ఆటతో భారత్ ఈ టోర్నీలో సరికొత్తగా కనిపించింది. ఆసీస్, కివీస్, పాక్, ఐర్లాండ్‌లతో కూడిన తమ గ్రూపులో ప్రతీ మ్యాచ్‌ను గెలుస్తూ సెమీస్‌కు చేరింది. ఈ జోరు చూస్తే టైటిల్ ఖాయంగా అనిపించినా ఇంగ్లండ్ చేతిలో ఓడి నిరాశపరిచింది. అయితే వెటరన్ ప్లేయర్ మిథాలీ రాజ్ గ్రూప్ దశలో ఆడిన చివరి రెండు మ్యాచ్‌ల్లో అర్ధసెంచరీలు చేసినా సెమీస్‌కు ఆమెను పక్కకు తప్పించడం పెద్ద దుమారాన్నే రేపింది. ఆమె లేకపోవడం మ్యాచ్ ఫలితంపై కూడా ప్రభావం చూపింది.

*(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)*

# టెస్టులే సుప్రీమ్

**న్యూజిలాండ్‌లో భారత పర్యటన చివరి అంకానికి మరో రోజులో తెరలేవనుంది.. తొలుత ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేయగా అనంతరం పుంజుకొన్న ఆతిథ్య జట్టు మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో సొంతం చేసుకుంది.. అంటే ఇరు జట్లు చెరో సిరీస్‌లో ఆధిపత్యం ప్రదర్శించాయి.. ఇక రెండు టెస్టుల సిరీస్‌లో మొదటి మ్యాచ్ శుక్రవారం వెల్లింగ్టన్‌లో ప్రారంభం కానుంది.. ఇప్పటివరకు ఆడింది ఒక ఎత్తయితే రాబోయే రెండు మ్యాచ్‌ల్లో రాణించడం మరో ఎత్తు.. వరల్డ్ టెస్టు చాంపియన్‌షి‌ప్‌లో ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ అజేయంగా నిలిచిన భారత్ 360 పాయింట్లతో టాప్‌లో ఉంది.. ఐసీసీ నిర్వహించే అన్ని టోర్నీలలో టెస్టు చాంపియన్‌షిప్ అత్యున్నతమని కెప్టెన్ కోహ్లీ అనడం చూస్తే ఈ సిరీస్‌లో భారత జట్టు మరింత దూకుడు కనబర్చడం ఖాయం..**

## మిగతా అన్ని టోర్నీలు దాని తర్వాతే: కెప్టెన్ కోహ్లీ

**భారత్-కివీస్ తొలి టెస్టు**

**శుక్రవారం ఉదయం 4 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్ 1లో...**

**వెల్లింగ్టన్:** వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌నకు కెప్టెన్ కోహ్లీ అత్యున్నత రేటింగ్ ఇచ్చాడు. వన్డే, టీ20 వరల్డ్‌కప్ తదితర టోర్నీలను ఐసీసీ నిర్వహిస్తున్నా.. జెంటిల్మన్ క్రీడకు అసలు సిసలు రూపమైన టెస్టు మ్యాచ్‌లను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఐసీసీ ప్రవేశపెట్టిన 'చాంపియన్‌షిప్' అత్యున్నతమని తెలిపాడు. పరిమిత ఓవర్లలో రెండు కొత్త టోర్నీలను తీసుకురావాలని ఐసీసీ ఆలోచిస్తున్న తరుణంలో కోహ్లీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 'టెస్టు చాంపియన్‌షిప్ కొనసాగాలి. మిగతా ఐసీసీ టోర్నమెంట్లన్నీ దీని తర్వాతే. అన్ని జట్లు కూడా లార్డ్స్‌లో జరిగే ఫైనల్లో ఆడాలని పట్టుదలగా ఉన్నాయి. అందువల్ల టెస్టు చాంపియన్‌షిప్ ఐసీసీ టోర్నీలన్నింటికంటే సుప్రీం. సాధ్యమైనంత త్వరగా మేం ఫైనల్‌కు క్వాలిఫై కావడమే కాదు టెస్ట్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకోవాలనుకుంటున్నాం' అని బుధవారం చెప్పాడు. దక్షిణాఫ్రికా-ఇంగ్లండ్ సిరీస్ హోరాహోరీగా సాగడంతో.. భారత్-న్యూజిలాండ్ రెండు టెస్టులు సైతం అదే స్థాయిలో కొనసాగే అవకాశాలున్నాయని విరాట్ అభిప్రాయపడ్డాడు.

### కొత్తగా చాంపియన్స్ కప్‌లు

వన్డే, టీ20 టోర్నీలలో చాంపియన్స్ కప్‌ను ప్రవేశపెట్టాలని ఐసీసీ భావిస్తోంది. 2023-2031 సైకిల్‌లో ఈ టోర్నీలు నిర్వహించాలని ఆలోచిస్తోంది. గతేడాది జరిగిన వన్డే వరల్డ్ కప్ తరహాలోనే టీ20 చాంపియన్స్ కప్ నిర్వహించాలనుకుంటోంది. అంటే.. 10 జట్లు 48 మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఇక వన్డే చాంపియన్స్ కప్‌లో టాప్-6 జట్లు 16 మ్యాచ్‌ల్లో ఢీకొంటాయి. 2024, 2028లలో టీ20... 2025, 2029లలో వన్డే చాంపియన్స్ కప్‌లను జరపాలని ఐసీసీ ప్రణాళికలు రచిస్తోంది.

### తుది జట్టులో ఇషాంత్, పృథ్వీ !


ఇషాంత్ శర్మ

మొదటి టెస్టు తుది జట్టులో సీనియర్ పేసర్ ఇషాంత్, ఓపెనర్ పృథ్వీ షా ఉంటారని కోహ్లీ సూచనప్రాయంగా వెల్లడించాడు. అలాగే భారత జట్టు బుధవారం నాటి సాధన తీరును పరిశీలిస్తే వికెట్ కీపర్‌గా వృద్ధిమాన్ సాహా వైపే జట్టు యాజమాన్యం మొగ్గుచూపే అవకాశాలున్నాయి. ఇషాంత్, బుమ్రా, షమి ముగ్గురు స్పెషలిస్ట్ పేసర్లుగా, అశ్విన్ స్పిన్నర్‌గా బరిలోకి దిగడం దాదాపు ఖాయమే. విదేశాల్లో ఆరో నెంబర్‌లో తెలుగు ఆటగాడు హనుమ విహారికి ప్రాముఖ్యం ఇస్తోంది. దాంతో ఐదో బౌలర్ బాధ్యతలను అతడు పంచుకోనున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా అశ్విన్ ఖాయమే అయినా.. ఆల్‌రౌండ్ నైపుణ్యం రీత్యా రవీంద్ర జడేజాను విస్మరించలేని పరిస్థితి. రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో పాదానికి గాయమై మూడు వారాలు ఆటకు దూరంగా ఉన్న ఇషాంత్ సాధనలో పూర్తిస్థాయిలో బౌలింగ్ చేయడమేకాదు..పేస్, బౌన్స్‌తో బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టాడు. 'పాదం గాయానికి ముందు ఎలా బౌలింగ్ చేశాడో ఇప్పుడూ ఇషాంత్ అలాగే బంతులు వేస్తున్నాడు. సరైన బంతులు సంధిస్తున్నాడు. గతంలో అతడు ఇక్కడ టెస్ట్ క్రికెట్ ఆడాడు. ఆ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగం' అని విరాట్ అన్నాడు. న్యూజిలాండ్ మొత్తం పేస్ బౌలర్లతోనే బరిలోకి దిగే అవకాశాలున్నాయి. భారత్ మాత్రం ఒక స్పిన్నర్, నలుగురు పేసర్ల సంప్రదాయాన్ని కొనసాగించనుంది.


పృథ్వీ షా

### మూడేళ్లు భారం భరించాల్సిందే..

మూడు ఫార్మాట్లలో ఆడడం భారమేనని, అయినా మరో మూడేళ్లపాటు దానిని భరించాల్సిందేనని విరాట్ తెలిపాడు. ఆ కాలంలో రెండు టీ20, ఓ వన్డే ప్రపంచకప్‌లు జరగనున్నాయి. 'నేను విస్తృత స్థాయిలో ఆలోచిస్తున్నా. ఇప్పటి నుంచి మూడేళ్లపాటు నేను తీవ్రంగా శ్రమించాల్సిందే. ఆ తర్వాతే మన చర్చ విభిన్నంగా ఉంటుంది' అని అన్నాడు. అంటే మూడు వరల్డ్‌కప్‌ల తర్వాతే మూడు ఫార్మాట్లలో రెండింటిలోనే ఆడే విషయమై కోహ్లీ నిర్ణయం తీసుకోనున్నాడన్నమాట.

# ఆంధ్ర 'రంజీ' అద్భుతం చేసేనా..?

## నేటి నుంచి సౌరాష్ట్రతో క్వార్టర్స్ మ్యాచ్


ఆంధ్ర కెప్టెన్ భరత్

**ఒంగోలు:** రంజీ ట్రోఫీలో ఆంధ్ర అంచనాలకు మించి రాణిస్తోంది. ట్రోఫీ చరిత్రలో నాలుగోసారి నాకౌట్ బెర్త్ దక్కించుకున్న ఆంధ్ర ఈసారి మెరుగైన ప్రదర్శనతో సెమీస్ చేరి సరికొత్త అధ్యాయాన్ని లిఖించాలనుకుంటోంది. గురువారం నుంచి జరిగే క్వార్టర్స్ పోరులో గత సీజన్ రన్నరప్ సౌరాష్ట్రతో ఆంధ్ర అమీతుమీ తేల్చుకోనుంది. టోర్నీ ఆరంభంలో ఆకట్టుకొన్న ఆంధ్ర.. ఆఖరి రెండు మ్యాచ్‌ల్లో మాత్రం పరాజయాలు చవిచూడడం కొంత కలవరపెట్టే విషయం. లీగ్ దశలో ఆడిన 8 మ్యాచ్‌ల్లో నాలుగింటిలో నెగ్గిన ఆంధ్ర.. రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకుని, రెండింటిలో ఓడింది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ విదర్భతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఆ వెంటనే ఢిల్లీపై నెగ్గి సత్తాచాటింది. మొత్తం 27 పాయింట్లతో ఐదో స్థానంతో నాకౌట్‌కు చేరగలిగింది. హనుమ విహారి న్యూజిలాండ్ పర్యటనలో ఉండడంతో బ్యాటింగ్ కొంత బలహీనంగా కనిపిస్తోంది. అయితే, రికీ భుయ్ ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తుండడం ఊరటనిచ్చే అంశం. విదర్భపై శతకంతో ఆదుకొన్న రికీ.. ఢిల్లీతో మ్యాచ్‌లో మరో సెంచరీతో ఆంధ్రను గెలిపించాడు. పేసర్ కేవీ శశికాంత్ ఈ సీజన్‌లో తనదైన ముద్ర వేశాడు. ఏడు మ్యాచ్‌ల్లో 35 వికెట్లు పడగొట్టడంతో పాటు లోయరార్డర్ బ్యాట్స్‌మన్‌గా విలువైన పరుగులు అందిస్తున్నాడు. ఇక ఆంధ్రతో పోల్చితే సౌరాష్ట్ర బలంగా ఉంది. ఈ సీజన్‌లో ఒక్క ఉత్తరప్రదేశ్ చేతిలోనే సౌరాష్ట్ర పరాజయాన్ని చవిచూసింది. పేసర్ జయ్‌దేవ్ ఉనాద్కట్ ప్రధాన బౌలర్‌గా నిలుస్తున్నాడు. పుజార అందుబాటులో లేకపోవడంతో షెల్డన్ జాక్సన్ ఆ బాధ్యతలను భుజానికెత్తుకోనున్నాడు. ఇతర క్వార్టర్స్ మ్యాచ్‌ల్లో గోవాతో గుజరాత్, ఒడిశాతో బెంగాల్, జమ్ము కశ్మీర్‌తో కర్ణాటక తలపడనున్నాయి.

# తమ్ముడే.. నేను కాదు..!

## 'వెబ్ సిరీస్'పై యువీ క్లారిటీ



**న్యూఢిల్లీ:** వెబ్ సిరీస్‌లో తాను నటిస్తున్నానంటూ వచ్చిన వార్తలను టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఖండించాడు. అందులో తన తమ్ముడు జొరావర్ సింగ్ మాత్రమే నటిస్తున్నాడని స్పష్టతనిచ్చాడు. కాగా, యువీ, అతడి భార్య హాజెల్ కీచ్, తమ్ముడు జొరావర్ ఓ వెబ్‌సిరీస్‌లో యాక్ట్ చేస్తున్నారంటూ వార్తలు గుప్పుమన్నాయి. కానీ, యువీ ట్విటర్ వేదికగా వాటికి తెరదించాడు.



# సానియా జోడీ ఓటమి

**దుబాయ్:** భారత వెటరన్ టెన్నిస్ ప్లేయర్ సానియా మీర్జా జోడీ.. దుబాయ్ ఓపెన్ నుంచి నిష్క్రమించింది. బుధవారం జరిగిన మహిళల ప్రీక్వార్టర్స్ డబుల్స్ మ్యాచ్‌లో సానియా-కరోలిన్ గార్షియా ద్వయం 4-6, 2-6తో సైసై జాంగ్-బార్బరా క్రెజిసికొవా చేతిలో వరుస సెట్లలో పరాజయం పాలైంది.


అషు
ఆదిత్య

# భారత్‌కు మరో మూడు కాంస్యాలు

**ఆసియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్**
**సాయంత్రం 6 గం.నుంచి స్టార్‌స్పోర్ట్స్ ఫస్ట్‌లో...**

**న్యూఢిల్లీ:** ఆసియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ గ్రీకో-రోమన్ స్టయిల్‌లో భారత్‌కు మరో మూడు పతకాలు లభించాయి. అషు, ఆదిత్య కుండూ, హర్దీప్ సింగ్ కాంస్యాలు నెగ్గారు. బుధవారం జరిగిన 67 కిలోల కాంస్య పతక బౌట్‌లో అషు 8-1తో మహమ్మద్ అల్ హసన్ (సిరియా)ను ఓడించాడు. 72 కిలోల మ్యాచ్‌లో ఆదిత్య 8-0తో నవో కుసాకా (జపాన్)పై, 97 కిలోల్లో హర్దీప్ 3-1తో బెక్‌సుల్తాన్ మఖ్మముదోవ్ (కజకిస్థాన్)పై నెగ్గారు. కాగా, 60 కిలోల కాంస్య పోరులో జ్ఞానేందర్ 0-6తో ఇస్లోమ్‌జోన్ బకరమోవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. గ్రీకో-రోమన్‌లో సునీల్ కుమార్ స్వర్ణంతో కలిపి భారత్ ఐదు పతకాలు సాధించింది.

# పురుషాంగాన్ని కొరికిన ఫుట్‌బాలర్‌పై వేటు

**టెర్‌విల్లే (ఫ్రాన్స్) :** మ్యాచ్ అనంతరం జరిగిన ఘర్షణలో ఓ ఆటగాడి పురుషాంగాన్ని కొరికిన అమెచ్యూర్ ఫుట్‌బాలర్‌పై ఐదు సంవత్సరాల వేటు పడింది. ఈశాన్య ప్యారిస్‌కు 200 మైళ్ల దూరంలోని టెర్‌విల్లే పట్టణంలో.. స్థానిక జట్టు ఎస్‌సీ టెర్‌విల్లే-ఏఎస్ సోట్రిచ్ జట్ల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ అనంతరం గొడవ జరిగింది. రెండు జట్ల ఆటగాళ్లు ఘర్షణపడుతుండగా.. టెర్‌విల్లే ఫుట్‌బాలర్ ఒకరు వారిని విడదీసేందుకు ప్రయత్నించాడు. దాంతో సోట్రిచ్ ప్లేయర్.. టెర్‌విల్లే ఆటగాడి పురుషాంగాన్ని కొరకగా అతడికి 12 కుట్లు పడ్డాయి. ఈ ఘటనపై బాధిత ఫుట్‌బాలర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన క్రమశిక్షణ కమిటీ సదరు సోట్రిచ్ ఆటగాడిపై ఐదేళ్ల నిషేధం విధించడంతోపాటు.. సోట్రిచ్ క్లబ్‌కు రూ. 16వేలు జరిమానా విధించింది.


బాధతో విలవిల్లాడుతున్న ఆటగాడు

# ప్రీక్వార్టర్స్‌కు సైనా, శ్రీకాంత్

**బార్సిలోనా స్పెయిన్ మాస్టర్స్**



**బార్సిలోనా:** బార్సిలోనా స్పెయిన్ మాస్టర్స్‌లో భారత ఏస్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ ప్రీక్వార్టర్స్‌కు చేరుకోగా.. హెచ్ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్ ఇంటిముఖం పట్టారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సైనా 21-16, 21-14తో యొవెన్నీ లి (జర్మనీ)ని ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ 23-21, 21-18తో శుభాంకర్ డేపై గెలిచాడు. ప్రణయ్ 18-21, 15-21తో ల్యూ డేరెన్ (మలేసియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. బ్రెజిల్ ప్లేయర్ యొగెర్ కొయలోతో మ్యాచ్‌లో కశ్యప్ 21-9, 18-21, 12-14తో ఉన్న సమయంలో రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. మిక్స్‌డ్‌లో ప్రణవ్ జెర్రీ చోప్రా-సిక్కిరెడ్డి జోడీ 18-21, 21-16, 21-17తో డెన్మార్క్‌కు చెందిన మాథియస్ క్రిస్టియన్‌సెన్-అలెగ్జాండ్రా బోయెపై గెలిచింది.

## కాలువ గట్లు 'ఖాళీ'

**వాటి వెంబడి ఇళ్ల తొలగింపు**

**జలవనరుల శాఖకు సీఎం జగన్ ఆదేశం**

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాలువ గట్లను అందమైన వాకింగ్ ట్రాక్‌లుగా మార్చాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. కాలువల సమీపంలోని ప్రాంతాలను చక్కటి పార్కులుగా మార్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కాలువ గట్లపై ఉన్న ఇళ్లను ఖాళీ చేయించాలన్నారు. కాలువ కట్టలపై సిమెంట్, కాంక్రీట్ వినియోగించకుండా పాత్‌వేలను రాళ్లతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనికి ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి జల వనరుల శాఖ సహా స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గోదావరి, కృష్ణా నది కాలువల శుద్ధిపై జగన్ బుధవారం సమీక్ష నిర్వహించారు. కాలువగట్ల వెంబడి నివసిస్తున్న వారిని అక్కడ నుంచి తరలించాలని ఆదేశించారు. తరలించే సమయంలో ప్రజలను ఎక్కడా ఇబ్బంది పెట్టకూడదన్నారు. ఒకసారి తొలగించాక.. మరెవరూ ఆయా గట్లను ఆక్రమించుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. "కాలువ కట్టలపై ఉన్నవారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి.. వారు ఇళ్లు కట్టుకునేలా చర్యలు తీసుకోవాలి. తాడేపల్లి మునిసిపాలిటీలో ఈ కార్యక్రమాన్ని ముందుగా అమలు చేయాలి. దీనిపై మూడు నెలల్లోగా పూర్తి స్థాయి నివేదికలు ఇవ్వాలన్నారు. కృష్ణా జిల్లాలో రైవస్ కెనాల్, గుంటూరులో కృష్ణా పశ్చిమ కెనాల్, పశ్చిమ గోదావరిలో ఏలూరు కెనాల్, తూర్పు గోదావరిలో జీఈ మెయిన్ కెనాల్, పులివెందుల, విశాఖలో పైలట్ ప్రాజెక్టులుగా దీనిని అమలు చేయాలి. ఈ కార్యక్రమం నాడు-నేడు తరహాలో ఉండాలి" అని జగన్ ఆదేశించారు. కాలువలపై పార్కులు, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే దాతలను ప్రోత్సహించాలన్నారు.

### స్వచ్ఛ నీరే...

సాగు-తాగు కోసం స్వచ్ఛమైన నీటినే అందించాలని, కృష్ణా, గోదావరి నదుల వెంబడి ఉన్న అన్ని నగర, గ్రామీణ ప్రాంతాల్లోని కాలువలను యుద్ధ ప్రాతిపదికన శుద్ధి చేయాలని జలవనరుల శాఖను సీఎం ఆదేశించారు. కాలువల శుద్ధి కోసం ప్రత్యేకంగా ఒక మిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ మిషన్‌లో ప్రభుత్వ శాఖలనూ భాగస్వామ్యం చేయాలని తెలిపారు. రాష్ట్రంలో నదుల ఆధారంగా నిర్మించిన కాలువలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గోదావరి డెల్టా పరిధిలో 10,000 కిలోమీటర్లు, కృష్ణా డెల్టా పరిధిలో 9,800 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయని సీఎంకు అధికారులు తెలిపారు. ఒక్కో కాలువలో ఎంత మురికినీరు కలుస్తుందో.. దాన్ని నివారించేందుకు ఎంత ఖర్చవుతుందో సమాచారం సేకరించాలని సీఎం సూచించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వివరాలు.. బ్యూటిఫికేషన్‌కు అయ్యే ఖర్చు వివరాలపై సీఎం ఆరా తీశారు. విజయవాడ, విశాఖలపై ప్రధానంగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. 18 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. వేస్ట్ కలెక్షన్, డిస్పోజబుల్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశానికి మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా అండ్ గోదావరి కెనాల్స్ డైరెక్టర్ కాటమనేని భాస్కర్, ఆర్థిక, జలవనరులశాఖ, మునిసిపల్, కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## విద్యుత్ కష్టాల నుంచి.. ఐదేళ్లలో గట్టెక్కించాలి

**నాణ్యమైన కరెంటు కొనండి**

**ఇంధన అధికారులకు సీఎం ఆదేశం**



అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ రంగాన్ని ఐదేళ్లలో నష్టాల నుంచి గట్టెక్కించడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఇంధన శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ కార్యదర్శి శ్రీకాంత్, జెన్కో సీఎండీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకు అమ్ముతామంటూ ఎవరైనా ముందుకు వస్తే వారితో ఒప్పందాలు కుదుర్చుకోవాలని.. దీనివల్ల డిస్కమ్‌లపై భారం తగ్గుతుందని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వం తరహాలో కాకుండా సహేతుక ధరలకు ఎవరు అమ్మినా కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన పది వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంటుపై దృష్టి సారించాలని.. దానిని విజయవంతం చేయాలని.. భవిష్యత్‌లో దానిని విస్తరించడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంధన శాఖను నిర్దేశించారు. అలాగే తక్కువ ధరకు అమ్ముతానంటూ ముందుకొచ్చే సౌర, పవన విద్యుదుత్పత్తి సంస్థలను కూడా ప్రోత్సహించాలని.. దీనివల్ల డిస్కమ్‌లకు తక్కువ ధరకే విద్యుత్ లభిస్తుందని.. వాటిపై ఆర్థిక భారమూ తగ్గుతుందని చెప్పారు. జెన్కో థర్మల్ కేంద్రాలకు నాణ్యమైన బొగ్గు లభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బొగ్గు నాణ్యత కలిగి ఉంటే.. ఉత్పత్తి పెరుగుతుందని.. ప్లాంట్ల సామర్థ్యమూ పెరుగుతుందని చెప్పారు. థర్డ్ పార్టీతో బొగ్గు నాణ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీ చేయించాలని ఆదేశించారు. హైడ్రో రివర్స్ పంపింగ్‌పైనా దృష్టి సారించాలని సూచించారు.



## అమెరికా 'ఫెడరల్ సర్క్యూట్ కోర్టు' చీఫ్ జస్టిస్‌గా శ్రీశ్రీనివాసన్

వాషింగ్టన్, ఫిబ్రవరి 19: ప్రముఖ ఇండో-అమెరికన్ జడ్జి పద్మనాభన్ శ్రీకాంత్ శ్రీశ్రీనివాసన్ (52)అమెరికా ఫెడరల్ సర్క్యూట్ కోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. అమెరికాలో సుప్రీంకోర్టు తరువాత అత్యంత శక్తిమంతమైన ఫెడరల్ సర్క్యూట్ కోర్టుకు నాయకత్వం వహిస్తున్న దక్షిణాసియా సంతతికి చెందిన తొలి వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు.

## ఇండియన్-2 సెట్‌లో ప్రమాదం

**ముగ్గురు మృతి... 10 మందికి గాయాలు**



చెన్నై, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విశ్వనటుడు కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక ఇండియన్-2 సినిమా సెట్‌లో బుధవారం రాత్రి ప్రమాదం జరిగింది. ముగ్గురు మృతి చెందగా సుమారు 10 మంది గాయపడ్డారు. చెన్నై శివారు ప్రాంతంలోని పూందమల్లి సమీపంలోని నజరత్‌పేట్‌లో ఉన్న ఈవీపీ ఎస్టేట్ వద్ద ఇండియన్ సినిమా కోసం భారీ సెట్ నిర్మిస్తున్నారు. ఎత్తైన సెట్ నిర్మాణం కోసం ఉపయోగిస్తున్న క్రేన్ కూలి కార్మికులపై పడినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో క్రిష్ణ అనే సహాయ దర్శకుడు సహా ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. సుమారు 10 మంది గాయపడినట్టు తెలుస్తోంది.

# పీపీఏలను ఉల్లంఘిస్తే.. రాష్ట్రాల నుంచే సొమ్ము రికవరీ!

**ప్రభుత్వ ఆస్తుల జప్తు కూడా!!**

**ఇందుకోసం ప్రత్యేక ట్రైబ్యునల్**

**2003 ఇంధన చట్టానికి కేంద్రం సవరణ**

**బిల్లు ముసాయిదా కూడా సిద్ధం**

**జగన్ ప్రభుత్వ తీరు వల్లే ఈ నిర్ణయం?**

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలు ఒప్పందా(పీపీఏ)లను ఉల్లంఘించకుండా రాష్ట్ర ప్రభుత్వాలను కట్టడి చేయాలని కేంద్రం భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని జగన్ ప్రభుత్వం సౌర, పవన విద్యుదుత్పత్తి సంస్థలతో కుదుర్చుకున్న పీపీఏలను పునఃసమీక్షించడంతో అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడులు పెట్టేందుకు స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులు జంకుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి బాసటగా నిలిచి.. వారి పెట్టుబడులను కాపాడేందుకు మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఉల్లంఘిస్తే.. ఆయా రాష్ట్రప్రభుత్వాల నుంచే ప్రాజెక్టు వ్యయం తాలూకు సొమ్మును రికవరీ చేసేలా.. అవసరమైతే ప్రభుత్వ ఆస్తులు జప్తు చేసేలా ఇంధన చట్టాన్ని సవరించనుంది. రాష్ట్రప్రభుత్వాలు గానీ, విద్యుదుత్పత్తి సంస్థలు గానీ పీపీఏలను ఉల్లంఘిస్తే.. వాటిని విచారించేందుకు జాతీయ స్థాయిలో ప్రత్యేక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ముసాయిదా బిల్లు కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక.. సౌర, పవన విద్యుదుత్పత్తి సంస్థల నుంచి గత ప్రభుత్వం అధిక ధరకు కరెంటు కొనుగోలు చేసిందని ఆరోపిస్తూ.. వాటితో కుదుర్చుకున్న పీపీఏలను పునఃసమీక్షించాలని నిర్ణయించారు. తమ పెట్టుబడులకు రక్షణ లేకుండా పోతుందన్న ఆందోళనతో ఆయా సంస్థలు కేంద్రాన్ని ఆశ్రయించాయి. తమ తమ దేశాల ప్రభుత్వాల ద్వారా ఒత్తిడి కూడా తెచ్చాయి. అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిళ్లతో కేంద్రం ఇరకాటంలో పడింది. పీపీఏల పునఃసమీక్షకు వెళ్లొద్దని జగన్ ప్రభుత్వానికి సూచించింది కూడా. కేంద్ర ఇంధన మంత్రి ఆర్.కె.సింగ్ పలు సార్లు లేఖలు రాశారు. అయినప్పటికీ జగన్ ప్రభుత్వం వినిపించుకోలేదు.

### పెట్టుబడులకు రక్షణ కోసం..

జాతీయ స్థాయిలో 2003 ఇంధన చట్టం అమలవుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ చట్టంతో పెట్టుబడిదారులకు సంపూర్ణ రక్షణ లభించడం లేదని మోదీ ప్రభుత్వం భావించింది. సుదీర్ఘ అధ్యయనం చేశాక.. ఈ చట్టాన్ని సవరించి.. ప్రత్యేకంగా సౌర, పవన విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలకు సంపూర్ణ భద్రత కల్పించేలా ప్రత్యేక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఇంధన మంత్రి ఆర్.కె.సింగ్ కొద్దిరోజుల క్రితం జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. విద్యుదుత్పత్తి సంస్థలతో రాష్ట్రప్రభుత్వాలు ఒకసారి ఒప్పందం చేసుకున్నాక వాటిని తు.చ. తప్పకుండా అమలు చేయాల్సిందేనని.. లేదంటే ఉల్లంఘన కిందకు వస్తుందని స్పష్టం చేశారు. అప్పుడు ట్రైబ్యునల్ రంగప్రవేశం చేస్తుందని.. ప్రాజెక్టుకైన వ్యయం రికవరీకి రాష్ట్రాలను ఆదేశిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు జప్తు చేసే అధికారాన్ని ట్రైబ్యునల్‌కు కట్టబెడుతూ బిల్లు ముసాయిదా ఇప్పటికే సిద్ధమైందని.. త్వరలోనే పార్లమెంటు ముందుకు రానుందని కేంద్ర ఇంధన శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

### విద్యుత్‌పై శ్వేతపత్రం ఇవ్వాలి: జేఏసీ

విద్యుత్ రంగంపై తక్షణమే ఇంధన శాఖ శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పవర్ సెక్టార్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో విద్యుత్ సంస్థల పరిరక్షణకు ఈ కమిటీ బుధవారం ఏర్పడింది. ఛైర్మన్‌గా పి.చంద్రశేఖర్, కన్వీనర్‌గా ఎం.వేదవ్యాసరావు, కోఛైర్మన్లుగా కేవీ శేషారెడ్డి, ఎ.శ్రీనివాసకుమార్, కో కన్వీనర్‌గా ఎన్ లక్ష్మణరావు, వైస్‌ఛైర్మన్లుగా ఎస్.ప్రసాద్, కె.మోహనరావు, ట్రెజరర్‌గా ఎంవీవీ ప్రసాద్ ఎంపికయ్యారు.

## కోర్టుకు హామీ ఇచ్చి.. చెల్లించరా?

**ఇలాగైతే బాధ్యుల్ని జైలుకు పంపుతాం**

**పీపీఏల వ్యవహారంలో హైకోర్టు హెచ్చరిక**

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పవన, సౌర విద్యుదుత్పత్తి సంస్థలకు 4 వారాల్లోగా బకాయిలు చెల్లిస్తామని కోర్టుకు ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం ధిక్కారం కిందకే వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు బాధ్యులైన డిస్కం అధికారుల్ని జైలుకు పంపాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇప్పటి వరకు ఏఏ సంస్థలకు ఎంతెంత చెల్లించారు? ఇంకెంత చెల్లించాలన్న వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు చీఫ్‌జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థలకు నాలుగు వారాల్లోగా బకాయిలు చెల్లిస్తామన్న డిస్కంలు ఇంకా చెల్లించలేదని సంస్థలు కోర్టు దృష్టికి తెచ్చాయి. దీనిపై ఆగ్రహం చెందిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని డిస్కంలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం మరోమారు ధర్మాసనం ముందు విచారణ జరగ్గా.. ఏపీఈపీడీసీఎల్ తరఫున ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సంతోషరావు అఫిడవిట్ దాఖలు చేశారు. హామీ మేరకు బకాయిలు చెల్లించలేకపోయినందుకు క్షమాపణలు కోరారు. తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉండటం వల్ల ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోవడం కష్టంగా మారిందని, అందుకే బకాయిలు చెల్లించలేకపోయామని పేర్కొన్నారు.

## ఫసల్ బీమా ఐచ్ఛికం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. రైతులకు ఈ బీమా పథకాన్ని ఐచ్ఛికంగా మారుస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 2016లో ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు.. రుణం తీసుకునే ప్రతి రైతూ పీఎంఎఫ్‌బీవైలో చేరాలని నిబంధన పెట్టారు. అయితే, వ్యవసాయ బీమా పథకంలోని లొసుగులను సరిదిద్దేందుకు ఈ నిబంధనను సడలించి పీఎంఎఫ్‌బీఐని ఐచ్ఛికం చేస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రైతులనుంచి వచ్చిన అభ్యర్థనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో 58శాతం రైతులు రుణగ్రహీతలేనని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ బుధవారం ఢిల్లీలో సమావేశమె పలు నిర్ణయాలు తీసుకుంది. స్వచ్ఛభారత్ మిషన్ రెండో దశకు పచ్చజెండా ఊపింది.

### కేబినెట్ తీసుకున్న మరికొన్ని నిర్ణయాలు

- పాడి రుణాలపై ఇచ్చే వడ్డీ రాయితీని 2శాతం నుంచి 2.5 శాతానికి పెంచాలి. దీనివల్ల సుమారు 95లక్షల మంది రైతుకు లబ్ధి.
- 2019-2024 మధ్యకాలంలో 10వేల రైతు ఉత్పత్తి సంస్థ(ఎఫ్‌పీవో)ల ఏర్పాటు. దీనికి సుమారు 4500 కోట్లు ఖర్చవుతుందని అంచనా.
- గుజరాత్‌లోని భాస్కరాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో ఇన్ఫర్మాటిక్స్‌ను మరింత అభివృద్ధి చేసి జాతీయ సంస్థగా మార్చేందుకు ఆమోదం.
- ఇన్-విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) క్లినిక్‌లు, వాటి అనుబంధ సేవల నియంత్రణ బిల్లును ఆమోదించింది.

## సీవీసీగా సంజయ్ కొఠారి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కొత్త చీఫ్(సీవీసీ)గా రాష్ట్రపతి మాజీ కార్యదర్శి సంజయ్ కొఠారి ఎంపికయ్యారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ.. మెజారిటీ అభిప్రాయం మేరకు బుధవారం ఈ నిర్ణయాన్ని వెలువరించింది. కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)కు కూడా కొత్త చీఫ్‌ను ఎంపిక చేసింది. సమాచార, ప్రసార శాఖ మాజీ కార్యదర్శి, ప్రస్తుతం సమాచార కమిషనర్‌గా వ్యవహరిస్తున్న బిమల్ జుల్కాకు సీఐసీ బాధ్యతలు అప్పగించారు. విజిలెన్స్ కమిషనర్‌గా సురేశ్ పటేల్, సమాచార కమిషనర్‌గా అనితా పాండోవ్‌ను ఎంపిక చేశారు.

## చైనా ల్యాబ్ నుంచే కొవిడ్-19

న్యూఢిల్లీ, బీజింగ్, టోక్యో: ప్రపంచాన్ని వణికిస్తున్న కొవిడ్-19 వైరస్ మూలాలు చైనాలోని ఒక ప్రయోగశాలలో ఉన్నాయా? సౌత్ చైనా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నిపుణులు ఈ ప్రశ్నకు అవుననే సమాధానం ఇస్తున్నారు. 'ద పాజిబుల్ ఆరిజన్స్ ఆఫ్ 2019-ఎన్‌సీవోవీ కరోనా వైరస్' పేరుతో వారు ఒకవ్యాసం రాశారు. దాని ప్రకారం.. చైనాలోని 'వూహాన్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్'లో గబ్బిలాలపై కొంతకాలంగా పరిశోధనలు జరుగుతున్నాయి. వైరస్‌కు కేంద్రస్థానంగా భావిస్తున్న వూహాన్‌లోని సీఫుడ్ మార్కెట్‌కు కేవలం 300 గజాల దూరంలో ఉందీ పరిశోధన కేంద్రం. ఒకరోజు ఆ కేంద్రంలోని గబ్బిలాలు అక్కడున్న పరిశోధకుడిపై దాడి చేశాయని.. వాటి రక్తం అతడి చర్మంపై పడిందని, వాటి మూత్రం కూడా అతడిపై పడిందని వర్సిటీ నిపుణులు తమ పత్రంలో పేర్కొన్నారు. దీంతో ఆ పరిశోధకుడు రెండువారాలపాటు స్వయంగా క్వారంటైన్‌లో ఉన్నాడని వివరించారు. మరోవైపు కొవిడ్-19 మృతుల సంఖ్య చైనాలో 2000 దాటింది. ప్రపంచవ్యాప్తంగా 75 వేల మందికిపైగా ఆ వైరస్ బారిన పడ్డారు. వారిలో 74వేల మంది చైనీయులు కాగా.. 1000 మందికి పైగా బాధితులు ఇతరదేశాల్లో ఉన్నారు. ఆ వెయ్యి మందిలోనూ 621 మంది జపాన్ తీరంలో క్వారంటైన్‌గా మారిన డైమండ్ ప్రిన్సెస్ నౌకలోని వారే! ఆ నౌకలో ఉన్న 138 మంది భారతీయుల్లో ఆరుగురు ఇప్పటికే వైరస్ బారిన పడగా.. బుధవారం మరో వ్యక్తికి వైరస్ సోకినట్టు పరీక్షల్లో తేలింది. ఇక, వూహాన్ నుంచి మనదేశానికి తరలించి ఐటీబీపీ క్వారంటైన్‌లో ఉంచిన భారతీయులందరినీ ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది.

### 2022 నాటికి వ్యాక్సిన్

2022 నాటికి కొవిడ్-19 వైరస్‌కు టీకా సిద్ధం అవుతుందని పుణెలోని సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా తెలిపింది. అమెరికాకుచెందిన కొడాజెనిక్స్ కంపెనీతో కలిసి సిద్ధం చేశామని పేర్కొంది.

## క్షేమంగా చేరిన తెలుగు వారు

గుంటూరు(మెడికల్), ఫిబ్రవరి 19: ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్(కొవిడ్-19) వెలుగుచూసిన చైనాలోని వూహాన్ నగరం నుంచి ఇద్దరు గుంటూరు జిల్లావాసులు బుధవారం క్షేమంగా స్వస్థలాలకు చేరుకున్నారు. మూడు వారాల క్రితం 23 మంది తెలుగు వారు వూహాన్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడి మిలటరీ ఆస్పత్రిలో వారికి పలు దఫాలు వైద్యపరీక్షలు నిర్వహించగా, ఇన్ఫెక్షన్ లేదని తేలింది. దీంతో వారు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చేరుకున్నారు. ఈక్రమంలోనే గుంటూరుకు చెందిన ఇద్దరు బుధవారం స్వస్థలాలకు చేరుకున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు ప్రకటించాయి.

## భారత్ మమ్మల్ని బాగా చూడదు

**కానీ.. మోదీ అంటే చాలా ఇష్టం: ట్రంప్**

వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: "భారత్ మమ్మల్ని బాగా చూడదు. కానీ ప్రధాని మోదీ అంటే నాకు చాలా ఇష్టం" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. భారత్‌లో తొలిసారి పర్యటనకు వచ్చే నాలుగు రోజుల ముందు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పరిశీలకులు అంచనా వేస్తున్నట్లు తన పర్యటనలో భారత్‌తో వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చకపోవచ్చని ఆయన సంకేతమిచ్చారు. వాషింగ్టన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 24, 25 తేదీల్లో ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. ఢిల్లీ, అహ్మదాబాద్‌ను సందర్శిస్తారు. కాగా, ట్రంప్ వ్యాఖ్యలు భారత్‌కు అవమానమని కాంగ్రెస్ విమర్శించింది. భారత్-అమెరికా సంబంధాల్లో ఎన్నో ఏళ్లుగా సాధించిన పురోగతిని తీసిపారేయడమే అవుతుందని ఆ పార్టీ ప్రతినిధి మనీశ్ తివారీ ఢిల్లీలో విమర్శించారు. 70 లక్షల మంది ప్రజలు స్వాగతం పలకడానికి ట్రంప్ ఏమైనా దేవుడా అని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి కేంద్రాన్ని ప్రశ్నించారు.

అమెరికా నావల్ హెలికాప్టర్ల కొనుగోలుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ తయారు చేసే ఈ చాపర్ల కోసం భారత్ 260 కోట్ల డాలర్లు వెచ్చించనుందని సమాచారం.

# 'సెంటు' మంట!

(మొదటి పేజీ తరువాయి)

భూమిని వదులుకోవడానికి వారు ఏమాత్రం సిద్ధంగా లేరు. తమ భూముల్లోకి అడుగు పెట్టొదంటూ రెవెన్యూ అధికారులను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇప్పుడు అసైన్డ్, పేద రైతుల ఆందోళనలే. అధికారంలోకి వచ్చీ రాగానే, ఈ పథకం కోసం భూమిని సిద్ధం చేయాలని రెవెన్యూ శాఖను సీఎం జగన్ ఆదేశించారు. ప్రభుత్వం వద్ద ఉన్న భూమి 17వేల ఎకరాలేనని, ప్రైవేటుగా మరో 26వేల ఎకరాలకు పైగా సేకరించాల్సి ఉందని గత ఆగస్టులోనే ఆ శాఖ స్పష్టం చేసింది. దీనికి కనీసం రూ.16వేల కోట్లు అవసరమని అంచనా వేసింది. ఆ తర్వాత 20వేల ఎకరాలు సేకరిస్తే చాలని, దీనికి రూ.14వేల కోట్లు వ్యయం కానుందని ఆర్థికశాఖకు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు ఇచ్చింది. ఎంత ఖర్చయినా ఈ ప్రాజెక్టును పూర్తి చేద్దామని సర్కారు గొప్పలు చెబుతుంటే, ఖర్చుకు వెనుకాడకుండా భూసేకరణ చేసి పేదలకు స్థలాలు ఇస్తారేమోనని అంతా అనుకున్నారు. అయితే, అసలు కథ జనవరి నుంచే మొదలైంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న దృష్ట్యా ప్రైవేటుగా చేపట్టే భూసేకరణను తగ్గించుకోవాలని, వీలైనంత మేరకు ప్రభుత్వ భూములు గుర్తించి ఇంటిస్థలాలకు వాడుకోవాలంటూ సర్కారు జనవరిలో సరికొత్తగా మార్గదర్శకాలు ఇచ్చింది. అంతే, భూ సేకరణ లెక్కలు ఒక్కసారిగా మారిపోయాయి. కొత్తగా లిటిగేషన్ భూములు తెరపైకొచ్చాయి. ఆ భూములపై కోర్టుల్లో అఫిడవిట్లు వేయాలని, ఈలోగా వాటిని ఇంటిస్థలాలకు వాడుకోవాలని మార్గదర్శకాలు ఇచ్చారు. వీలైన మేరకు ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న భూమిని వాడుకోవాలని పేర్కొన్నారు. అయితే అందులో బాగా విలువైన భూములు మాత్రం రిజర్వ్ చేశారు. వీటిని బిల్డ్ ఏపీ మిషన్ కింద అమ్ముకోవాలన్నది సర్కారు వ్యూహం. ఇప్పటికే జిల్లాల వారీగా వాటి జాబితా సిద్ధం చేస్తున్నారు. ఇక, ప్రభుత్వ శాఖల వద్ద గ్రామీణ ప్రాంతాల్లో 1,181 ఎకరాలు, పట్టణాల్లో 230 ఎకరాలు ఉన్నట్లు తేల్చారు. లిటిగేషన్‌లో ఉన్న భూములు 1,076 ఎకరాలు. ఈ రెండు కేటగిరీల్లో నికరంగా 3.5లక్షల మందికి కూడా ఇంటి స్థలాలు ఇవ్వలేని పరిస్థితి. అధికారిక లెక్కల ప్రకారం ప్రభుత్వం వద్ద ఉన్న భూమి 20వేల ఎకరాలు. గ్రామీణ, పట్టణాల్లోని 14లక్షల మందికి కూడా సరిపోదు. ఇంకా ప్రైవేటుగా 9,619.22 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

### అసైన్డ్ భూములపై కన్ను

ఖరీదైన ప్రైవేటు భూములు సేకరించడం శ్రేయస్కరం కాదని భావించిన సర్కారు అసైన్డ్ భూముల సేకరణ నిబంధన తీసుకొచ్చింది. జీఓ.367లోనే ఈ అంశాన్ని చేర్చారు. "ప్రత్యామ్నాయ భూములు లేకుంటే, చాలా అరుదైన కేసుల్లో అసైన్డ్ భూములు తిరిగి స్వాధీనం చేసుకోవాలి. వాటిని ఇంటి స్థలాలకు వినియోగించాలి. వాటికి కూడా పరిహారం చెల్లించాలి" అని చేర్చారు. ఈ నిబంధన అమలుకు రెవెన్యూశాఖ సిద్ధమైంది. దీనిపై రైతులకు నోటీసులు ఇస్తున్నారు. వారిలో ఇప్పటికే 10మంది రైతులు కోర్టును ఆశ్రయించారు. సర్కారు ఇచ్చిన నోటీసుతో మనోవేదనకు గురై తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన రైతు సత్యాడ బాలరాజు(46)మృతి చెందాడని ఆయన కుమార్తె ఫిర్యాదు చేశారు.

### రైతులకు నోటీసులు

భూ సేకరణ చట్టం ప్రకారం ప్రైవేటు భూముల సేకరణ ప్రక్రియ రైతుల సమ్మతి లేకుండా ముందుకు సాగదు. ఇప్పటికే ఇంటి స్థలాలకు భూములు ఇచ్చేది లేదని అనేక ప్రాంతాల్లో రైతులు తెగేసి చెబుతున్నారు. తప్పనిసరి భూసేకరణ విధించాలంటే ఇంటిస్థలం కోసం అన్నది సహేతుకమైన కారణం కాదు కాబట్టి దీన్ని అమలు చేయలేరు. దీంతో, పేదలు, దళితులు, బలహీనవర్గాల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములపై సర్కారు కన్నేసింది. ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్(పీఓటీ) నిబంధనల ప్రకారం ఈ భూములు పేదల చేతుల్లో ఉన్నా, యాజమాన్య హక్కు ప్రభుత్వానిదే. ప్రభుత్వ అవసరాల కోసం ఎప్పుడంటే అప్పుడు వెనక్కు తీసుకోవచ్చన్న నిబంధన ఉంది. దీన్ని ఆసరా చేసుకొని అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. ఇదే అంశాన్ని జీఓ.367లో ఒక క్లాజుగా చేర్చి.. ఇప్పుడు దాన్నే అసలైన అస్త్రంగా వాడుతోంది. రైతులకు నోటీసులు ఇస్తున్నారు. అల్లరి చేయకుండా ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు సమ్మతి తెలపాలంటూ పేద రైతులపై ఒత్తిడి చేస్తున్నారు.






Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com